# క్రాంతి

లోపలి పేజీల్లో...


| | |
|---|---|
| 9వ కాంగ్రెస్ నివేదిక | 3 |
| ఏ.పి. రాష్ట్ర కాన్ఫరెన్స్ | 17 |
| ఏ.పి. టాడా | 26 |
| రక్షణశాఖ ముడుపులు | 33 |
| శ్రావణ్ ఇంటర్వ్యూ | 34 |
| కత్తుల సమ్మడి కుక్కచావు | 42 |



భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) [పీపుల్స్‌వార్] రాష్ట్రకమిటీ అధికార పత్రిక

సంపుటి : 25 సంచిక : 2 మార్చి-ఏప్రిల్ 2001 వెల : ఐదు రూపాయలు


## తీవ్రమైన శత్రు నిర్బంధాన్ని అధిగమించి జయప్రదంగా ముగిసిన సి.పి.ఐ. (యం-యల్) [పీపుల్స్‌వార్] పార్టీ

# చారిత్రాత్మక 9వ మహాసభలు



## ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం చేద్దాం!
## స్థావర ప్రాంతాల నిర్మాణం వైపుగా పురోగమిద్దాం!!



కాంగ్రెస్ ప్రారంభ ప్రదర్శనకి సన్నద్ధంగా.....



ఆంధ్రప్రదేశ్ ప్రజాగెరిల్లా సైన్యం ఆవిర్భావ ప్రదర్శన

# సి.పి.ఐ. (యం-యల్) [పీపుల్స్‌వార్] పార్టీ
# 9వ కాంగ్రెస్ నివేదిక

2001 మార్చి 4 భారత ప్రజలకు ఒక చారిత్రక దినం. ఆరోజు భారత కార్మికవర్గ అగ్రగామి దళమైన భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) [పీపుల్స్‌వార్] తన 9వ (2వ) కాంగ్రెస్‌ని ప్రారంభించింది. ఈ కాంగ్రెస్ 31 సం॥ల విరామం తర్వాత జరిగింది. కామ్రేడ్ చారుమజుందార్ నేతృత్వంలో 1970 సం॥రంలో జరిగిన ఎనిమిదో (1వ) పార్టీ కాంగ్రెస్ తర్వాత పార్టీ తన మునుపటి శక్తిని పొందటమే గాక అధిగమించింది కూడా. దేశంలోని రెండు ప్రముఖ ఎం-ఎల్ పార్టీలైన సి.పి.ఐ. (యం-యల్) [పీపుల్స్‌వార్], సి.పి.ఐ. (యం-యల్) పార్టీ యూనిటీల ఐక్యతను దృఢతరం చేస్తూ నేటికి పార్టీ దేశంలోని 10 రాష్ట్రాలలో వ్యాపించి అపార అనుభవం సంపాదించింది.

ఆరోజు, దేశంలోని 10 రాష్ట్రాల నుండి వేలాది పార్టీ సభ్యులకు ప్రాతినిధ్యం వహిస్తూ 60 మంది ప్రతినిధులు, నేపాల్, టర్కీల నుండి వచ్చిన సౌహార్ద ప్రతినిధులు భారతదేశంలోని ఒకానొక పోరాట ప్రాంతంలో కామ్రేడ్స్ శ్యామ్, మహేష్, మురళీల కమ్యూన్ వద్ద సమావేశమైనారు. తీవ్ర నిర్బంధం మధ్య గాలింపు చర్యలు సాగుతున్నప్పటికీ 2001 మార్చి 22న నూతన కేంద్రకమిటీ ఎన్నికతో ఈ కాంగ్రెస్ విజయవంతంగా ముగిసింది.

**ప్రజాగెరిల్లా సైన్యం (పి.జి.ఏ.) ఈ మధ్యే ఆవిర్భవించిన నేపథ్యంలో జరిగిన 9వ కాంగ్రెస్ భారత విప్లవోద్యమంలో ఒక ముఖ్యమైన మూల మలుపు.** వాస్తవంగా పార్టీ మొత్తంగా దాదాపు రెండు సం॥ల పాటు సాగించిన సన్నాహక చర్యల సమాహారమే ఈ కాంగ్రెస్. అప్పటి కేంద్రకమిటీ (ప్రొవిజనల్) ముఖ్యమైన డాక్యుమెంట్లను రూపొందించటంతో ఇది మొదలైంది.

## 9వ మహాసభకు సన్నాహకాలు

మునుపటి 8వ కాంగ్రెస్ తర్వాత మూడు దశాబ్దాల అనంతరం ఈ కాంగ్రెస్ జరుగుతుండటంతో పార్టీ మౌలిక డాక్యుమెంట్ల రూపకల్పనకు సమగ్రమైన సన్నాహాలు జరిగాయి. ఈ 9వ కాంగ్రెస్ ఎనిమిదో కాంగ్రెస్ మౌలిక సూత్రాలను ఎత్తిపట్టడమే కాదు, సి.పి.ఐ. (యం-యల్) ఆవిర్భావ సమయంలో ప్రాథమిక రూపంలో రూపొందిన పంథాను ఇది మరింత అభివృద్ధి పర్చి, పరిపుష్టం చేసింది. ఈ సందర్భంగా కేంద్రకమిటీ (ప్రొవిజనల్) సవరింపబడిన మొదటి-ఒరిజినల్- కార్యక్రమం-నిబంధనావళిపై; ప్రస్తుత జాతీయ, అంతర్జాతీయ పరిస్థితిని విశ్లేషించిన రాజకీయ తీర్మానంపై; గత 30 సంవత్సరాల అనుభవాల (సైనిక పంథాకి సంబంధించిన ముఖ్య సూత్రాలు కూడా దీంట్లో భాగం) మదింపు ప్రాతిపదికన మెరుగుపర్చిన వ్యూహం-ఎత్తుగడల డాక్యుమెంటుపై ముసాయిదాలను రూపొందించింది. అల్లే, ప్రధానంగా మునుపటి సి.పి.ఐ. (యం-యల్) [పీపుల్స్‌వార్] 1995లో ప్రత్యేక కాన్ఫరెన్స్ జరుపుకున్న నాటి నుండి గత ఐదేళ్ళుగా పొందిన అనుభవాల మదింపు ఆధారంగా, మునుపటి సి.పి.ఐ. (యం-యల్) పార్టీయూనిటీ కాన్ఫరెన్స్ నిర్వహించుకున్న నాటి నుండి 3 సం॥లలో పొందిన అనుభవాల మదింపుపై ప్రధానంగా ఆధారపడి రూపొందించుకున్న రాజకీయ, నిర్మాణ సమీక్షలను, ఆర్థిక పాలసీపై ముసాయిదాలను కూడా సిద్ధపర్చి, అభివృద్ధి పర్చింది.

పి.ఓ.ఆర్. మినహా తక్కిన పై డాక్యుమెంట్లన్నింటినీ రాష్ట్ర కాన్ఫరెన్సులు జరగడానికి చాలా ముందుగా కేంద్రకమిటీ (ప్రొవిజనల్) రూపొందించింది. కేంద్ర పి.ఓ.ఆర్. 2000 సం॥రం ఆగస్టులో పంపిణీ అయింది. ఈ డాక్యుమెంట్లన్నీ ప్రాంతీయ భాషలలోకి అనువాదమైనాయి. పార్టీ మొత్తంగా ప్రతి సభ్యుడికీ వీటిని అందజేయటం జరిగింది. పార్టీ వ్యాప్తంగా వీటిపై చర్చలు, అధ్యయన తరగతులు, సమావేశాలు నిర్వహించటమైంది. కాంగ్రెస్‌లో చర్చింపదగిన విభిన్న రాజకీయాంశాలపై నోట్స్ కూడా పంపకం చేయటం జరిగింది. సమగ్రంగా చర్చలు జరిగిన పిమ్మట పలుచోట్ల ఏరియా స్థాయి కాన్ఫరెన్సులు జరిగాయి. దేశ వ్యాప్తంగా 19 జిల్లా/డివిజనల్ స్థాయి కాన్ఫరెన్సులు, 3 రీజియనల్ కాన్ఫరెన్స్‌లు, 10 రాష్ట్రస్థాయి కాన్ఫరెన్సులు నిర్వహించటం జరిగింది. ఈ కాన్ఫరెన్స్‌లు 5 నుండి 15 రోజుల పాటు జరిగాయి. ఈ కాన్ఫరెన్సుల ద్వారా డాక్యుమెంట్లపై వందలాది సవరణలు జరిగి కాంగ్రెస్‌కి సమర్పించటం జరిగింది. దీంతోపాటుగా ప్రతి రాష్ట్రం, స్పెషల్ జోన్ కూడా ఉద్యమంలోని పలు బలహీన అంశాలను గుర్తిస్తూ వాటిని తగ్గించి, ఉద్యమాన్ని పురోగమింపజేసే పద్ధతులను సూచిస్తూ తమ తమ సొంత రాజకీయ, నిర్మాణ సమీక్షలను రూపొందించుకున్నాయి. వీటితో పాటు రాష్ట్ర కాన్ఫరెన్సులలో కేంద్ర పి.ఓ.ఆర్.ని **సమర్పించటం జరిగింది. కేంద్ర పి.ఓ.ఆర్. ప్రజాయుద్ధాన్ని పురోగమింప జేసేందుకు మొత్తం పార్టీని, సాయుధ బలగాలను, ప్రజాసంఘాలను ముందుకు నడిపించే అంశాలపై దృష్టి సారించింది.**

## కమ్యూన్

కాంగ్రెస్ ప్రతినిధులు కమ్యూన్‌కి చేరుకున్నాక సన్నాహక చర్యలకు 10 రోజులు పట్టింది. వివిధ డాక్యుమెంట్లకు సంబంధించిన సవరణలను కేంద్రకమిటీ (ప్రొవిజనల్) క్రమపద్ధతిలో కూర్చి అధ్యయనం కోసం ప్రతినిధులకు అందించింది. మన రాజకీయ, సైనిక పంథాకి సంబంధించి కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల ప్రతినిధులు రూపొందించిన రెండు నోట్స్‌ని, వాటికి తన సమాధానాన్ని కేంద్రకమిటీ (ప్రొవిజనల్) కాంగ్రెస్ ప్రతినిధులకు అందించింది. వివిధ ప్రాంతాల నుండి రిపోర్టులపై సమాచారాన్ని ప్రతినిధులు ఇచ్చిపుచ్చుకున్నారు. ఈలోగా, కమ్యూన్ రక్షణ బృంద కామ్రేడ్స్ అనేక పుస్తకాలు, పత్రికలు, ఆధార గ్రంథాలతో 'కా॥ జోహార్ లైబ్రరీ'ని ఏర్పర్చారు. ''కామ్రేడ్స్ భాస్కరరావు-మల్లిఖార్జున్-నిర్మల్-ప్రసాద్ హాస్పిటల్'' పేరిట ఒక వైద్య కేంద్రాన్ని

ఏర్పర్చారు. 'భూమ్‌కాల్ తిరుగుబాటు అమరుల ప్రెస్' పేరిట ఒక కంప్యూటర్ రూమ్‌ని ఏర్పర్చారు. ఇది కాంగ్రెస్‌లో సమర్పించబోయే సవరణలను, తీర్మానాలను, నోట్స్‌ని, అనువాదాలు వగైరాలను టైప్ చేసి అందిస్తూ రాత్రింబవళ్ళూ పనిచేసింది. గెరిల్లావాణి పేరిట ఒక గోడ పత్రిక మొదలై రిపోర్టుల్ని, వ్యంగ్య రచనలను, కవితలను, మాత్రమే గాక కాంగ్రెస్‌పై సరదా వ్యాఖ్యానాలు కూడా అందించింది. ప్రధానంగా తెలుగులోనూ, గోండీ, ఇంగ్లీష్, హిందీ భాషల్లో కూడా రాసిన రచనలతో గెరిల్లావాణి కొత్త సంచిక ప్రతి రెండు లేక మూడు రోజులకోసారి కమ్యూన్‌లో కన్పించేది. ప్రతి సాయంత్రం జననాట్యమండలి, దండకారణ్య చేతన నాట్యమంచ్‌లు సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చేవి. ఒక డివిజనల్ కమిటీ సభ్యుడు స్ట్రీట్‌ప్లేలు నిర్వహించేవాడు. ప్రతి రాత్రి వివిధ కాన్ఫరెన్స్‌లకు పి.జి.ఏ. ఆవిర్భావానికి సంబంధించిన వీడియో క్యాసెట్లను, వుద్యమానికి సంబంధించిన ఇతర చిత్రీకరణలను ప్రదర్శించేవారు. అట్లే ఫిలిప్పైన్స్ ఉద్యమంపై సినిమాలను, చార్లీచాప్లిన్ సినిమాలను, ఇతర యుద్ధ సినిమాలను కూడా ప్రదర్శించారు. క్యాంప్‌లో వాలీబాల్, బాడ్మింటన్, చెస్ వంటి ఇతర వినోద కార్యక్రమాలు కూడా వుండేవి.

## కాంగ్రెస్ ప్రారంభం

అది 2001 సంవత్సరం మార్చి 4 ఉదయవేళ. 60 మంది ప్రతినిధులు, 150 మంది పి.జి.ఏ. పోరాట యోధులతో సహా క్యాంప్ మొత్తంగా 'తాళ్ళగూడెం అమరుల గ్రౌండ్'కి చేరుకుంది. సెంట్రీలు మాత్రం తమ స్థానాలను వదిలిపెట్టలేదు. అమరుల స్థూపం ముందు 150 మంది పి.జి.ఏ. యోధులు మూడు వరసలలో నిలబడ్డారు. స్థూపం ఎడమవైపున పది వరుసలలో రాష్ట్రాల వారీగా ప్రతినిధులు నిలబడ్డారు. సభ ముందు పార్టీ జనరల్ సెక్రటరీ కా॥ గణపతి, మునుపటి పార్టీ యూనిటీ కార్యదర్శి, కేంద్రకమిటీ సభ్యుడు అయిన కా॥ ఎన్. ప్రసాద్, ఇరువురు విదేశీ సౌహార్ద్ర ప్రతినిధులు - నేపాల్ కమ్యూనిస్ట్ పార్టీ (మావోయిస్టు) పొలిట్‌బ్యూరో సభ్యుడు కా॥ గౌరవ్, టర్కీ కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్-లెనినిస్టు) పొలిట్‌బ్యూరో సభ్యుడు కా॥ ఒకాన్‌లు - నిలబడ్డారు. పార్టీ 8వ కాంగ్రెస్ నాటి నుండి నిరంకుశ రాజ్య యంత్రాంగంచేత, పాలకవర్గాల గూండాల చేత చంపబడిన వేలాది అమరుల స్మృతిలో స్మారక స్థూపం నిర్మించటం జరిగింది.

ప్లటూన్ కమాండర్ కా॥ రవిరాజ్ స్థూపం ముందు నిలబడిన వారందరినీ సావధానులు కమ్మంటూ కోరాడు. పార్టీ పతాకాన్ని ఆవిష్కరించాల్సిందిగా అతడు పార్టీ జనరల్ సెక్రటరీని కోరాడు. తెలుగులో అరుణపతాకపై పాటను పాడుతుండగా సభ మొత్తంగా అరుణపతాకకు వందనం సమర్పించింది. వైదొలుగుతున్న పార్టీ కార్యదర్శి కా॥ గణపతి సభనుద్దేశించి ప్రసంగిస్తూ ఈ కాంగ్రెస్ చారిత్రక ప్రాధాన్యతను వివరించాడు. (బాక్స్‌లో చూడండి).

తర్వాత, కేంద్రకమిటీ సభ్యుడు కా॥ బసవరాజ్ సైనిక వ్యవహారాలపై ఉపకమిటీ (స్కోమా) తరపున పి.జి.ఏ. పతాకాన్ని - సుత్తి కొడవలిపై తుపాకితో కూడిన ఎర్రజెండా - ఆవిష్కరించాడు. 2000 సం॥రం డిసెంబర్ 2న ఏర్పడిన పి.జి.ఏ. ఆవిర్భావపు విశిష్ట ప్రాధాన్యతను ఆయన వివరించాడు. ప్రజాసైన్యం ప్రాముఖ్యతను, పి.జి.ఏ.కి చెందిన ప్రధాన, ద్వితీయ, పునాది (మిలీషియా) బలగాలను సత్వరమే అభివృద్ధి చేయాల్సిన అవసరాన్ని సభకు వివరించాడు.



ఆంధ్రప్రదేశ్ ప్రజాగెరిల్లా సైన్యం ఆవిర్భావ ప్రదర్శన

# కార్యదర్శి ప్రారంభోపన్యాసం

కా॥ చారుమజుందార్ అమరత్వం తర్వాత పార్టీ ముక్కచెక్కలై పోయింది. పార్టీకి చెందిన ఆంధ్రప్రదేశ్ యూనిట్ 1970 లలో మితవాద రివిజనిజంకి, అతివాద దుస్సాహసికతత్వంకి వ్యతిరేకంగా పోరాటంలో తనకుతానుగా బలోపేతమైంది. గతానికి సంబంధించిన ఈ సరైన రాజకీయ, నిర్మాణపర సమీక్ష కారణంగా మనం ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోగలగడమే కాక, కమ్యూనిస్టు విప్లవకారుల ఏకీకరణ వైపుకు చర్యలు చేపట్టగలిగాం. ఈ సమీక్ష, మరియు నూతన కార్యాచరణ ప్రాతిపదికనే సి.పి.ఐ. (యం-యల్) [పీపుల్స్‌వార్] ఆవిర్భవించింది.

ఇతర ఎం-ఎల్ గ్రూపులు, పార్టీల లాగా మనం కేవలం సిద్ధాంత చర్చలకే పరిమితం కాకుండా వర్గ పోరాటాన్ని వృద్ధిచేసి, తీవ్రతరం చేసి కాలపరీక్షకు నిలిచి నెగ్గిన పార్టీగా ఆవిర్భవించాం. దీని ఫలితంగా 1985 నుండి మనపై సాగుతున్న తీవ్ర నిర్బంధాన్ని ఎదుర్కోగలగడమేకాక, 1985-1992 కాలంలో రెండు అంతర్గత సంక్షోభాలను కూడా అధిగమించగలిగాం. అంతేగాక అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంపై చైనాలోని రివిజనిజపు వ్యతిరేక ప్రభావం నుండి నిలదొక్కుగలిగాం. 1970 కాంగ్రెస్ నిర్దేశించిన మౌలిక పంథాకు కట్టుబడే కొనసాగుతూ వచ్చాం.

అయితే వర్గ పోరాట అవసరాల కనుగుణంగా మన ఎత్తుగడలను మార్చుకోగలిగాం. అలా కాకుంటే మనం పురోగమించటం అసాధ్యమయేది. దృఢమైన రాజకీయపంథా పునాదిపై ఆంధ్రప్రదేశ్‌లో చాలా కొద్ది ప్రాంతాల నుండి మొదలై మనం దేశంలోని పలు ప్రాంతాలలో పార్టీని అభివృద్ధి చేయగలిగాం. అలాగే గత ఆచరణను (1970ల మొదట్లోని) సమీక్షించుకునే క్రమంలోనే మునుపటి పార్టీ యూనిటీ కూడా మితవాద, అతివాద పంథాలపై పోరాడుతూ బీహార్‌లో ఉద్యమాన్ని నిర్మించి బెంగాల్, పంజాబ్, ఢిల్లీ తదితర ప్రాంతాలకు వ్యాపించింది. పార్టీ యూనిటీ 1987, 1993 కాన్ఫరెన్స్‌లలో రెండు పంథాల మధ్య పోరాటం ద్వారా తన కార్యక్రమాన్ని వృద్ధి చేసుకుని వ్యవసాయ, జాతుల సమస్యలపై కార్యక్రమాన్ని, గెరిల్లాజోన్లను నిర్మించే పర్‌స్పెక్టివ్‌ని చేపట్టింది.

పాలక వర్గాలను ఎదుర్కొని, ఉద్యమాన్ని వున్నత స్థాయికి తీసుకు పోవాలంటే మనం ఈ లక్ష్యంపట్ల ప్రజలకు విశ్వాసం కల్గేలా చేయాలి. ఈ 9వ కాంగ్రెస్ ముందున్న అతి ప్రధాన కర్తవ్యం ఇదే. డాక్యుమెంట్లను చర్చించబోతున్నపుడు మనం ఈ విషయాన్ని తప్పక దృష్టిలో వుంచుకోవాలి.

అంతర్జాతీయ స్థాయిలో ఎం-ఎల్-ఎమ్ మార్గదర్శకత్వంలో ప్రజాయుద్ధం ఎదుగుతూ వస్తోంది. మావోయిజంని ఆమోదించే శక్తులన్నింటినీ ఏకం చేసేందుకు ప్రాథమికంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ లక్ష్య సాధనకు మనం కూడా ఓ మేరకు తోడ్పాటునందిస్తూ వస్తున్నాం. మన విప్లవం ప్రపంచ సోషలిస్ట్ విప్లవంలో భాగం. మన విప్లవాన్ని అభివృద్ధి చేసుకోవటం, ప్రజాయుద్ధాన్ని వృద్ధిపరుస్తున్న అంతర్జాతీయ శక్తులను ఐక్యపర్చటం అనే రెండూ ఈ లక్ష్యసాధనలో భాగమే.

పార్టీ, సాయుధ ప్రజా బలగాలు, ఐక్య సంఘటన అనేవి మనం వృద్ధిపర్చాల్సిన మూడు అంశాలు. ఇందుకోసం నిర్దిష్ట కర్తవ్యాలను రూపొందించుకోవాల్సి వుంది. పార్టీ సైద్ధాంతిక భావజాల స్థాయిని పెంచుకోవాల్సి వుంది. ఇందుకోసం గాను మనం శిక్షణను అందించాల్సి వుంది. ఈరోజు మన ముందున్న ప్రధాన కర్తవ్యాల సాధనకు పార్టీ స్థాయి తగినంతగా లేదు.

దేశ విస్తృత పరిమాణాన్ని, ప్రాంతాల మధ్య విస్తృతమైన వ్యత్యాసాలను గమనించినట్లయితే, ఉద్యమాన్ని ముందుకు తీసుకు పోవడానికి గాను ప్రతిఒక్క రాష్ట్ర, రీజినల్ కమిటీ కూడా సృజనాత్మకమైన, వికేంద్రీకృతమైన రీతిలో పార్టీ పంథాను అమలు చేయాల్సి వుంటుంది. అలాగే అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలోనూ కొన్ని తప్పుడు పంథాలు వుంటున్నాయి. వాటికి వ్యతిరేకంగా మనం పోరాడాల్సి వుంది.

ప్రజా గెరిల్లా సైన్యాన్ని బలోపేతం చేసి, దాన్ని సాయుధం చేసి విశాల ప్రజా మిలీషియాకు శిక్షణ నివ్వడం ద్వారా ప్రజాయుద్ధానికి ప్రజలను సమీకరించటమే మన ముందున్న కీలకమైన కర్తవ్యం. పార్టీని, ఉద్యమాన్ని బలోపేతం చేయటం దీనిమీదే ఆధారపడి వుంది. ప్రజల అధికారం నెలకొన్న ప్రాంతాలలో మనం సహకార ప్రాతిపదికన నూతన ఉత్పత్తి సంబంధాలను నిర్మించాలి. విప్లవకరమైన మార్గంలో ప్రజల జీవితాలను, భావాలను పరివర్తన చెందించాలి. ఉపరితలాన్ని మనం విప్లవీకరించాలి. ప్రజాధికార అంగాలను, ప్రజాసంఘాలను ప్రజాసైన్యం నిలబెట్టాల్సి వుంది.

మన ఉద్యమం వివిధ ప్రాంతాల్లో వివిధ స్థాయిల్లో అభివృద్ధి చెందింది. అయితే విప్లవోద్యమాన్ని పురోగమింపజేసే దృష్టితో చూస్తే మనం వ్యూహాత్మక ప్రాంతాలపై కేంద్రీకరించాల్సిన అవసరం వుంది. ఈ మూడు ప్రధాన కర్తవ్యాలను మనం చేపట్టినట్లయితే మనం తప్పకుండా గొప్ప విజయాలనే సాధించగలం.

అంతర్జాతీయ స్థాయిలో పెట్టుబడికి శ్రమకు మధ్య వైరుధ్యం తీవ్రతరమవుతూ సామ్రాజ్యవాదం తన ప్రజలనుండే వ్యతిరేకతను ఎదుర్కొంటోంది. మన పార్టీ పరిణతి చెందింది. దానికి సుసంపన్నమైన అనుభవాలున్నాయి. అది మన విప్లవాన్ని ముందుకు తీసుకుపోగలుగుతుంది. ఆ విధంగా ప్రపంచ సోషలిస్టు విప్లవాన్ని కూడా ముందుకు తీసుకుపోతుంది. ఈరోజు ప్రపంచంలో ఐదు దేశాలలో ప్రజాయుద్ధం నడుస్తోంది. అయితే ఇదేమంత ప్రాధాన్యత కల్గిన అంశం కాదని ఎవరైనా చెప్పొచ్చు. కానీ ఈ శక్తే అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమానికి అగ్రగామి దళంగా వ్యవహరిస్తూ ఇతరులకు వేగుచుక్కలాగా పనిచేస్తోంది.

దక్షిణాసియా ప్రపంచ విప్లవ ప్రధాన కేంద్రంగా మారుతున్న సూచనలు కన్పడుతున్నాయి. నేపాల్‌లో మన శక్తులు ప్రముఖ విజయాలు సాధిస్తున్నారు. చైనా విప్లవం రివిజనిస్టుగా మారిపోయిన తర్వాత భారత విప్లవమే ప్రపంచ విప్లవానికి అత్యంత ప్రాధాన్యత కల్గిన అంశంగా మారింది. ఈ చారిత్రక బాధ్యతను భారత కార్మికవర్గం ధైర్య సాహసాలతో నెరవేర్చాల్సి వుంది.

నేపాల్, భారత దేశాల విప్లవోద్యమాలు ప్రపంచ ప్రజలకు గొప్ప స్ఫూర్తిదాయకంగా వుంటున్నాయి. అయితే ఈ రెండు దేశాల విప్లవోద్యమాల ప్రాధాన్యతను చూసి, సామ్రాజ్యవాదం ఈ ఉద్యమాలను వివిధ మార్గాల్లో నిర్మూలించడానికి ప్రత్యక్షంగా కార్యాచరణకు దిగుతోంది. మనం మన పాలకులనేకాక సామ్రాజ్యవాదుల విప్లవ-ప్రతీఘాతక చర్యలను ఎదుర్కోవడానికి కూడా సన్నద్ధమవ్వాలి. కాబట్టి 9వ కాంగ్రెస్ ఈ చారిత్రక కర్తవ్యాలను దృష్టిలో వుంచుకుంటూనే తన సమాలోచనలను, చర్చలను నిర్వహించి నిర్ణయాలు తీసుకోవాలి. ఈ పరిస్థితికి అనుగుణంగా మనం ఎదుగుతామన్న విశ్వాసం భారత ప్రజలకు వుంది.

ఈ ఉపన్యాసం తరువాత కేంద్రకమిటీ సభ్యుడు కా॥ ప్రసాద్ అమరుల స్థూపాన్ని ఆవిష్కరించాడు. తుపాకులను అవనతం చేసి, టోపీలను చేతిలో వుంచుకుని సభ యావత్తూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించింది. తర్వాత కా॥ ప్రసాద్ 8వ కాంగ్రెస్ నాటి నుండి ప్రాణాలర్పించిన వేలాది అమరుల గురించి, ఆశయం కోసం ప్రాణార్పణ చేసిన వారి బాటలో నడవాల్సిన అవసరం గురించి పేర్కొంటూ క్లుప్తంగా ప్రసంగించాడు.

తదనంతరం నేపాల్ కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)కి చెందిన కా॥ గౌరవ్ ప్రసంగించాడు. కాంగ్రెస్‌కి, పి.జి.ఏ. యోధులకి, సభలోని యావన్మందికీ తన పార్టీ నుండి సౌహార్ద్ర అభినందనలను అందించాడు. రెండు దేశాల మావోయిస్టు పార్టీల మధ్య ప్రగాఢ సంబంధాల గురించి పేర్కొన్నాడు. రెండు దేశాల ప్రజల మధ్య సాంస్కృతిక ఏకత్వం, రెండు పార్టీల మధ్య సౌహార్ద్ర సంబంధాలు, ఒకే రాజకీయ పంథాలు, భారత విస్తరణవాదపు ఉమ్మడి శత్రువుకు వ్యతిరేకంగా చేస్తున్న పోరాటం వంటివన్నీ రెండు పార్టీల మధ్య బంధాలు దృఢతరం కావడంలో తోడ్పడ్డాయని కా॥ గౌరవ్ పేర్కొన్నాడు.

చివరగా, టి.కె.పి./యం.యల్.కి చెందిన కా॥ ఒకాన్ సభనుద్దేశించి ప్రసంగించాడు. టి.కె.పి./ఎం.ఎల్. కేంద్రకమిటీ మరియు పార్టీ శ్రేణుల తరపున, టర్కీ కార్మిక, రైతాంగ విముక్తి సైన్యం (TIKKO-టిక్కో) తరపున ఆయన సి.పి.ఐ. (యం-యల్) [పీపుల్స్‌వార్] కేంద్రకమిటీ (ప్రొవిజనల్)కి, 9వ కాంగ్రెస్ ప్రతినిధులకు, నేపాల్ కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ప్రతినిధులకు, ప్రజాగెరిల్లా సైన్యం కమాండర్లకు, పోరాట యోధులకు విప్లవాభివందనాలు తెలియజేశాడు. **'మీ పోరాటం మా పోరాటం కూడా'** అని చెప్పాడు. టర్కీలో, టర్కిష్ కుర్దిస్తాన్‌లో ఉమ్మడి శత్రువైన సామ్రాజ్యవాదంతో పోరాడుతున్న కామ్రేడ్స్ మీకు తోడుగా వున్నారన్న విషయం మీరెన్నటికీ మరువకూడదంటూ ఆయన పేర్కొన్నాడు.

ఫిలిప్పైన్స్ కమ్యూనిస్టు పార్టీ అనివార్య పరిస్థితుల కారణంగా తన ప్రతినిధులను పంపలేక పోయింది కానీ 9వ కాంగ్రెస్‌కి ఒక సౌహార్ద్ర సందేశాన్ని పంపింది.

చిట్టచివరిగా సభ కాంగ్రెస్ ప్రతినిధులు చర్చలు నిర్వహించే కా॥ చారుమజుందార్ హాల్ వద్దకు ఊరేగింపు తీసింది. **'స్థావర ప్రాంతాలు నిర్మించేందుకు పురోగమిద్దాం', 'మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధానం వర్ధిల్లాలి', 'పార్టీలో కార్మికవర్గేతర ధోరణులను నాశనం చేద్దాం'** వంటి వివిధ భాషల్లో నినాదాలతో, పాటలతో ఆ ప్రాంతం మొత్తం ప్రతిధ్వనించింది. కాంగ్రెస్ ప్రారంభ సమావేశం ముగియడంతో పి.జి.ఏ. యోధులు తయారు చేసిన తీపి వంటకాన్ని అందరికీ పంచిపెట్టారు.

## కాంగ్రెస్ ప్రతినిధుల సమావేశం

ప్రతి డెలిగేట్‌ని లాంఛనంగా పరిచయం చేయటంతో కాంగ్రెస్ మొదలైంది. వైదొలగనున్న కేంద్రకమిటీ (ప్రొవిజనల్) సభ్యుడు కా॥ రాంజీ ఒక్కో ప్రతినిధి యొక్క విప్లవ జీవిత చరిత్రను క్లుప్తంగా



**సమావేశంలో 9వ కాంగ్రెస్**

పరిచయం చేశాడు. తర్వాత, కాంగ్రెస్ కార్యక్రమాల నిర్వహణకు ఐదుగురు సభ్యులతో కూడిన అధ్యక్ష వర్గం ఎన్నికైంది. చర్చలు సాఫీగా జరిగేలా చూసేందుకుగాను వైదొలగనున్న కేంద్రకమిటీ (ప్రొవిజనల్) స్టీరింగ్ కమిటీగా వ్యవహరించింది. దీని తర్వాత సి.పి.ఎన్. (ఎమ్), టి.కె.పి./ఎం.ఎల్. సోదర పార్టీల సందేశాలను చదివి వినిపించటమైంది. (సందేశాల సంక్షిప్త భాగాలకు తదుపరి పేజీల్లో చూడండి).

సునిశిత, సుదీర్ఘ చర్చల అనంతరం కాంగ్రెస్ కింది డాక్యుమెంట్లను ఆమోదించింది. అవి 1. కార్యక్రమం, 2. నిబంధనావళి, 3. వ్యూహం-ఎత్తుగడలు, 4. రాజకీయ తీర్మానం, 5. రాజకీయ నిర్మాణ సమీక్ష, 6. ఆర్థిక విధానం.

దిగువ స్థాయి కాన్ఫరెన్స్‌లు, అలాగే విడివిడి వ్యక్తులు ప్రతిపాదించిన సవరణలను కేంద్రకమిటీ (ప్రొవిజనల్) ఏర్చి కూర్చింది (Processed). ఆమోదింపబడిన సవరణలను తర్వాత ప్రతినిధులకందరికీ అందించటమైంది. అన్ని సవరణలూ సభ ముందుంచగా, ప్రధానమైన, సంక్లిష్టమైన అంశాలపైనే చర్చలు జరిగాయి. కొన్ని సందర్భాలలో భేదాభిప్రాయాలు నిశితంగా వున్నప్పటికీ మరింత వున్నతమైన సైద్ధాంతిక-రాజకీయ ఐక్యత సాధించే గతి తార్కిక క్రమంలో భాగంగానే చర్చలూ, వాదనలూ జరిగాయి.

1970నాటి పార్టీ కార్యక్రమం యొక్క విప్లవకర పంథాని ఈ కాంగ్రెస్ దృఢంగా ఎత్తి పట్టింది. గత 3 దశాబ్దాలకు పైగా అంతర్జాతీయ, జాతీయ పరిస్థితిలోని మార్పులను, పరిణామాలను పార్టీ కార్యక్రమం ప్రతిబింబించినందువల్ల కాంగ్రెస్ దాన్ని సరిదిద్ది వృద్ధి చేసింది.

మార్క్సిజం-లెనినిజం-మావోయిజంని పార్టీ మార్గదర్శక సిద్ధాంతంగా కాంగ్రెస్ దృఢంగా నొక్కి చెప్పింది. మార్క్సిజం అభివృద్ధిలో మూడవదిగా, వున్నత దశగా పేర్కొంటూ గతంలో వాడిన మావోసేటుంగ్ ఆలోచనా విధానం అనే పదాన్నే ఈ కాంగ్రెస్ కూడా ధృవీకరించినప్పటికీ, మావోయిజం అనే పదమే మరింత శాస్త్రీయమైనదిగా కాంగ్రెస్ భావించింది. మావోసేటుంగ్ ఆలోచనా విధానం అనే పదాన్ని దాని విశ్వ వ్యాప్త ప్రాముఖ్యతను తోసిపుచ్చేందుకే వాడుతూ వచ్చిన కొన్ని రివిజనిస్టు పార్టీల నుండి, ఎం-ఎల్ పార్టీలుగా చెప్పబడుతున్న వాటి నుండి పార్టీని స్పష్టంగా ఇప్పుడు మావోయిజం అనేది వేరుపరుస్తుంది కాబట్టి ఈ పదమే సరైందని కాంగ్రెస్ భావించింది. పెరుగుతున్న ఉద్యమావసరాల ప్రాతిపదికన పార్టీ నిబంధనావళిని మెరుగుపర్చి తుదిరూపమిచ్చింది.

సంలీనమైన రెండు పార్టీల అనుభవాలను (1995 నుండి మునుపటి పీపుల్స్‌వార్, 1997 నుండి మునుపటి పార్టీ యూనిటీల అనుభవాలు) రాజకీయ, నిర్మాణ సమీక్ష మదింపు వేసింది. అవసరమైన చోట్ల గతంలోని ఆచరణను కూడా అది విశ్లేషించి కొన్ని నిర్దిష్ట అంశాలపై పార్టీ అవగాహనను మెరుగుపర్చింది. **కేంద్ర పి.ఓ.ఆర్. దేశ వ్యాప్తంగా ప్రజాయుద్ధాన్ని పురోగమింప జేయడాన్ని ప్రధాన కర్తవ్యంగా నిర్దేశించింది. ప్రజా సంఘాలను, పి.జి.ఏ.ని, మొత్తం పార్టీని ప్రజాయుద్ధం వైపు నడిపించేందుకు పి.ఓ.ఆర్. ప్రయత్నించింది.** పార్టీలోని ప్రధాన బలహీనతలను కాంగ్రెస్ గుర్తించి పార్టీలో తలెత్తిన కార్మికవర్గేతర ధోరణులను ప్రక్షాళన చేయడానికి పిలుపిచ్చింది. పార్టీ సైనిక పంథాను రూపొందించే క్రమంలో పి.ఓ.ఆర్. గెరిల్లా జోన్‌లకు స్థావర ప్రాంతాలకు మధ్య అనుసంధానానికి, పి.జి.ఏ. ప్రధాన పాత్రకు, భారతదేశ నిర్దిష్ట పరిస్థితుల్లో దీర్ఘకాల ప్రజాయుద్ధ క్రమంలో మూడు అద్భుత ఆయుధాల మధ్య సంబంధాలకు సంబంధించిన అవగాహనను వృద్ధి పర్చింది. స్థావర ప్రాంతాల స్థాపనలో గెరిల్లాజోన్ ఒక పరివర్తనా దశగా అది స్పష్టంగా ప్రకటించింది. గెరిల్లా స్థావర ప్రాంతాల స్థాపనతో స్థావర ప్రాంతాల నిర్మాణ క్రమం మొదలవుతుందని కేంద్ర పి.ఓ.ఆర్. పేర్కొంది. ఈ గెరిల్లా స్థావరాలలో నూతన అధికారం బీజరూపంలో నెలకొంటుంది. భోగోళికంగా అనుకూలమైన ప్రాంతాన్ని, బలమైన ప్రజా పునాదిని కలిగిన గెరిల్లాజోన్‌కి చెందిన ప్రాంతాల్లో గెరిల్లా స్థావర ప్రాంతాలు నెలకొంటాయి.

కార్మికవర్గంలో మన పనిని మెరుగుపర్చుకోవడంలో వున్న వెలితిని (Lacunae) కూడా కాంగ్రెస్ సమీక్షించింది. కార్మికవర్గ పోరాటాల నుండి పార్టీ దూరమై పోవడంలో ఇది ప్రతిఫలించింది. కార్మికవర్గ నాయకత్వ పాత్రను నొక్కి చెప్పలేక పోవడంలో, లేక పార్టీ ద్వారా కార్మికవర్గ సిద్ధాంతం, రాజకీయాల నాయకత్వానికి మాత్రమే పరిమితమైనదిగా ఈ అంశాన్ని అవగాహన చేసుకోవడంలో కూడా కొద్దిమేరకు ఈ వెలితి ప్రతిఫలించింది. కార్మికవర్గాన్ని ప్రత్యేకించి సామ్రాజ్యవాద వ్యతిరేక, ప్రభుత్వ వ్యతిరేక అంశాలపై కూడగట్టి, గ్రామీణ ప్రాంత ఉద్యమాన్ని నిర్వహించడానికి పురోగామి కార్మికుల దళాలను పంపడంద్వారా ఈ పరిస్థితిని చక్కదిద్దుతానని కాంగ్రెస్ దృఢంగా ప్రతిజ్ఞ చేసింది.

మహిళా రంగంలో పార్టీ పనికి సంబంధించిన లోటుపాట్లను కూడా కాంగ్రెస్ / పి.ఒ.ఆర్. సమీక్షించి, మహిళా రంగంలో పనిని తీవ్రతరం చేయడానికి; పార్టీలో, పి.జి.ఏ.లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచడానికి; పార్టీలో, పి.జి.ఏ.లో మరింత ప్రముఖ పాత్ర చేపట్టేలా మహిళా కామ్రేడ్స్‌ని ప్రోత్సహించడానికి పూనుకుంటానని ప్రతిజ్ఞ చేసింది. పార్టీలో, ప్రజాసంఘాలలో, ప్రజా సైన్యంలో పితృస్వామ్యపు సకల వ్యక్తీకరణలకూ వ్యతిరేకంగా పోరాడతానంటూ కూడా కాంగ్రెస్ ప్రతిజ్ఞ చేసింది.

గత 30 సం॥లుగా దీర్ఘకాలిక ప్రజాయుద్ధం సాగించడంలో పార్టీ గడించిన సుసంపన్న అనుభవాలను కాంగ్రెస్ ఆమోదించిన వ్యూహం-ఎత్తుగడల డాక్యుమెంట్ ప్రతిబింబించింది. భారత సమాజ వర్గ విశ్లేషణను ఇది మెరుగుపర్చింది. పార్టీ సైనిక పంథాని ఈ డాక్యుమెంట్ సమీక్షించి భారతీయ ప్రత్యేక పరిస్థితికి మావోయిస్టు దీర్ఘకాల ప్రజాయుద్ధ సూత్రాలను అనువర్తింప జేసింది.

కమ్యూనిస్టు విప్లవకారుల ఏకీకరణ క్రమాన్ని మరింత త్వరితం చేయాల్సిన అవసరాన్ని కాంగ్రెస్ గుర్తించింది. 1998 ఆగస్ట్ నెలలో మునుపటి పీపుల్స్‌వార్, పార్టీ యూనిటీలు ఒకే పార్టీగా ఐక్యమవటం ఈ ఏకీకరణ క్రమంలో ఒక అత్యంత ప్రముఖ సంఘటనే అయినప్పటికీ ఇతర నిజమైన విప్లవకర శక్తులు ఇంకా ఐక్యతా క్రమానికి అవతలే మిగిలిపోయి వున్నారు. ఈ శక్తుల్లో అతి పెద్దదైన యం.సి.సి.

## మిలటరీ క్యాంపెయిన్‌లో భాగంగా పి.జి.ఏ. సాయుధ దాడుల క్రమం...

కేంద్రకమిటీ సభ్యులు కా॥ శ్యాం, మహేష్, మురళీలు అమరులై సంవత్సరం గడచిన సందర్భంగా ఐదు నెలల క్రితం అంటే 2000 సం॥రం డిసెంబర్ 2న ఆవిర్భవించిన ప్రజాగెరిల్లా సైన్యం శత్రు హంతక బలగాల నుండి సైనికపరమైన చొరవను తిరిగి సాధించటం ప్రారంభించింది. ఒకవైపున 9వ కాంగ్రెస్ సన్నాహక చర్యలు పరాకాష్టకు చేరుతుండగా, మరోవైపున పి.జి.ఏ. తన ఎదురుదాడిని ప్రారంభించింది. కాంగ్రెస్ జరుగుతున్న కాలంలో పి.జి.ఏ. చర్యలు తీవ్రతరమైనాయి. భారత దేశంలో విప్లవ యుద్ధాన్ని మరింతగా వృద్ధిపర్చే లక్ష్యంతో ప్రజాగెరిల్లా సైన్యం ఈ సంవత్సరం తొలి మూడు నెలల కాలంలో రెయిడ్లు, ఆంబుష్‌ల, విడి విడి చర్యల (Sparrow actions) పరంపరను మొదలెట్టింది.

### రెయిడ్లు :

9వ కాంగ్రెస్ జరుగుతుండగా మార్చి నెల రెయిడ్ల పరంపరకు సాక్షీభూతమై నిలిచింది.

* ఆంధ్రప్రదేశ్ రాష్ట్రకమిటీ మార్గదర్శకత్వంలో ప్రజాగెరిల్లా సైన్యం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి సొంత జిల్లా అయిన చిత్తూరు జిల్లా పీలేరు మండలం యల్లమంద గ్రామంలోని పోలీస్ క్యాంపుపై మార్చి 6న రెయిడ్–ఆంబుష్‌లను నిర్వహించింది. ఒక భూస్వామి ఇంట్లో తిష్ట వేసిన పోలీస్ క్యాంపులో మొత్తం 15 నుండి 20 మంది పోలీసులు వుండేవారు. పి.జి.ఏ.కి సంబంధించిన ఒక దళం క్యాంప్‌పై నేరుగా దాడి చేయగా మరో దళం క్యాంప్ పోలీసులకు దన్నుగా రాగలిగే అదనపు బలగాలపై మాటు దాడి కోసం కూచున్నాయి.

మార్చి 6 రాత్రి క్యాంప్‌పై దాడి జరిగింది. పోలీసులు ఈ దాడికి తాళలేక కకావికలై పరుగెత్తి పారిపోయారు. కొందరు లొంగిపోయారు. ఐదు ఎస్.ఎల్.ఆర్.లు, ఒక ఏ.కె. 47 రైఫిల్‌తో సహా మొత్తం 9 ఆయుధాల్ని పి.జి.ఏ. చేజిక్కించుకుంది. రెండు గంటల తర్వాత అదనపు బలగాలు క్యాంపును సమీపిస్తుండగా వారిపై మందుపాతరను పేల్చటం జరిగింది. అదనపు బలగాలు తృటిలో తప్పించుకున్నప్పటికీ పలువురికి గాయాలయినాయి. రాయలసీమ ప్రాంతంలో మొట్ట మొదటిసారిగా ఆయుధాల స్వాధీనం కోసం జరిగిన ఈ చర్య ప్రజానీకాన్ని ఉత్తేజపర్చగా ప్రభుత్వ యంత్రాంగాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది.

మార్చి 12న ఒరిస్సాలోని గజపతి జిల్లా ఉప్పలాడ పోలీస్ ఔట్‌పోస్ట్‌పై ఏ.ఓ.బి. యస్.జెడ్.సి. ఆధ్వర్యంలోని పి.జి.ఏ. యూనిట్ మెరుపుదాడి చేసింది. ఇద్దరు పోలీసులు మృతి చెందగా, నలుగురు గాయపడ్డారు. మిగిలిన వారు లొంగిపోయారు. ఈ దాడిలో 8 రైఫిల్స్, 1 సబ్‌మెషిన్‌గన్, ఒక రివాల్వర్‌తో పాటు 900 తూటాలు గెరిల్లాల వశమైనాయి.

మార్చి 20 రాత్రి ఏ.పి.యస్.సి. ఆధ్వర్యంలోని పి.జి.ఏ. కర్నూలు జిల్లాలోని శ్రీశైలం యాత్రా కేంద్రంకి 6 కి.మీ.ల దూరంలోని పోలీస్ అవుట్‌పోస్ట్ పైన, సున్నిపెంటలోని సి.ఐ. కేంద్రం మరియు పోలీస్ స్టేషన్‌పైన ఏకకాలంలో దాడి చేసింది. పోలీసులు లొంగిపోయారు. సున్నిపెంటలో కొన్ని రైఫిల్స్‌ని చేజిక్కించుకున్నారు. పోలీస్ స్టేషన్‌ని, సి.ఐ. జీపుని గెరిల్లాలు పేల్చివేశారు. ఇక శ్రీశైలం రెయిడ్‌లో ఒక పోలీసుకు గాయాలు కాగా ఇతరులు లొంగిపోయారు. ఐదు రైఫిల్స్, ఒక రివాల్వర్, కొన్ని 410 మస్కట్లు, రెండు హై ఫ్రీక్వెన్సీ కమ్యూనికేషన్ సెట్లు గెరిల్లాల వశమైనాయి.

* ఏప్రిల్‌లో కర్నూలు జిల్లాలో అటవీ ప్రాంతంలోని మరో పోలీస్ స్టేషన్‌పై కూడా పి.జి.ఏ. దాడి చేసి స్టేషన్‌ని వశపర్చుకుందిగాని ఆయుధాలను అప్పటికే పోలీస్ యంత్రాంగం తరలించేసింది. రాష్ట్రంలో మరికొన్నిచోట్ల రెయిడ్‌లు జరిగాయి కాని విఫలమైనాయి.

### ఆంబుష్‌లు :

* ఏ.ఓ.బి. యస్.జెడ్.సి.కి చెందిన విజయనగరం జిల్లా గుమ్మలక్ష్మీపురంలో జనవరి 27న గాలింపు చర్యలు చేస్తున్న పోలీస్ పార్టీపై పి.జి.ఏ. మాటుదాడి చేసింది. ఈ ఆంబుష్‌లో ఒక హెడ్‌కానిస్టేబుల్, ఒక పోలీసు హతమవగా మరో నలుగురు గాయపడ్డారు. పోలీస్ వాహనం ధ్వంసమైంది.

* జనవరి చివర్లో దండకారణ్యం (బస్తర్ జిల్లా) లోని మధ్ డివిజన్‌లో జరిగిన ఒక అపార్చునిటీ ఆంబుష్‌లో పోలీస్ గస్తీ బృందంపై దాడి జరిగింది. ఒక పోలీస్ హతమైనాడు.

* ఫిబ్రవరిలో విశాఖపట్నం జిల్లా చింతపల్లి సమీపంలో పి.జి.ఏ. జరిపిన మాటుదాడిలో ఒక పోలీస్ వాహనం మందుపాతరలో పేలిపోయింది. పలువురు పోలీసులు గాయపడ్డారు.

* ఏప్రిల్ 19న ఏ.ఓ.బి. యస్.జెడ్.సి.కి చెందిన ప్రజా గెరిల్లా సైనిక విభాగాలు తూర్పుగోదావరి జిల్లాలో గాలింపు చర్యలకు దిగిన పోలీస్ పార్టీపై ఆంబుష్ చేశాయి. ఒక రిజర్వ్ పోలీసు ఇనస్పెక్టర్, ముగ్గురు కానిస్టేబుళ్ళు, హతమవగా ఒక సబ్ ఇన్‌స్పెక్టర్ మందుపాతర ప్రేలుడులో తీవ్రంగా గాయపడినాడు.

### విడి విడి చర్యలు :

* ఈ సం॥రం తొలి మూడు నెలల్లో జరిగిన అనేక యాక్షన్స్‌లలో దండకారణ్యం బస్తర్ డివిజన్‌లో 9 మంది పోలీసు ఇన్ఫార్మర్లు తుడిచి పెట్టబడ్డారు. పార్టీ నాయకులను చంపే పథకంతో ఈ డివిజన్‌లోని మారుమూల ప్రాంతాల్లోకి ఈ పోలీస్ ఇన్ఫార్మర్లు చొచ్చుకు వచ్చారు.

* జనవరి నెలలో మహబూబ్‌నగర్ జిల్లాలో పదిర గ్రామంలో ఒక క్రూర హోంగార్డు ఖతమయ్యాడు. ఇతడు పోలీసుల పక్షాన పూర్తికాలం ఇన్ఫార్మర్‌గా పనిచేస్తూ గెరిల్లాలకు వ్యతిరేకంగా అనేక పోలీస్ బ్యాచ్‌లను ముందుండి నడిపించాడు.

* ఫిబ్రవరి నెలలో జరిగిన మరో విడి చర్యలో మహబూబ్‌నగర్ జిల్లాలోనే కల్వకుర్తి ప్రాంతంలో హన్మంతరెడ్డి అనే సబ్‌ఇన్‌స్పెక్టర్ ఖతమయ్యాడు.

* నల్గొండ జిల్లాలో ఒక హెడ్‌కానిస్టేబుల్‌పై గెరిల్లాలు దాడిచేసి చంపేశారు.

* మార్చి నెల చివర్లో నల్గొండ జిల్లా నారాయణపురం మండల కేంద్రంలో ఒక కానిస్టేబుల్‌ని చంపివేశారు.

* కరీంనగర్ జిల్లా కమలాపూర్‌లో ఒక కానిస్టేబుల్‌ని చంపేశారు. ఇది ఏరియాలోని ప్రధానమైన పోలీస్ హెడ్‌క్వార్టర్. దీంట్లో సి.ఆర్.పి.యఫ్. క్యాంపు, స్పెషల్ పోలీసు బలగాలు వుంటున్నాయి. ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేసిన చరిత్ర వీళ్ళది. అయినప్పటికీ పి.జి.ఏ. గెరిల్లాలు స్థానిక మిలీషియా తోడ్పాటుతో ఈ హెడ్‌క్వార్టర్‌పై దాడి చేయగలిగారు.

* నిజామాబాద్ జిల్లాలోని గంగారంలో ఒక తెలుగుదేశం పార్టీ నాయకుడిపై దాడిచేసి చంపేశారు.

### ఇతర సంఘటనలు :

ఫిబ్రవరి నెలలో కమ్యూనికేషన్ సిస్టమ్స్ స్వాధీనం కోసం కేంపెయిన్ జరిగింది.

* ఏ.పి.యస్.సి. గైడెన్స్‌లో నల్గొండ జిల్లా నాగార్జున సాగర్ సమీపంలోని ఒక నిర్మాణ పనుల క్యాంప్ నుండి 4 వాకీటాకీ సెట్లు, రెండు వైర్‌లెస్ సెట్లు, ఒక బేస్ సెట్‌ని స్వాధీన పర్చుకోవటమైంది.

* నల్గొండ జిల్లాలో రెండు రైల్వే స్టేషన్లపై ఏకకాలంలో జరిగిన చర్యలో వాకీటాకీ సెట్లు కైవశమైనాయి.

* నంద్యాల గూడూరు మార్గంలోని ఒక రైల్వే స్టేషన్‌లో ఆగివున్న రైలునుండి వాకీటాకీ సెట్లను చేజిక్కించుకున్నారు.

* ఏ.ఓ.బి. రీజియన్‌కి చెందిన పి.జి.ఏ. గెరిల్లాలు పార్వతీపురం దాటాక కూనేరు రైల్వేస్టేషన్ వద్ద విజయనగరం సమీపంలో ఒక రైలు నుండి వాకీటాకీ సెట్‌ని వశపర్చుకున్నారు.

2000 సం॥రం తొలి నాలుగు నెలల పి.జి.ఏ. క్యాంపెయిన్‌లో భాగంగా జరిగిన పలు సైనిక చర్యల్లో ఇవి కొన్ని మాత్రమే. విజయవంతమైన, విఫలమైన ఇతర సంఘటనలను కూడా కలుపుకుని చూస్తే పి.జి.ఏ. క్యాంపెయిన్ సాధించిన విజయాలు తక్కువేం కాదు. ఉద్యమ చరిత్రలో రాష్ట్రవ్యాప్తంగా సమన్వయంతో సైనిక చర్యలు ప్రారంభించిన ఘట్టాన్ని ఇవి ఆవిష్కరించాయి. పి.జి.ఏ. ఆవిర్భావ సందర్భంగా జరిగిన ఈ క్యాంపెయిన్ ఒక మహా ప్రారంభం.

## కమ్యూన్‌లో అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాటదినం

మహిళా కామ్రేడ్స్ ఆనందానికి అంతులేదు. కారణమేమంటే చారిత్రాత్మకమైన కాంగ్రెస్ కోసం నిర్వహిస్తున్న క్యాంపులో మార్చి 8ని జరుపుకునే అవకాశం దొరికింది మరి. వ్యవధి చాలా తక్కువే అయినా ఇందుకోసం అవసరమైన కార్యక్రమాన్ని శరవేగంగా పూర్తి చేశారు. కేవలం కమ్యూన్ సభ్యులే కాదు, గ్రామస్థులు, ప్రత్యేకించి సమీప గ్రామాలకు చెందిన మహిళలు కూడా ఈ కార్యక్రమాన్ని మరవురాని ఘట్టంగా జరుపడానికిగాను వచ్చి చేరారు. కమ్యూన్ మొత్తంగా మహిళా సమస్యలపై పలు పోస్టర్లను వేలాడదీశారు. ఈ సందర్భంగా 'గెరిల్లా వాణి' ప్రత్యేక సంచికను కూడా తేవటం జరిగింది.

మార్చి 8న జరిగిన సమావేశంలో మహిళా దళ కమాండర్, ఆదివాసీ నేపథ్యం కలిగిన కా॥ రాధ కె.ఎ.ఎం.ఎస్. పతాకను (రజత నక్షత్రంతో కూడిన ఎర్రజెండా) ఆవిష్కరించింది. తన క్లుప్త పరిచయ ప్రసంగంలో ఆమె భారతదేశంలో మార్చి 8 పోరాట దినం చరిత్రను పేర్కొంది. అర్ధభూస్వామ్య, అర్ధవలస సమాజంలో మహిళల పీడనకు గల పునాదిని అర్థం చేసుకోవడంలో పీడిత వర్గాలకు చెందిన మహిళల ప్రాధాన్యతను ఆమె నొక్కి చెప్పింది.

డివిజనల్ కమిటీ సభ్యురాలైన కా॥ మైనా ఈ సమావేశానికి అధ్యక్షత వహించింది. మరో ఆదివాసీ కామ్రేడ్, ఒకటో ప్లటూన్‌కి చెందిన సెక్షనల్ కమాండర్ అయిన కా॥ రీతా పితృస్వామిక సంప్రదాయాల కారణంగా ఆదివాసీ మహిళలు అనుభవిస్తున్న పీడనను, కోల్పోతున్న సౌకర్యాలను గురించి ప్రసంగించింది. ఆదివాసీ మహిళలలో పనిచేయడానికిగాను తమ ఇళ్ళను, ఉద్యోగాలను వదిలిపెట్టి అటవీ లోతట్టు ప్రాంతాల్లోకి వచ్చి తమ హక్కుల గురించి ఆదివాసీ మహిళలను మేల్కొల్పిన కామ్రేడ్స్ నిర్మల, కమల వంటి మహిళా అమరనారుల గురించి కా॥ రీతా ఉద్వేగ భరితంగా మాట్లాడింది.

జిల్లాకమిటీ సభ్యురాలు కా॥ విజయ ''ఆకాశంలో సగమైన ఉజ్వల తారలు'' అనే దండకారణ్య మహిళా అమరులపై పుస్తకాన్ని ఆవిష్కరించింది. తొలిరోజుల్లో విప్లవ పోరాటంలో పాలుపంచుకున్న మహిళల పోరాటాలను ఆమె తిరిగి గుర్తు చేస్తూ, వారిని మహిళా విముక్తి పోరాటాలను ముందుకు నడిపేందుకు దారిచూపిన వేగుచుక్కలుగా అభివర్ణించింది.

నేపాల్ కమ్యూనిస్టు పార్టీకి చెందిన కా॥ గౌరవ్ విప్లవ పోరాటంలో మహిళల భాగస్వామ్యాన్ని ఎత్తిపట్టాడు. నేపాల్‌లో సాయుధ పోరాటాన్ని ప్రారంభించటమనేది గ్రామీణ మహిళలపై ఎంత గొప్ప ప్రభావం కల్గించిందో, ఆనాటి వరకు పట్టణ మహిళలకే పరిమితమైన మహిళా ఉద్యమాన్ని అది ఎంత గొప్పగా విస్తృతపర్చిందో కా॥ గౌరవ్ వివరించాడు.

కామ్రేడ్ ఒకాన్ తన పార్టీ టి.కె.పి./యం.యల్. తరపున మహిళా కామ్రేడ్స్ అందరికీ విప్లవాభివందనాలు తెలియజేస్తూ, మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, స్టాలిన్, మావోలే కాక క్లారాజెట్కిన్, రోజా లగ్జెంబర్గ్, అలెగ్జాండ్రా కొల్లంతాయ్, చియాంగ్‌చింగ్‌లు కూడా మనకున్నారంటూ సూచించాడు. యం.యల్.యం. శాస్త్రంతో మాత్రమే సకల దోపిడీ, వివక్షతా రూపాలపై విజయవంతంగా పోరాడగలమని అతడు నొక్కి చెప్పాడు. అన్ని రంగాలలో నేతలుగా మారడానికి ముందు మీపై మీరు విశ్వాసం కల్గి వుండాలంటూ అక్కడ చేరిన మహిళలందరికీ పిలుపిచ్చాడు.

కేంద్రకమిటీ (ప్రొవిజనల్)కి చెందిన కా॥ సుమీత్ ఈ మార్చి 8ని విప్లవకారులు జరుపుకునే తీరుకు, రివిజనిస్టులూ-బూర్జువా సెక్షన్లు జరుపుకునే తీరుకు మధ్య తేడా గురించి పేర్కొన్నాడు. మహిళల భాగస్వామ్యాన్ని పెంచాల్సిన అవసరాన్ని, స్త్రీల వునికి కోసం పోరాడి విప్లవాన్ని పురోగమింప జేయాల్సిన అవసరాన్ని గురించి అతడు నొక్కి చెప్పాడు. బీహార్ వంటి కొన్ని ఉద్యమ ప్రాంతాల్లో మహిళలు తక్కువగా పాల్గొంటుండటం గురించి మాట్లాడుతూ, ఇందుకుగానూ ప్రధాన లోపాన్ని గుర్తించి దానికి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరాన్ని పేర్కొన్నాడు.

ఇక ప్రజాగెరిల్లా సైన్యంలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచాలంటూ మార్చి 8 ఇచ్చిన కీలకమైన పిలుపుపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలంటూ కా॥ మైనా సమావేశాన్ని ముగించింది.

ఉపన్యాసాల మధ్య గోండీ, తెలుగు భాషల్లో మహిళలెదుర్కొంటున్న పీడన స్థాయి గురించి పేర్కొంటూ, వారిని పోరాటంలోకి ఆహ్వానించే పాటల్ని, మహిళా అమరుల జీవితాలు, వారి కార్యాచరణ గురించి వైవిధ్యపూరితమైన పాటలు పాడారు. ఈ సభలో పాల్గొన్న వారందరూ కలసి దాదాపు గంటసేపు సామూహిక నృత్యంలో ఉత్సాహంగా భాగం పుచ్చుకున్న తర్వాత కార్యక్రమం ముగిసింది.

---

పీపుల్స్‌వార్‌పై (పార్టీ యూనిటీతో సంలీనమయిన తర్వాత) తన భౌతిక దాడులను తీవ్రతరం చేసింది. చర్చల కోసం పీపుల్స్‌వార్ పదే పదే ఇస్తున్న పిలుపులను అది లక్ష్య పెట్టడం లేదు. యం.సి.సి.తో ఐక్యతకు ఇప్పటికిప్పుడే అవకాశం లేనప్పటికీ దానితో చర్చలు జరపాలని పార్టీ సౌహార్ధ సంబంధాలను సాగించేందుకు పూనుకోవాలని, దాంతో కలసి భారతీయ రాజ్య వ్యవస్థకి వ్యతిరేకంగా ఐక్య పోరాటాలను సాగించాలని కాంగ్రెస్ తేల్చి చెప్పింది. అయితే భవిష్యత్తులో వారితో ఐక్యతకు తలుపులు తెరచి వుంచుతూనే, వారి వేర్పాటువాద, పిడివాద రాజకీయాలను ఎండగట్టాలని కాంగ్రెస్ పేర్కొంది.

పార్టీకి సంబంధించి కార్మికవర్గ అంతర్జాతీయతా బాధ్యతలను నెరవేర్చటంలోని లోటుపాట్లను కాంగ్రెస్ గుర్తించి ఈ లోపాలను అధిగమిస్తానని, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో మరింత బాధ్యతాయుత పాత్ర నిర్వహిస్తానని ప్రతిన చేసింది.

ఇందుకు సంబంధించి కాంగ్రెస్ నిర్దిష్టంగా ఇలా నిర్ణయించుకుంది.

ఎ. పెరూ కమ్యూనిస్టు పార్టీతో, ఫిలిప్పైన్స్ కమ్యూనిస్టు పార్టీ (సి.పి.పి.) తో, టర్కీ కమ్యూనిస్టు పార్టీ/ఎం.ఎల్. (టి.కె.పి. యం.యల్) తో, నేపాల్ కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)తో, ప్రపంచంలోని ఇతర నిజమైన మావోయిస్టు పార్టీలతో వుమ్మడిగా మరిన్ని అంతర్జాతీయ కార్యక్రమాలు నిర్వహించాలి.

బి. మార్క్సిస్టు-లెనినిస్టు-మావోయిస్టు శక్తులు అగ్రగామి దళంగా వుంటూ సకల సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తులతో చేయి కలపటం ద్వారా ప్రపంచ వ్యాప్తంగా సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలను, ప్రత్యేకించి ప్రపంచ ప్రజలపై అమెరికా సామ్రాజ్యవాదపు దోపిడీకి



**మార్చి 8. కాంగ్రెస్‌లో అంతర్జాతీయ మహిళా దినం సభ**

వ్యతిరేకంగా పోరాటాలను నడపటానికి సంసిద్ధమవ్వాలి.

**సి.** మావోయిస్టు ప్రజాయుద్ధాలకు ప్రాధాన్యతనిస్తూ, ప్రపంచంలోని విప్లవకర పోరాట శక్తుల గురించిన విస్తృతమైన రిపోర్టులతో వాన్‌గార్డ్ పత్రికను (సి.పి.పి., టి.కె.పి. యం-యల్, సి.పి.ఐ. (యం-యల్) [పీపుల్స్‌వార్]లు వుమ్మడిగా తెస్తున్న పత్రిక) తీసుకురావడంలో చురుకుగా తోడ్పాటునివ్వాలి.

అంతర్జాతీయంగానూ, దేశీయ స్థాయిలోనూ, రాజకీయ పరిణామాలను సమీక్షించిన రాజకీయ తీర్మానంని కూడా కాంగ్రెస్ ఆమోదించింది. అమెరికా సామ్రాజ్యవాదం బలహీనపడినప్పటికీ అది ఈనాటికీ ప్రపంచ ప్రజల ప్రథమ శత్రువుగా కొనసాగుతూనే వుందని రాజకీయ తీర్మానం ఎత్తిచూపింది. సామ్రాజ్యవాదుల మధ్య తీవ్రతరమవుతున్న వైరుధ్యాలను, సామ్రాజ్యవాద విధానాలకు వ్యతిరేకంగా పెరుగుతున్న ప్రపంచ ప్రజల పోరాటాలను అది విశ్లేషించింది. తీవ్రమవుతున్న సంక్షోభం కారణంగా భారత పాలక వర్గాల అస్థిరత్వంపై కూడా అది దృష్టి సారించింది. సామ్రాజ్యవాద కబంధ హస్తాలు ఊపిరాడనీయకుండా చేస్తుండటాన్ని, ప్రజా జీవితాలపై నూతన ఆర్థిక విధానాల వినాశకర ప్రభావాన్ని కూడా అది విశ్లేషించింది. హిందూ ఫాసిజం ప్రమాదాన్ని కూడా పేర్కొంటూ అది ప్రజలను అప్రమత్తులను చేసింది.

ప్రపంచ పీడిత దేశాలే విప్లవ తుఫాను కేంద్రాలుగా వుంటున్న ఈ యుగాన్ని **''సామ్రాజ్యవాద, కార్మికవర్గ విప్లవాల''** యుగంగా రాజకీయ తీర్మానం నిర్వచించింది. సామ్రాజ్యవాదానికి - పీడిత జాతులకు, ప్రజలకు మధ్య వైరుధ్యాన్నే ప్రపంచ ప్రధాన వైరుధ్యంగా కాంగ్రెస్ నిర్ణయించింది.

పార్టీ కార్యకలాపాలకు సంబంధించిన ఆర్థిక, ద్రవ్యపరమైన అంశాలపై, పార్టీ నిధుల వనరులపై, పార్టీ వ్యయంపై మార్గదర్శక సూత్రాలనందించే ఆర్థిక విధానంని కూడా కాంగ్రెస్ ఆమోదించింది.

శ్రామికవర్గ మహా సాంస్కృతిక విప్లవాన్ని, చైనాలో పెట్టుబడిదారీ పునరుద్ధరణను చర్చించిన ''చైనా కమ్యూనిస్టు పార్టీపై తీర్మానం''ని కాంగ్రెస్ ఆమోదించింది. హువా కౌ ఫెంగ్, డెంగ్ జియావో ఫెంగ్‌ల ముఠా అధికారాన్ని చేజిక్కించుకున్నాక తర్వాత చైనాలో పెట్టుబడిదారీ విధానం పునరుద్ధరింప బడిందని ఈ తీర్మానం ప్రకటించింది. కార్మికవర్గ నియంతృత్వంలో విప్లవాన్ని కొనసాగించడంకి సంబంధించి మార్క్సిస్ట్ ఆయుధాగారానికి మావోసేటుంగ్ అందించిన ముఖ్యమైన తోడ్పాటును ఈ తీర్మానం ఎత్తిపట్టింది. మహత్తర శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవాన్ని అది ప్రశంసిస్తూ, గ్యాంగ్ ఆఫ్ ఫోర్ (దుష్ట చతుష్టయం)గా పిలువబడిన వారు నిర్వహించిన పాత్ర విప్లవకర మైనదిగా వుందని ఈ తీర్మానం పేర్కొంది. సాంస్కృతిక విప్లవ కాలంలో లిన్‌పియావో పాత్రని, అతని అతివాద వామపక్ష పంథాని తీర్మానం ఖండించింది.

1980 నాటి ఆత్మవిమర్శనా సమీక్షని ఒక చారిత్రక డాక్యుమెంటుగా ఎత్తిపట్టిన తీర్మానాన్ని కూడా కాంగ్రెస్ ఆమోదించింది. ఈ డాక్యుమెంటు 1970ల మొదట్లో సి.పి.ఐ. (ఎం-ఎల్) వెనుకంజ చరిత్రను సమీక్షించి విప్లవం ముందడుగు

వేసేందుకు మార్గాన్ని కూడా సూచించింది.

చివరగా కాంగ్రెస్ అనేక తీర్మానాలను ఆమోదించింది. అమరులైన విప్లవకారులకు నివాళి అర్పిస్తూ, శత్రు నిర్బంధంలో మగ్గుతున్న వందలాది కామ్రేడ్స్‌కి సంఘీభావాన్ని ప్రకటిస్తూ, దేశంలో సాగుతున్న జాతుల విముక్తి పోరాటాలకు మద్దతు తెలుపుతూ, ప్రపంచ వ్యాప్తంగా కార్మికవర్గ పోరాటాలకు మద్ధతిస్తూ, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పీడిత జాతుల పోరాటాలకు మద్దతు ప్రకటిస్తూ, కా॥ గొంజాలో, కా॥ ఫెలిసియానోల విడుదలకు పిలుపిస్తూ, పెరూ, ఫిలిప్పైన్స్, నేపాల్, టర్కీలలో మావోయిస్టుల విప్లవకర పోరాటాలను శ్లాఘిస్తూ, భారత విస్తరణవాదాన్ని ఖండిస్తూ.... ఈ విధమైన పలు తీర్మానాలను కాంగ్రెస్ ఆమోదించింది.

కాంగ్రెస్ చివరి సమావేశం సుదీర్ఘంగా సాగింది. ఈ సమావేశంలో వైదొలుగుతున్న కేంద్రకమిటీ సభ్యుల స్వీయవిమర్శ, విమర్శలు, నూతన కేంద్రకమిటీ ఎన్నిక కార్యక్రమం జరిగింది. నూతన కేంద్రకమిటీ నూతన కార్యదర్శిని ఎన్నుకుని హాలు ముందు ప్రకటించింది. కాంగ్రెస్‌ని లాంఛనంగా ముగించడానికి ముందుగా నేపాల్ కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు), టర్కీ కమ్యూనిస్టు పార్టీలకు చెందిన ఇరువురు సౌహార్ద ప్రతినిధులు తాము ఎంతో సావధానులై అనుసరించిన సభా కార్యక్రమాలపై తమ పరిశీలనలను, విమర్శనాత్మక వ్యాఖ్యలను సభ ముందుంచారు. కాంగ్రెస్ ప్రధాన నిర్ణయాలను ఇరువురూ ఎత్తిపట్టారు. నిజమైన శ్రామికవర్గ అంతర్జాతీయ స్ఫూర్తితో వారిరువురూ తమ పరిశీలనలను ప్రకటించారు.

17 రోజుల పాటు అత్యంత శ్రద్ధాసక్తులతో జరిగిన చర్చ తర్వాత కాంగ్రెస్ అంతిమంగా మార్చి 21న ముగిసింది. మార్చి 22 ఉదయం క్యాంపు మొత్తంగా తాళ్ళగూడెం అమరుల గ్రౌండ్‌లో అమరుల స్థూపం ముందు సమావేశమైంది. కాంగ్రెస్ జరుగుతున్నంత కాలం పార్టీ పతాక గ్రౌండ్‌లో రెపరెపలాడుతూనే వుండింది.

సభనుద్దేశించి మొదటగా మొత్తం కమ్యూన్ నిర్వహణా కమిటీ తరపున ఒక రాష్ట్రకమిటీ సభ్యుడు ప్రసంగిస్తూ పార్టీ చారిత్రాత్మక 9వ కాంగ్రెస్‌ని విజయవంతంగా ముగించినందుకు కాంగ్రెస్ ప్రతినిధులందరికీ విప్లవాభివందనాలు తెలిపాడు. తర్వాత ఈ కాంగ్రెస్‌ని గొప్పగా విజయవంతం చేయటంలో తోడ్పాటునందించిన కామ్రేడ్స్ అందరికీ అతడు విప్లవాభివందనాలు తెలిపాడు. కాంగ్రెస్ వేదికను శత్రుదాడుల నుండి రక్షించటంలో విరామమెరుగకుండా శ్రమించిన పి.జి.ఏ.కి. చెందిన ప్రొటెక్షన్ కామ్రేడ్స్ పాత్రను అతడు ప్రత్యేకించి గుర్తు చేశాడు. మొత్తం నెలరోజులపాటు 250 మంది కామ్రేడ్స్‌తో కూడిన క్యాంప్‌కి సరిపోనూ అసంఖ్యాకంగా ఆహార సామగ్రిని మోసుకొచ్చిన కామ్రేడ్స్ పాత్రను కూడా అతడు గుర్తు చేశాడు. అత్యంత కష్టభరితమైన పరిస్థితుల్లోనూ మంచి ఆహారాన్ని సకాలంలో అందిస్తూ వచ్చిన వంట కామ్రేడ్స్ పాత్రను కూడా అతడు క్యాంపుకు గుర్తు చేశాడు. రోగులకు సేవచేసిన వైద్య బృందం అలుపెరుగని ప్రయత్నాలకు కూడా అతడు గుర్తు చేశాడు. ''గెరిల్లావాణి'' ఎడిటోరియల్ బృందాన్ని, సాంస్కృతిక టీమ్ కామ్రేడ్స్‌ని, కామ్రేడ్స్ అందరినీ, కాంగ్రెస్‌ని బాగా విజయవంతం చేయడంలో చిన్న పెద్ద సహాయాలు చేసిన చుట్టుప్రక్కల గ్రామస్థులను అందరినీ అతడు పేరు పేరునా పేర్కొన్నాడు.

## ప్రజలే దుర్భేద్యమైన ఉక్కుకోట

**వాళ్ళు మితభాషిలే కాని అత్యంత అవసరమైన సైనికులు. వీళ్ళు లేనిదే 9వ కాంగ్రెస్ జరిగి వుండేది కాదు. వాళ్లెవరో కాదు, గ్రామీణ ప్రజలే. కాంగ్రెస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో వేలాదిమంది గ్రామీణ ప్రజలు పాలుపంచుకున్నారు. కాంగ్రెస్ జరిగిన ప్రాంతానికి కామ్రేడ్స్‌ని, సరకులను తరలించడంలో తోడ్పడిన విప్లవ సానుభూతిపరులైన ప్రజలందించిన సహాయాన్ని గణించటం కాని, కొలవటం కానీ చాలా కష్టం. ఇక కాంగ్రెస్‌కి సమీపంలో వున్న గ్రామాల ప్రజల పాత్ర అమూల్యమైనది.**

**కాంగ్రెస్ కమ్యూన్‌కి చుట్టూ గల 10-12 గ్రామాలు వివిధ పాత్రలు చేపట్టాయి. మొదటగా వారు కమ్యూన్‌ని రూపొందించటంలో ప్రత్యక్షంగా తమ శ్రమను అందించారు. రెండోది, కాంగ్రెస్ జరుగుతున్న కాలమంతటా వారు పీపుల్స్‌వార్ పార్టీకి పెట్టని కోటలై అత్యంత కీలక పాత్ర నిర్వహించారు. ప్రజారాసులు అందించిన ఈ రక్షణ వలయాన్ని దాటి ముందుకు రావడానికి శత్రువుకు ఏ మాత్రం సాధ్యం కాలేదు.**

**దీనికితోడు కమ్యూన్‌కి బయటి రక్షణ వలయంలో అసంఖ్యాక గ్రామాలుండేవి. కమ్యూన్ భద్రతకు బాధ్యతపడిన బృందాలు ఈ గ్రామాలతో నిత్యం సంబంధం కలిగి వుండేవి.**

**ఈ ప్రజారాసులు అందించిన సాటిలేని భద్రతా వలయాల భరోసాతోనే కాంగ్రెస్ నిశ్చింతగా కొనసాగింది. నిజంగానే ఇదొక మహత్తరమైన ఉక్కుకోట!**

తర్వాత, నూతనంగా ఎన్నికైన కార్యదర్శి సభను ఉద్దేశించి ప్రసంగిస్తూ, కాంగ్రెస్ ప్రధాన నిర్ణయాలను పేర్కొన్నాడు. కాంగ్రెస్ ప్రతినిధులు నిరాఘాటంగా రాజకీయ చర్చనీయ అంశాలపైనే పూర్తిగా దృష్టి నిలిపేలా చేయటంలో తమ పాత్ర తాము నిర్వహించిన కామ్రేడ్స్ అందరికీ నూతన కేంద్రకమిటీ తరపున కార్యదర్శి మరోసారి విప్లవాభివందనాలు తెలియజేశాడు. కాంగ్రెస్ వేదిక మొత్తాన్ని అలంకరణలతో మెరుగులు దిద్దిన కామ్రేడ్స్‌కి, పి.జి.ఏ. దళాలకు, ప్రెస్‌కి, వైద్య, విద్యుత్, సమాచార వ్యవస్థ టీమ్‌లకు, రాత్రింబవళ్ళు కాంగ్రెస్ వేదికను కాపాడటంలో సహకరించిన డివిజనల్, స్పెషల్ జోన్ కమిటీ సభ్యులకు, స్థానిక గెరిల్లాలకు చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలకు కార్యదర్శి ప్రత్యేకించి విప్లవాభివందనాలు తెలియజేశాడు.

తన ప్రసంగంలో కా॥ గణపతి కాంగ్రెస్ సాధించిన ప్రధాన విజయాలను కింది విధంగా పేర్కొన్నాడు.

* మావోసేటుంగ్ ఆలోచనా విధానం భావనను మరింత లోతుగా అధ్యయనం చేసిన కాంగ్రెస్, మార్క్సిజం-లెనినిజం-మావోయిజంని పార్టీ సైద్ధాంతిక పునాదిగా ఆమోదించింది.
* దళారీ నిరంకుశ బూర్జువా వర్గంకి, ప్రజలకి మధ్య వైరుధ్యాన్ని దేశంలోని ప్రధాన వైరుధ్యంగా కాంగ్రెస్ అంగీకరించింది.
* గడచిన కాలంలో వివిధ ప్లీనంలు, కాన్ఫరెన్స్‌ల క్రమంలో ఇప్పటికే మెరుగుపర్చబడిన 1970 పార్టీ నిబంధనావళి (ఒరిజినల్)ని

(తరువాయి 16వ పేజీలో...)

# ''దక్షిణాసియా ఒక అగ్నిపర్వతం''

- సి.పి.ఎన్. (మావోయిస్టు)

## సి.పి.ఐ. (యం-యల్) [పీపుల్స్‌వార్] 9వ కాంగ్రెస్‌కి సాహార్ద సందేశం

### (కా॥ గౌరవ్ ప్రసంగం నుండి కొన్ని భాగాలు)

నేపాల్ కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) తరపున మేం సి.పి.ఐ. (యం-యల్) [పీపుల్స్‌వార్]కి విప్లవాభివందనాలు పంపుతున్నాం. మన రెండు పార్టీలూ పొరుగుదేశాలకు సంబంధించిన సోదర పార్టీలు. రెండు దేశాల ప్రజలకు సన్నిహిత సంబంధాలున్నాయి. పెద్దది లేక చిన్నది, మంచిదీ లేదా చెడ్డది భారతదేశంలో జరిగే ప్రతి సంఘటనా నేపాల్‌పై ప్రత్యక్షంగా పెద్ద ప్రభావాన్ని కల్గిస్తుంది. భారత కమ్యూనిస్టు ఉద్యమంలో రివిజనిజం ఊడలు దించి వున్నపుడు అది నేపాల్ కమ్యూనిస్టులపై ప్రభావం చూపింది. కా॥ చారుమజుందార్ ప్రఖ్యాత నక్సల్బరీ వుద్యమాన్ని నిర్వహించినపుడు అది ఆధునిక రివిజనిజానికి వ్యతిరేకంగా పెద్ద పోరాటానికి దారి తీసింది. అది పొరుగునున్న నేపాల్‌లోని జాపా ఉద్యమంపై కూడా ప్రభావం చూపింది. దురదృష్టవశాత్తు జాపా కామ్రేడ్స్ పార్లమెంటరీ పంథా చేపట్టి యు.యం.-యల్.లోకి దిగజారిపోయారు.

ఈరోజు జాపా ఉద్యమం నిజమైన వారసులం మేమేనని చెప్పుకుంటున్నాం. మీ పార్టీ నక్సల్బరీ తిరుగుబాటుకి నిజమైన వారసురాలు. 1980ల నుండి పీపుల్స్‌వార్, ఎం.సి.సి.లు ప్రారంభించి, వృద్ధి చేసిన సాయుధ పోరాటం మా పార్టీపై, ఉద్యమంపై కూడా సానుకూల ప్రభావం కల్గించింది. పరస్పరం నేర్చుకునే క్రమం అనేది ఒక నిరంతరమైన, విడదీయరాని క్రమం. మేం మీ అనుభవాన్ని పంచుకోవడానికి, మీరు మా అనుభవాన్ని పంచుకోవడానికి చాలా శ్రద్ధాసక్తులతో వున్నాం. ఎందుకంటే ఈ అనుభవాలు మన కామ్రేడ్స్ రక్త త్యాగాల ద్వారా సాధించబడినట్టివి.

మన రెండు పార్టీల మధ్య సంబంధాలకు ఓ సుదీర్ఘ చరిత్ర వుంది. స్థిరమైన, క్రమానుగతమైన ద్వైపాక్షిక సమావేశాలలో వివిధ స్థాయిల్లో మనం చర్చల్నీ, సంబంధాల్నీ కలిగి వున్నాం. అలాగే మంచి సోదర సంబంధాలను కూడా కలిగి వున్నాం. 1993 నుండి మేం మీ సాయుధ పోరాట సుదీర్ఘ అనుభవం నుండి ఎంతో నేర్చుకున్నాం. సైద్ధాంతిక, రాజకీయ అంశాలపై పరస్పరం అభిప్రాయాలను మార్పిడి చేసుకోవడం వరకే మన సంబంధాలు పరిమితం కాలేదు. కాగా అవి మరింత విశాలంగానూ, వివిధ అంశాలతోనూ ముడిపడి వున్నాయి. పైగా, మన రెండు పార్టీలకూ భారత విస్తరణవాదం ఉమ్మడి శత్రువు. ప్రత్యేకించి భారతదేశంలో 60 లక్షల మంది నేపాలీలు వుంటున్న కారణంగా భవిష్యత్తులో మన మధ్య మరింత వున్నతమైన ఐక్యతకు అవకాశం వుంది కూడా.

భారత విప్లవానికి, ప్రపంచ విప్లవానికి మధ్య సమైక్య బంధం వుంది. భారత విప్లవం లేకుండా ప్రపంచ విప్లవాన్ని మనం ఊహించలేం. భారత విప్లవానికి నేతృత్వం వహించటం ద్వారా సి.పి.ఐ. (యం-యల్) [పీపుల్స్‌వార్] ప్రపంచ విప్లవానికి అపరిమితంగా తోడ్పడుతోంది. అయితే భారతదేశంలో ఎం.సి.సి., సి.పి.ఐ. (యం-యల్) (నక్సల్బరీ), ఆర్.సి.సి.ఐ. (యం) వంటి ఇతర మావోయిస్టు శక్తులు కూడా వుంటున్నాయి. మావోయిస్టులందరూ ఒకే కేంద్రంగా ఐక్యమయితే అది నిజంగానే సవాలు విసిరే శక్తి కాగలదు. పీపుల్స్‌వార్, పార్టీ యూనిటీల ఐక్యత ఒక సానుకూలాంశమే అయినప్పటికీ ఇది మాత్రమే సరిపోదు.

మావోయిస్టు పార్టీలే కాకుండా దక్షిణాసియాలోని, ప్రపంచంలో ఇతర ప్రాంతాల్లోని విప్లవ ప్రజానీకం కూడా భారత దేశ మావోయిస్టుల ఐక్యతను కాంక్షిస్తారు. యం.సి.సి.కి, పీపుల్స్‌వార్‌కి మధ్య ఘర్షణలు గురించి విన్నప్పుడు పై అందరి హృదయాలూ కలవరపడినాయి. అంతర్జాతీయ విప్లవోద్యమం (రిమ్)లోని ఇతర యూనిట్లతోపాటు, మా పార్టీ కూడా ఘర్షణలను నిలిపి వేయవలసిందిగా పీపుల్స్‌వార్‌కి, యం.సి.సికి. బహిరంగంగా పిలుపిచ్చాయి. రెండు పార్టీలూ, సానుకూలంగా స్పందించాయి. ప్రాథమికంగా ఘర్షణలు ఆగిపోయాయి. తిరిగి ఘర్షణలు జరగవనే మేం ఆశిస్తున్నాం.

అతిపెద్ద పార్టీగా పీపుల్స్‌వార్ మావోయిస్టులందరినీ ఒకే తాటికి తెచ్చి ఐక్యపర్చడానికి తన ప్రయత్నాలను తీవ్రతరం చేస్తుందని మేం భావిస్తున్నాం. మీ ప్రయత్నంలో ఏ తోడ్పాటునందించేందుకైనా మా పార్టీ సిద్ధంగా వుంటుందని మేం హామీనిస్తున్నాం. ఈ కాంగ్రెస్ ఈ సమస్యను ప్రగాఢంగా గుర్తిస్తుందని మేం ఆశిస్తున్నాం.

మీ కాంగ్రెస్‌కి కాస్త ముందుగా జరిగిన మా రెండో జాతీయ కాన్ఫరెన్స్‌లో అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమానికి అతిముఖ్యమైన కొన్ని ప్రధాన నిర్ణయాలు తీసుకున్నాం. ప్రపంచ విప్లవ పరిస్థితి పెద్ద ఎత్తున మార్పు చెందింది. సామ్రాజ్యవాదమూ, దాని తొత్తులూ తీవ్ర సంక్షోభంలో పడిపోయారు. ప్రపంచవ్యాప్తంగా వుద్యమాలు పెరుగుతున్నాయి. నూతన ఇంటర్నేషనల్‌ని ప్రారంభించడానికి ఇదే తగిన సమయం. మావోయిస్టులు ఈ అవకాశాన్ని జారవిడుచుకోరాదు. గత ఇంటర్నేషనల్స్ అనుభవాల నుండి మనం నేర్చుకుని తీరాలి. రిమ్ ఈ వైపుగా కొంతమేరకు చొరవ చేసింది. మావోయిస్టుల మందరం మరింత బాధ్యతను చేపట్టాల్సి వుంది.

ఈరోజు దక్షిణాసియా ఒక అగ్నిపర్వతం లాగా వుంది. భారతదేశంలో, నేపాల్‌లో మావోయిస్టులు బలమైన ప్రజాయుద్ధాలను నడుపుతున్నారు. ఇక్కడ బలమైన జాతుల విముక్తి ఉద్యమాలున్నాయి. భారత విస్తరణవాదపు ఉమ్మడి శత్రువు కూడా ఇక్కడ వుంది. ప్రపంచ కార్మికోద్యమానికి సమర్ధవంతంగా ఉపకరించగల ఉమ్మడి పోరాటాల సుదీర్ఘ చరిత్ర కూడా వుంది. ప్రపంచ కార్మిక విప్లవాల నూతన వెల్లువ కూడా ఇపుడు ప్రపంచరంగంపై వుంది. నూతన ఇంటర్నేషనల్‌ని స్థాపించే ప్రయత్నాలను తీవ్రతరం చేయడమనేది ఇప్పుడొక తక్షణ కర్తవ్యం. 21వ శతాబ్దం ప్రపంచ కార్మిక విప్లవ శతాబ్దమవుతుందని మేం నమ్ముతున్నాం.

ఈ క్రింది అంశాలలో సరైన సైద్ధాంతిక-రాజకీయ పంథాని ఏర్పర్చటంలో ఈ కాంగ్రెస్ విజయవంతమవుతుందని మేం ఆశిస్తున్నాం.

ఎ. భారతదేశంలో నూతన ప్రజాతంత్ర విప్లవానికి నాయకత్వం వహించటం.

బి. అన్ని మావోయిస్టు పార్టీలను, సంస్థలను ఒకే తాటిమీదికి తెచ్చి ఐక్యపర్చటం.

సి. ప్రపంచ కార్మికవర్గపు బలమైన ప్రత్యామ్నాయంగా ప్రపంచ సోషలిస్ట్ విప్లవాన్ని పురోగమింప చేయటం.

ఈ కాంగ్రెస్ సంపూర్ణమైన ఘనమైన విజయాన్ని సాధించాలని మరోసారి మేం కోరుకుంటున్నాం. ❑

## ''అంతర్జాతీయ కమ్యూనిస్ట్ ఉద్యమ సైద్ధాంతిక ఐక్యతను బలోపేతం చేద్దాం''

- టి.కె.పి./యం-యల్

### సి.పి.ఐ. (యం-యల్) [పీపుల్స్‌వార్] 9వ కాంగ్రెస్‌కి సౌహార్ద సందేశం

### (కా॥ ఒకాన్ ప్రసంగంలోని కొద్ది భాగాలు)

కామ్రేడ్స్!

టి.కె.పి./యం.యల్. కేంద్రకమిటీ తరపున సి.పి.ఐ. (యం-యల్) [పీపుల్స్‌వార్] 9వ కాంగ్రెస్‌కి, కాంగ్రెస్ ప్రతినిధులకి, సోదర పార్టీ అయిన సి.పి.యన్. (మావోయిస్టు) ప్రతినిధికి కమ్యూనిస్ట్ స్ఫూర్తితో అభివందనలు తెలియజేస్తున్నాము. మీ ప్రస్తుత కాంగ్రెస్‌కి మహత్తర చారిత్రక ప్రాధాన్యత వుంది.

స్థానిక, అభివృద్ధి నిరోధక ఫాసిస్ట్ పాలన మరియు పార్లమెంటరీ సంస్కరణవాదం రెండింటికీ వ్యతిరేకంగా లేచినిలబడ్డ 1967 మే నాటి నక్సల్బరీ సాయుధ రైతాంగ తిరుగుబాటు చారిత్రక వారసత్వానికి మీ కాంగ్రెస్ ప్రాతినిధ్యం వహిస్తున్నపుడు, దానిలోని లోటుపాట్లని గమనించేందుకుగాను ఈ అనుభవాన్ని విమర్శనాత్మకంగానూ, శాస్త్రీయ దృష్టితోనూ కాంగ్రెస్ తప్పక పరిశీలించాలి.

1969 ఏప్రిల్ 22న కామ్రేడ్ చారుమజుందార్ నాయకత్వంలో స్థాపించబడిన సి.పి.ఐ. (యం-యల్) పంథాకి, 1970 మే నెలలో జరిగిన 8వ కాంగ్రెస్‌కీ మీ ప్రస్తుత కాంగ్రెస్ కొనసాగింపు కూడా. 1980లో ఏర్పడిన మునుపటి సి.పి.ఐ. (యం-యల్) [పీపుల్స్‌వార్], 1983లో ఏర్పడిన మునుపటి సి.పి.ఐ. (యం-యల్) (పార్టీయూనిటీ)ల రెండింటి ఉమ్మడి వారసత్వానికి మీ కాంగ్రెస్ ప్రాతినిధ్యం వహిస్తోంది. 1998 ఆగస్ట్‌లో ఐక్యమైన మీ రెండు మావోయిస్టు శక్తుల కూటమిని మీ కాంగ్రెస్ బలోపేతం చేస్తున్నది. మీ ఐక్యత భారత విప్లవ భవిష్యత్తుకు సంబంధించి అపార ప్రాముఖ్యత గల్గిన సంఘటన.

సామ్రాజ్యవాద బూర్జువా వర్గమూ, రివిజనిజమూ, వీటితోపాటూ మార్క్సిజం-లెనినిజం-మావోయిజం నుండి విడిపోయిన సకల శక్తులూ సోషలిజం నిర్జీవమై పోయిందంటూ ఉమ్మడిగా గావుకేకలు పెడుతున్న దశలో మీ కాంగ్రెస్ జరుగుతోంది. ఫాసిస్ట్ అభివృద్ధి నిరోధక భారత పాలకవర్గాలు సకల దాడులకు, తీవ్ర నిర్బంధానికి పాల్పడుతున్నప్పటికీ అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో ఒక విలువైన సభ్యురాలు, భారత కార్మికవర్గ అగ్రగామి దళమూ అయిన సి.పి.ఐ.(యం-యల్) [పీపుల్స్‌వార్] తన కాంగ్రెస్‌ని విజయవంతంగా ముగించుకొంటుందని మేం నమ్ముతున్నాం. ఈ విజయం అటు భారత ఫాసిస్టు నియంతృత్వం, ఇటు సామ్రాజ్యవాద బూర్జువా వర్గం రెండింటికీ వ్యతిరేకంగా సాధించే విజయమే అవుతుంది.

ఈ చారిత్రక దినాన, కా॥శ్యామ్, మహేష్, మురళీల పేరిట ప్రపంచ కమ్యూనిజానికి చెందిన యావన్మంది అమరవీరులకీ మనం జోహార్లర్పిస్తున్నాం. వారు మనకు అందించిపోయిన ఎర్రజెండాని అత్యున్నత గౌరవంతో తుదివిజయం దాకా మోసుకెళతామని తిరిగి మనం మరోసారి ప్రతిజ్ఞ చేస్తున్నాం. సకల ఎం-ఎల్-ఎం. వ్యతిరేక పంథాలకు, వక్రీకరణలకూ వ్యతిరేకంగా మనం బేషరతుగా పోరాడుదాం. నేలకొరిగిన మన కామ్రేడ్స్ నెత్తుటి అప్పుకిగాను శత్రువుకు మనం భారీ నష్టాలను కలగజేద్దాం.

సామ్రాజ్యవాద బూర్జువా వర్గపు సైద్ధాంతిక దాడులకు పెటీబూర్జువా అవకాశవాదులు నిత్యం అవకాశం కల్పిస్తూ, కార్మికవర్గంలో బూర్జువా సైద్ధాంతిక దృక్పథాలను వ్యాపింప జేస్తూనే వున్నారు. ప్రపంచీకరణ ఫలితంగా సామ్రాజ్యవాదం మారిపోయిందనీ, కార్మికవర్గం ఇకేమాత్రం విప్లవానికి నాయకత్వం వహించలేదనీ ఇత్యాది బూర్జువా ఉదారవాద సూత్రాలను ఈ శక్తులు అభివృద్ధి చేశాయి.

ఒకానొక అపజయంతోటే స్థిరత్వాన్ని కోల్పోయేవారు మొదట యం.యల్.యం. పైనే దాడి చేస్తారనీ, తర్వాత బూర్జువా భావజాలాన్ని కౌగిలించుకొంటారని మార్క్సిస్ట్-లెనినిస్ట్-మావోయిస్టులుగా మనకు బాగానే తెలుసు. ఈ బాపతు మనుషులు మార్క్సిజాన్ని నిలబెడుతున్నామనే పేరుతో దాన్ని తిరగదోడ్తారు. బూర్జువా వర్గానికి ఇకే మాత్రమూ ప్రమాదకారి కాని విధంగా మార్క్సిస్ట్ సారాన్ని క్షీణింపజేస్తారు. సైద్ధాంతికంగా కార్మికవర్గాన్ని నిరాయుధం చేస్తారు.

సామ్రాజ్యవాద బూర్జువాలకు వ్యతిరేకంగా, మార్క్సిజం ముసుగులోనే యం-యల్.యం.ను వ్యతిరేకించే సకల ఎం.ఎల్.ఎం. వ్యతిరేక సిద్ధాంతాలకు వ్యతిరేకంగా పోరాటంలో, కార్మికవర్గానికి చెంది వర్గ చైతన్యం కలిగిన ప్రపంచ కమ్యూనిస్టు పార్టీలు సుసంపన్నమైన అనుభవాలను గడించాయి. అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం ఈ అనుభవాల నుండి తప్పకుండా విలువైన గుణపాఠాలు తీసుకుని తన ఉజ్వల మార్గం వైపుగా ముందడుగు వేయడం కొనసాగించాలి. ఎందుకంటే భవిష్యత్తు అంతర్జాతీయ కార్మికవర్గానికీ, ప్రపంచ పీడిత ప్రజానీకానికే చెందుతుంది.

గుత్త పెట్టుబడిదారీ వర్గపు దాడులకు సోషలిజం నిర్జీవమై పోయిందీ లేదు. అటు యం.యల్.యం. సిద్ధాంతం చేవ చచ్చిపోయిందీ లేదు. ఇందుకు భిన్నంగా సామ్రాజ్యవాద ప్రపంచంలోని పరిణామాలు యం.యల్.యం. సైద్ధాంతిక శాస్త్రపు చెల్లుబాటును నిరూపిస్తూనే వున్నాయి.

సోషలిస్టు రాజ్యాలు ఒకదాని వెనుక ఒకటి కుప్పగూలి పోవటం,

సామ్రాజ్యవాద బూర్జువా వర్గానికి వ్యతిరేకంగా ప్రపంచ కార్మికవర్గం, ప్రపంచ ప్రజలు పొందిన పరాజయం అనేవి తాత్కాలిక అపజయాలు మాత్రమే. సామ్రాజ్యవాదానికీ, దాని కుళ్ళిపోయిన వ్యవస్థకీ ప్రగతిశీల స్వభావాన్ని ఆపాదించేవారు పూర్తిగా పప్పులో కాలేసినట్లే. కోటానుకోట్లమంది పీడిత తాడిత ప్రజలు త్వరలోనో లేక తరువాతో తమ బానిస బంధనాలను తెంచుకుని దోపిడీ వర్గాలను చరిత్ర పెంటకుప్పల మీదికి విసిరేస్తారు.

అంతర్జాతీయ కార్మిక వర్గం పొందిన తాత్కాలిక పరాజయం తీవ్రమైన సైద్ధాంతిక సంక్షోభానికి దారితీయటం నిజమే అయినప్పటికీ యం.యల్.యం. పార్టీలు అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం సైద్ధాంతిక, సంస్థాగత ఐక్యతను కొనసాగిస్తూ, బలోపేతం చేయడానికి తమ శక్తి మేరకు ప్రయత్నిస్తూనే వున్నాయి.

అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ సైద్ధాంతిక, సంస్థాగత ఐక్యతను బలోపేతం చేసి, యం.యల్.యం. వ్యతిరేక ధోరణుల నుంచి యం.యల్.యం. సూత్రాలను పరిరక్షించి, ప్రజారాసుల పోరాటాలలో ఈ సూత్రాలను ఒక భౌతిక శక్తిగా మార్చటం అన్నది ఈరోజు అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం ముందున్న అతి ప్రధాన సమస్యలలో ఒకటి. అంటే ఆయా దేశాలలో ప్రతి కమ్యూనిస్టు పార్టీ కూడా వర్గ పోరాటాన్ని ముందుకు నడిపించి బలోపేతం చేయాలని, బూర్జువా వర్గానికి, ఇతర ప్రగతి నిరోధక పాలకవర్గాలకూ వ్యతిరేకంగా యుద్ధాన్ని తీవ్రతరం చేయాలనే దీనర్థం.

ప్రతి ఒక్కదేశంలోనూ వర్గ పోరాటాన్ని పురోగమింప జేయటం మీదే అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం ఐక్యత ఆధారపడి వుంది. దాని సంఘీభావ విస్తృతి కూడా ఈ పోరాటంపైనే ఆధారపడి వుంది. ఈ అంశాన్ని దృష్టిలో వుంచుకునే, జాతీయంగా, అంతర్జాతీయంగా సకల యం.యల్.యం. వ్యతిరేక ధోరణులకూ వ్యతిరేకంగా నడిపిన పోరాటాన్ని మరింత ముందడుగేయించి బలోపేతం చేయాల్సి వుంది.

అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం చారిత్రకంగా ప్రధానమైన తన ఈ కర్తవ్యాన్ని నెరవేర్చాలంటే మన ప్రయత్నాలు.... ప్రత్యేకించి దృఢచిత్తం కలిగిన మావోయిస్టు శక్తుల ఉమ్మడి చర్యలు, తోడ్పాటు చాలా అవసరం. అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమాన్ని బలోపేతం చేసే ప్రాతిపదికన మీ పార్టీ సాగిస్తున్న కార్యాచరణ, ప్రత్యేకించి గత కొద్ది సంIIలుగా పుంజుకొన్నది. దీన్ని మరింత ముందుకు తీసుకుపోయి అన్ని రంగాలలో అత్యున్నత స్థాయికి చేరడమే ప్రస్తుత కర్తవ్యం. దీని ద్వారానే సామ్రాజ్యవాదుల చేత కోట్లాది పీడిత, తాడిత ప్రజలు దగా పడటం నిరోధింపబడి, ప్రజలతో మరింత దృఢమైన సంస్థాగత సంబంధాలు నిర్మించబడతాయి.

ప్రపంచంలోని అత్యున్నత పర్వత శిఖరాలమీద రెపరెపలాడుతున్న అరుణపతాక యావత్ ప్రపంచాన్ని చుట్టు ముడుతుంది. ఇది పీడితులను కాక బూర్జువా వర్గాన్నే వణికింప జేస్తుంది. ప్రపంచ మావోయిస్టు శక్తులు తమ మధ్య సంఘీభావానికి ప్రాముఖ్యత నివ్వడం ద్వారా, అనుభవాలను పంచుకొని తమ తమ దేశాల్లో ప్రజాయుద్ధాన్ని పురోగమింప జేయటం ద్వారా ఈ క్రమానికనుగుణంగా ప్రతిస్పందించాలి.

యం.యల్.యం. శాస్త్రానికి కట్టుబడి గొప్ప త్యాగాలకు పాల్పడటం ద్వారానే ఈ మహత్తరమైన, చారిత్రక కర్తవ్యం నెరవేరుతుందనటంలో సందేహం లేదు. ప్రపంచ మావోయిస్టు శక్తులు తమ సోదర స్నేహితులను తమతో తీసుకుపోవటం ద్వారా, తాము సంఘటితమవుతూనే వారిని కూడా సంఘటితపర్చడం ద్వారానే ఈ మహత్తరమైన కష్టసాధ్యమైన కర్తవ్యాన్ని విజయవంతం చేస్తారని మేం విశ్వసిస్తున్నాం.

టర్కీ కార్మికవర్గం, పీడిత ప్రజల తరపున మా పార్టీ, మీ పార్టీ ద్వారా భారత కార్మికవర్గం, పీడిత ప్రజల విప్లవాత్మక పోరాటాలకు అభివందనలు తెలుపుతోంది. టి.కె.పి./యం.యల్. కేంద్రకమిటీతో పాటు మా పార్టీ శ్రేణులు యావన్మందీ మా సోదర పార్టీ సి.పి.ఐ.(యం-యల్) [పీపుల్స్‌వార్] కాంగ్రెస్‌కి కమ్యూనిస్టు స్ఫూర్తితో అభివందనలు తెలుపుతూ, కాంగ్రెస్ ఫలవంతం కావాలని, చక్కటి స్నేహపూరిత ధోరణితోనే చర్చలన్నీ జరగాలని కోరుకుంటున్నారు.

ఈ కాంగ్రెస్‌లో చర్చలూ, వాదోపవాదాలు మరింత ఉన్నతమైన ఐక్యతను, అవగాహనను సాధిస్తాయని మా ప్రగాఢ విశ్వాసం. ఇవి భారత కార్మికవర్గం, పీడిత ప్రజల యొక్క, అంతర్జాతీయ కార్మికవర్గం యొక్క, ప్రపంచ పీడిత ప్రజల ఆశలూ, ఆకాంక్షలను నెరవేర్చటంలో తోడ్పడతాయి. పీడిత ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చే బాధ్యత మీపై వుంది.

భావ సమైక్యత, ఐక్య కార్యాచరణ, ఐక్య క్రమశిక్షణలను సాధించి, పరిరక్షించాల్సిన అవసరాలను దృష్టిలో వుంచుకుని మీ కాంగ్రెస్‌లో సైద్ధాంతిక పోరాటం జరుగుతుందని మా దృఢ విశ్వాసం.

మీ పార్టీ అయిన సి.పి.ఐ.(యం-యల్) [పీపుల్స్‌వార్]తోనూ, వివిధ జాతులు, మైనారిటీలకు చెందిన భారత ప్రజలతోనూ టి.కె.పి./యం.యల్., టర్కీ ప్రజలూ, టర్కిష్ కుర్దిస్తాన్ ప్రజలు భుజం భుజం కలిపి నడుస్తారు. మరోసారి యావన్మంది కాంగ్రెస్ ప్రతినిధులకూ, సి.పి.ఎన్. (మావోయిస్టు) ప్రతినిధికి, ఈ కాంగ్రెస్ విజయవంతం కావడానికి తీవ్రంగా శ్రమించిన కమ్యూనిస్టు యోధులకి, కామ్రేడ్స్ అందరికీ మేం అభివందనలు తెల్పుతున్నాం.

**సి.పి.ఐ.(యం-యల్) [పీపుల్స్‌వార్]9వ కాంగ్రెస్ వర్ధిల్లాలి!**

**సకలదేశ కార్మికులారా, ప్రపంచ పీడిత ప్రజలారా ఏకం కండి!**

**కార్మికవర్గ అంతర్జాతీయత వర్ధిల్లాలి!**

**మార్క్సిజం-లెనినిజం-మావోయిజం వర్ధిల్లాలి!**

**ప్రజాయుద్ధం వర్ధిల్లాలి!**

**కేంద్రకమిటీ**

జనవరి 2001 **టి.కె.పి./యం.యల్.** ❑

## సి.పి.ఐ.(యం-యల్) [పీపుల్స్‌వార్]కి ఫిలిప్పైన్స్ కమ్యూనిస్టు పార్టీ స్నేహపూర్వక శుభాకాంక్షలు

జరగబోతున్న మీ పార్టీ కాంగ్రెస్ సందర్భంగా ఫిలిప్పైన్స్ కమ్యూనిస్టు పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) [పీపుల్స్‌వార్]కి మరోసారి హృదయ పూర్వకమైన సమరశీల, సోదరపూర్వక శుభాకాంక్షలను అందజేస్తోంది. ఈ కాంగ్రెస్ ద్వారా మీరు సరైన సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణ పంథా వైపుగా పార్టీ మొత్తాన్ని ఐక్యపర్చగలరని, ఆ విధంగా ప్రజాయుద్ధం ద్వారా నూతన ప్రజాస్వామిక విప్లవంలో పోరాట స్థాయిని పెంచగలరని మా ప్రగాఢ విశ్వాసం.

1999 డిసెంబర్ 2న భారత ఫాసిస్టు పాలకులచే పాశవికంగా చంపబడిన మీ కేంద్రకమిటీ సభ్యులు అమరులు కామ్రేడ్స్ శ్యాం, మహేష్, మురళీలకు, మీ పార్టీ ఏర్పడినప్పటి నుంచి భారత, ప్రపంచ విప్లవం కోసం అత్యున్నత త్యాగాలకు పాల్పడిన అమరులందరికీ మేం అత్యున్నత గౌరవాభివందనలను అందిస్తున్నాం. వీరి అమరత్వ స్మృతి భారత ప్రజానీకానికేకాక, యావత్ ప్రపంచ విప్లవకారుల మదిలోనూ మిగిలి వుంది. మేం మా విషాదాన్ని విప్లవాత్మక సాహస ప్రవృత్తిగా మార్చుకున్నాం. మీ అమరుల మరణానికి భారత విప్లవ ప్రజలు తప్పక ప్రతీకారం తీర్చుకుని, తుది విజయం వరకూ విప్లవ పోరాటాన్ని కొనసాగించగలరు.

31 సం॥ల కఠినతరమైన పోరాటం ద్వారా మీరు సాధించిన గొప్ప విజయాలకు మీకు మా అభినందనలు. స్థానిక వర్గ శత్రువులకు వ్యతిరేకంగానేగాక, పార్టీలోని అతివాద, మితవాద పెడధోరణులకు వ్యతిరేకంగా, దేశంలోనూ, విదేశాల్లోనూ రివిజనిస్టులు రుద్దిన రకరకాల దివాళాకోరు సిద్ధాంతాలకు వ్యతిరేకంగా కూడా చేసిన పోరాటంలో సి.పి.ఐ.(యం-యల్) [పీపుల్స్‌వార్] పదునెక్కింది.

మార్క్సిజం-లెనినిజం-మావోజెడాంగ్ ఆలోచనా విధానానికి కట్టుబడటమనేదే మీ పార్టీ విజయానికి కీలకం. భారతదేశ నిర్దిష్ట పరిస్థితులకు అనుగుణంగా ఈ సిద్ధాంతాన్ని నిర్దిష్టంగా అన్వయించటం ద్వారా మీరు భారత సమాజపు అర్ధవలస, అర్ధ భూస్వామ్య స్వభావాన్ని సరిగా విశ్లేషించి, సోషలిస్టు దృక్పథంతో నూతన ప్రజాస్వామిక విప్లవ సాధారణ పంథాని ముందుకు తీసుకొచ్చారు. పల్లెపట్టు పట్టణాలను చుట్టుముట్టే దీర్ఘకాల ప్రజాయుద్ధపు వ్యూహాత్మక పంథాని పురోగమింపజేశారు. ఈ సరైన విప్లవ పంథా వైపుగా భారత ప్రజానీకం సమీకృతమై తమ ఉత్తమ పుత్రులను, పుత్రికలను విప్లవానికి సమర్పించారు.

సాయుధ పోరాటాన్ని ప్రధాన పోరాట రూపంగా చేపట్టిన మీ నిర్ణయమే గడచిన 20 సం॥ల మీ సత్వర పురోగమనానికి కీలకమైంది. దళాల నుండి అభివృద్ధి చెందిన గెరిల్లా బలగాలుగా ప్రజాసైన్యాన్ని నిర్మించడంలో, గెరిల్లాజోన్ల నుండి గెరిల్లా స్థావరాల నుండి విస్తృతమైన, సంఘటితమైన స్థావర ప్రాంతాలను నెలకొల్పడానికి తగిన పునాదిని నిర్మించుకోవడంలో ఇదే మిమ్మల్ని అలలు అలలుగా ముందంజ వేయించగలిగింది.

విప్లవాన్ని పురోగమింప జేయటంలో మీ పార్టీ సాయుధ పోరాటం, ఐక్య సంఘటన అనే రెండు ఆయుధాలను ఉపయోగించింది. శత్రువుకు వ్యతిరేకంగా పెనుదెబ్బలు తీయటంలో ఉపకరించిన ఎత్తుగడల పరమైన దాడుల ఉధృతి పెరిగి, ప్రజాసైన్యంకి మరిన్ని ఆయుధాలు లభ్యమై, ప్రజల మనో స్థైర్యాన్ని, పోరాట స్ఫూర్తిని పెంచి మీ సాయుధ పోరాటం గణనీయంగా పురోగమించింది.

కార్మికుల, కర్షకుల మౌలిక ఐక్యత పునాదిగా కల్గి, పట్టణ పెటీబూర్జువాలను, జాతీయ బూర్జువా వర్గాన్ని తనవైపుకు తిప్పుకుని, అభివృద్ధి నిరోధకుల మధ్య వైరుధ్యాలను సానుకూలంగా మార్చుకుని మీ ఐక్యసంఘటన అభివృద్ధి చెందింది.

గ్రామీణ, పట్టణ ప్రాంతాలు రెండింటిలో ప్రజారాసుల్లో మీరు లోతైన సంబంధాలను వృద్ధి చేసుకున్నారు. ప్రజల తక్షణ, దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం వారిని మేల్కొల్పడంలో, కూడగట్టడంలో, సంఘటిత పర్చటంలో మీరు సఫలురైనారు. ఫలితంగా భూ సంస్కరణల్లో, ఉత్పత్తిలో వ్యవసాయ, వ్యవసాయేతర కార్మికుల వేతనాల పెంపుదలలో ప్రజలు మంచి ప్రయోజనాలు సాధించారు. అందుచేత మీ పార్టీ, ప్రజాసైన్యం విస్తృత ప్రజారాసుల విశాలమైన, ఉత్సాహభరితమైన మద్దతును పొందుతున్నాయి.

భారత పాలకవర్గాల ప్రజా వ్యతిరేక, సామ్రాజ్యవాద అనుకూల విధానాలను ఎండగట్టి ప్రతిఘటించేందుకై మీ పట్టణ ప్రజా ఉద్యమం వందలాది, వేలాది ప్రజలను సమీకరించగల్గింది. ఐ.యం.యఫ్., ప్రపంచబ్యాంకు, డబ్ల్యు.టి.ఓ. వంటి సామ్రాజ్యవాద సంస్థల నయా ఉదారవాద విధాన సూత్రాలను భారత పాలకవర్గాల విధానాలు అనుసరిస్తున్నాయి. దేశీయ పాలక వ్యవస్థ యొక్క సామాజిక, ఆర్థిక సంక్షోభం పతనం నుండి మరింత అధోగతికి చేరి విశాల ప్రజారాసులను పెనుబాధలకు గురిచేస్తున్నది.

పార్టీ 31వ ఆవిర్భావ సం॥ర సందర్భంగా విస్తృత ప్రజా పునాది కల్గిన, సైద్ధాంతికంగా, రాజకీయంగా, నిర్మాణపరంగా సంఘటితమైన దేశవ్యాప్త బోల్షివిక్ పార్టీగా పార్టీని నిర్మించాలంటూ మీరిచ్చిన పిలుపు పెరుగుతున్న విప్లవకర సాయుధ పోరాట డిమాండ్ల నేపథ్యంలో చాలా సందర్భోచితమైనదే కాక విప్లవాన్ని వ్యాపింపజేయగల గొప్ప శక్తిని కూడా కలిగివుంది.

విస్తృత జనాభాను కలిగిన అతిపెద్ద దేశమైన భారతదేశం ఆసియా ఖండంలో వ్యూహాత్మక స్థానంలో వుంది. భారతదేశంలో విప్లవ పురోగమనం ప్రపంచ కార్మికవర్గ విప్లవంలో ఒక గొప్ప ప్రాధాన్యతని కలిగి, గొప్ప పరిణామాలకు తప్పక దారి తీస్తుంది.

సామ్రాజ్యవాద, కార్మికవర్గ విప్లవాల యుగంలో ప్రజాయుద్ధాన్ని సాగిస్తున్న మార్క్సిస్టు-లెనినిస్టు-మావోయిస్టు పార్టీలకు, ఉద్యమాలకు అత్యంత ప్రాధాన్యత వుంది. ఇవి సిద్ధాంతాన్ని సమర్థవంతంగా ఎత్తిపట్టి రాజ్యం-విప్లవంకి సంబంధించిన మార్క్సిస్టు-లెనినిస్టు సిద్ధాంతాన్ని ఆచరిస్తూ సాయుధ విప్లవం ద్వారా ప్రపంచ కార్మిక విప్లవాన్ని ముందుకు తీసుకుపోతున్నాయి. కార్మికవర్గాన్ని ప్రజలను దోపిడీ పీడనల వైపుగా సామ్రాజ్యవాదులు, దేశీయ ప్రతీఘాతుక పాలకవర్గాలూ తోసుకుపోస్తున్న ప్రపంచ పరిస్థితులలో ఇవి అతి ముఖ్య పాత్ర నిర్వహిస్తున్నాయి.

సామ్రాజ్యవాదానికి, సకల ప్రతీఘాతక శక్తులకు వ్యతిరేకంగా పోరాటంలో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) [పీపుల్స్‌వార్], ఫిలిప్పైన్స్ కమ్యూనిస్టు పార్టీలు భుజం భుజం కలిపి పోరాడుతున్నాయి. సామ్రాజ్యవాదుల, దేశీయ ప్రతీఘాతకుల దోపిడీ పీడనల నుండి మన ప్రజలను విముక్తి చేయడానికి సాగిస్తున్న ఉమ్మడి పోరాటంలో సన్నిహిత సహకారాన్ని, పరస్పర మద్దతును కొనసాగించ

డానికి మనం కృత నిశ్చయులమై వున్నాం. ఆ విధంగా మన సొంత తోడ్పాటును ప్రపంచ కార్మికవర్గ పోరాటాన్ని ముందుకు తీసుకుపోయేలా మలుస్తాము.

మీరు జరుపబోతున్న కాంగ్రెస్‌లో మీరు సంపూర్ణ విజయాన్ని సాధిస్తారని మేం ఆశిస్తున్నాం. రానున్న సం॥లలో సి.పి.ఐ. (యం-యల్) [పీపుల్స్‌వార్] నాయకత్వంలోని విప్లవకర సాయుధ పోరాటం మరిన్ని గొప్ప విజయాలను సాధించే సందర్భాల కోసం మేం ఎదురు చూస్తుంటాం. మీరు నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని సాధించి దాని వెనువెంటనే సోషలిస్ట్ విప్లవాన్ని నిర్వహిస్తారన్నది మా ప్రగాఢ విశ్వాసం.

*** సి.పి.ఐ. (యం-యల్) [పీపుల్స్‌వార్] వర్ధిల్లాలి!**

*** భారత విప్లవం వర్ధిల్లాలి!**

*** కార్మికవర్గ అంతర్జాతీయత వర్ధిల్లాలి!**

**కేంద్రకమిటీ**

**ఫిలిప్పైన్స్ కమ్యూనిస్టు పార్టీ**

**ఫిబ్రవరి 10, 2001** ❑

## పి.జి.ఏ. ఆవిర్భావం సందర్భంగా న్యూజిలాండ్ వర్కర్స్ పార్టీ సందేశం

కేంద్రకమిటీ,

ప్రియమైన కామ్రేడ్స్,

భారత ప్రజా గెరిల్లా సైన్యం ఆవిర్భావ సందర్భంగా న్యూజిలాండ్ వర్కర్స్ పార్టీ మీ కేంద్రకమిటీకి, మీ పార్టీ శ్రేణులందరికీ విప్లవాభివందనలు తెలుపుతోంది. పి.జి.ఏ. స్థాపన భారత విప్లవానికే కాక, ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమ పునరుద్ధరణలో భాగంగా కూడా ఒక ముఖ్యమైన పరిణామంగా మేం చూస్తున్నాం.

మీరు తీవ్రాతితీవ్రమైన నిర్బంధానికి గురవుతున్నారని మీ పత్రికా ప్రకటనల ద్వారా, మీ ప్రచురణల ద్వారా మాకు తెలుసు. భారత ఫాసిస్ట్ రాజ్యం అత్యంత పాశవికమైనదనటంలో సందేహమే లేదు. మీ ధైర్య సాహసాలూ, కృత నిశ్చయం ప్రపంచ వ్యాప్తంగా విప్లవ కారులందరికీ చక్కటి ఉదాహరణగా నిలుస్తాయి

ప్రజాయుద్ధం వర్ధిల్లాలి!

సాహార్ద అభివందనలతో

మీ ప్రతి విజయాన్ని కోరుకుంటూ

**డాప్నా వైట్‌మోర్**

**జనరల్ సెక్రటరీ**

**న్యూజిలాండ్ వర్కర్స్ పార్టీ**

(11వ పేజీ తరువాయి)

ఇపుడు మరిన్ని చేర్పులతో కాంగ్రెస్ ఆమోదించింది.

* కాంగ్రెస్‌లో చర్చల ద్వారా పి.జి.ఏ., గెరిల్లాజోన్లు, స్థావర ప్రాంతాల వంటి అంశాలపై పార్టీ మరింత స్పష్టతను సాధించింది.

* స్వీయ మానసికతత్వం, ప్రాప్తకాలజ్ఞత, ఉదారవాదం, ఆర్థికవాదం, ప్రాగ్మాటిజంలతో పాటు పితృస్వామ్యం, పెత్తందారీ తనానికి సంబంధించిన అంశాలను కూడా పార్టీలోని ప్రధాన లోపాలుగా కాంగ్రెస్ గుర్తించింది. దిద్దుబాటు ఉద్యమం ద్వారా ఈ కార్మిక వర్గేతర ధోరణుల నుండి పార్టీని చక్కదిద్దుతానని కాంగ్రెస్ ప్రతిన చేసింది.

* అంతిమంగా కాంగ్రెస్ ప్రధాన రాజకీయ కర్తవ్యాలను కింది విధంగా రూపొందించింది.

ఎ) దేశ వ్యాప్తంగా ప్రజాయుద్ధాన్ని పురోగమింపజేసి తీవ్రతరం చేద్దాం. గెరిల్లాజోన్లు స్థావర ప్రాంతాలుగా అభివృద్ధి పర్చేందుకుగాను పి.జి.ఏ.ని, పార్టీ పనిని బలోపేతం చేద్దాం.

బి) దేశంలో సామ్రాజ్యవాద దాడికి వ్యతిరేకంగా, ప్రపంచీకరణ పేరిట చేపడుతున్న ''నూతన ఆర్థిక విధానాల''కు వ్యతిరేకంగా అన్ని శక్తులను ఐక్యం చేద్దాం.

సి) హిందూ ఫాసిజంకి వ్యతిరేకంగా సకల శక్తులనూ ఏకం చేద్దాం.

డి) సాయుధ ప్రతిఘటన ద్వారా, సకల ప్రజాస్వామిక శక్తుల సమీకరణ ద్వారా రాజ్య నిర్బంధాన్ని ప్రతిఘటించి ఓడిద్దాం.

ఇ) సామ్రాజ్యవాదంతో, ప్రత్యేకించి ప్రపంచ ప్రజల ప్రథమ శత్రువైన అమెరికన్ సామ్రాజ్యవాదంతో పోరాడేందుకు ప్రపంచ పీడిత ప్రజలందరితో ఐక్యమవుదాం.

చివరగా అనేక దేశీయ భాషలలో, నేపాలీ, టర్కిష్ భాషల్లో ఏక కాలంలో ఇంటర్నేషనల్ గీతాన్ని ఆలపించి, ఎర్రజెండాను అవనతం చేయటం ద్వారా కాంగ్రెస్ ముగిసింది.

భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమం సాధించిన అతి గొప్ప విజయమే ఈ 9వ కాంగ్రెస్. కాంగ్రెస్ సంస్థాగతంగా, రాజకీయంగా పార్టీని సంఘటిత పర్చడమేగాక పార్టీని అత్యున్నత స్థాయిలో ఐక్యపర్చింది. గతంలో కంటే మిన్నగా ఇప్పుడు పార్టీ ప్రజాయుద్ధాన్ని పురోగమింప జేయడంలో సవాళ్ళను ఎదుర్కోవడానికి సంసిద్ధ పడుతోంది. అడ్డంకులన్నింటినీ అధిగమించి, ప్రతి రంగంలోనూ శత్రువును ఓడించి, నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతంగా పురోగమింప జేసేందుకు తద్వారా ఒక సోషలిస్ట్, కమ్యూనిస్టు సమాజాన్ని స్థాపించే దిశగా స్థిరంగా ముందడుగేసేందుకు పార్టీ ఇపుడు ఎనలేని ఆత్మ విశ్వాసంతో వుంది.

కాంగ్రెస్ తమ ముందుంచిన చారిత్రక బాధ్యతలపట్ల చైతన్యంతో, తమ ముందుంచిన కర్తవ్యాల సాధనకై కృతనిశ్చయంతో, విప్లవ భవిష్యత్తుపై చెదరని విశ్వాసంతో కాంగ్రెస్ ప్రతినిధులు వీడ్కోలు చెప్పుకుని విడిపోయారు. ❑

# పి.జి.ఏ. నిర్మాణం, రీజియనల్ పర్స్పెక్టివ్‌ల రూపకల్పనతో విప్లవోత్తేజాన్ని నింపుతూ విజయవంతంగా ముగిసిన 15వ రాష్ట్ర మహాసభలు!!

సి.పి.ఐ. (యం-యల్) [పీపుల్స్‌వార్] పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 15వ మహాసభలు కొన్ని ముఖ్య కారణాల వలన కొంత ప్రత్యేకతని, ఎంతో ప్రాముఖ్యతని సంతరించుకున్నాయి. అలాంటి కారణాలలో మొదటిది ప్రధానమైనది ఏమంటే - చారిత్రాత్మకమైన పార్టీ 9వ కాంగ్రెస్‌లో భాగంగా ఈ మహాసభలు జరగడమే!

ఈ బూటకపు ప్రజాస్వామ్యాన్ని ఓడించి నూతన ప్రజాస్వామ్యాన్ని స్థాపించాలంటే అందుకు సాయుధ పోరాటమే మార్గం తప్ప పార్లమెంటరీ మార్గం పనికిరాదు. అలాంటి సాయుధ పోరాటాన్ని శక్తివంతంగా రంగంమీదికి తీసుకువచ్చింది నక్సల్‌బరి. మహత్తర నక్సల్‌బరి వారసత్వాన్ని, దాన్ని నిర్మించిన భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) వారసత్వాన్ని భుజాన ఎత్తుకుని మొక్కవోని త్యాగాలతో దృఢంగా విప్లవబాటలో ప్రయాణిస్తోంది పీపుల్స్‌వార్ పార్టీ! మన మాతృసంస్థ అయిన ఎం-ఎల్ పార్టీలో ఏర్పడిన చీలికల పర్యవసానంగా వేర్వేరు గ్రూపులుగా వుంటూనే నక్సల్‌బరి స్ఫూర్తితో విప్లవాచరణను అంటిపెట్టుకు పనిచేస్తున్న సాటి విప్లవ నిర్మాణాల్ని, విప్లవకారుల్ని ఒకే పార్టీ కింద ఐక్యపరచడానికి మనపార్టీ ముందు నుంచీ నిజాయితీగానూ, సూత్రబద్ధంగానూ కృషిచేస్తూనే వస్తోంది. మన ఈ కృషిలో భాగంగానే ఎం.సి.సి.తో మనం చేస్తూ వచ్చిన ఐక్యతా ప్రయత్నాలు వారి ఒంటెత్తుపోకడ కారణంగానే ఫలప్రదం కాలేదనేది బాధాకరమైన వాస్తవం! కాగా 'పార్టీయూనిటీ'తో జరిపిన ఐక్యతాకృషి ఫలించింది. ఫలితంగా ఒకప్పటి 'పీపుల్స్‌వార్' 'పార్టీయూనిటీ'లు రెండూ 1998 ఆగస్టులో విలీనం అయి కొత్త పీపుల్స్‌వార్ పార్టీ ఏర్పడింది. ఒకే పార్టీ కింద ఐక్యం కావాల్సిన ఒకటి రెండు విప్లవ నిర్మాణాలు, కొంతమంది విప్లవకారులు ఇప్పటికీ ఇంకా మన పార్టీకి వెలుపలనే వుంటున్నప్పటికీ మన ఈ కొత్త పార్టీ ఏర్పాటుతో దేశంలోని మెజారిటీ విప్లవకారుల ఐక్యత సుమారుగా అయినట్టుగానే విలీనం అనంతరం ఏర్పడిన మన పార్టీ ఐక్య (ప్రొవిజనల్) అభిప్రాయపడింది. కనుక జరుపదలచిన ఐక్య పార్టీ కాంగ్రెస్‌ను 1970 నాటి ప్రథమ కాంగ్రెస్ తరువాత జరుగుతున్న రెండవ కాంగ్రెస్‌గాను, భారత కమ్యూనిస్టు నిర్మాణోద్యమ చరిత్ర రీత్యా 1970 నాటి కాంగ్రెస్ 8వ కాంగ్రెస్ అవుతుంది గనుక దీన్ని 9 (2) కాంగ్రెస్‌గా నిర్వహిస్తూ కాంగ్రెస్‌లో దీన్ని 9వ కాంగ్రెస్‌గా నిర్ధారింపజేయాలని కేంద్రకమిటీ భావించింది. పార్టీ సిద్ధాంత రాజకీయ అవగాహనల్లోనూ, పంథా కార్యక్రమాల్లోనూ నేటి తాజా జాతీయ అంతర్జాతీయ పరిస్థితులు పరిణామాలకి అనుగుణంగా అవసరమైన అభివృద్ధికరమైన మార్పులు చేర్పులతో పార్టీ మౌలిక డాక్యుమెంట్లని రూపొందించుకోవడం, ఆ డాక్యుమెంట్ల ప్రాతిపదికగా అవసర కర్తవ్యాలు, నినాదాలని చేపట్టడం లక్ష్యంగా సాగే చారిత్రక ప్రాధాన్యత గల పార్టీ 9వ కాంగ్రెస్‌లో భాగంగా జరిగే రాష్ట్ర 15వ మహాసభలు సహజంగానే గత మహాసభలకంటే ప్రత్యేకతతో, ప్రాధాన్యతతో వుంటాయి.

మునుపెన్నడూ లేనంతటి పాశవిక ఫాసిస్టు రాజ్య నిర్బంధం కొనసాగుతుండిన కాలంలో సిద్ధాంత రాజకీయ నిర్మాణ రంగాలలో రాటుదేలుతూ అప్పటికే పార్టీలో తలెత్తిన రెండు ఆంతరంగిక సంక్షోభాల నుండి పార్టీ ఉద్యమాలని అధిగమింపజేయడంలో నిర్మాణాత్మకమైన పాత్రని పోషిస్తూ వచ్చిన కా॥ మహేష్ లాంటి పరిణతి చెందిన నాయకత్వాన్ని రాష్ట్ర పార్టీ కోల్పోయిన క్లిష్ట పరిస్థితుల్లో ఆ అపార నష్టాన్ని పూడ్చుకుంటూ రాష్ట్ర పార్టీ కార్యదర్శిగా కా॥ మహేష్ అందించిన నాయకత్వ స్ఫూర్తికి తగిన గౌరవాన్ని న్యాయాన్ని కలిగిస్తూ రాష్ట్ర పార్టీ పునస్సంఘటితమయ్యే క్రమంలో, రాష్ట్రకమిటీ పునర్నిర్మాణమయ్యే క్రమంలో జరిగిన మహాసభలు ఇవి కావడం వీటి ప్రాధాన్యతకు గల రెండో కారణం.

ప్రపంచబ్యాంకు ఏజెంటుగిరీని నెత్తినెత్తుకున్న ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు దాని దోపిడీ వ్యూహం అమలుకి రాష్ట్రాన్ని ఒక ప్రయోగశాలగా మలచేశాడు, మార్చేశాడు. అందుకే చంద్రబాబు హయాంలోని ఆంధ్ర రాష్ట్రంలో ప్రపంచబ్యాంకు ప్రపంచ వాణిజ్య సంస్థల్లాంటి సామ్రాజ్యవాద ఆర్థిక సంస్థల దోపిడీ 'సంస్కరణలు' 'సరళీకరణలు' 'ప్రైవేటీకరణలు' మిగతా ఏ రాష్ట్రంలోకంటే కూడా జోరుగా సాగిపోతున్నాయి. ఇవన్నీ ప్రజలపై ఎక్కుపెట్టబడిన దాడులేననడానికి అట్టే వివరణ అవసరం లేదు. గతంలో ఎప్పటికంటే కూడా రాష్ట్రంలో ఎక్కువైపోతున్న రైతులు కార్మికుల ఆకలిచావులు ఆత్మహత్యలు (ప్రత్యేకించి ప్రత్తి, పొగాకు, వేరుశెనగ రైతులు; చేనేత కార్మికులు); పెరిగిపోతున్న పేదరైతులు వ్యవసాయ కార్మికుల వలసలు; పేట్రేగిపోతున్న నిరుద్యోగం; విద్య, వైద్యం, సేవారంగాలతోపాటు సమస్తం ఫక్తు వ్యాపార రంగాలుగా మారిపోతుండటం ఇందుకు తిరుగులేని నిదర్శనాలు. రాష్ట్ర రైతాంగం, కార్మికులు, విద్యార్థి యువజనులు ఈ దాడుల్ని మౌనంగా సహిస్తూ పడివుండటం లేదు. ప్రతిఘటిస్తున్నారు, ఉద్యమిస్తున్నారు. మన పార్టీ నాయకత్వంలో రాష్ట్రంలో వేళ్లూనుకున్న విప్లవోద్యమం రాష్ట్రంలోని పీడిత ప్రజల పోరాటాలకి అండగా నిలుస్తూనే వుంటుంది. సామ్రాజ్యవాద దోపిడీమూకలు వారితో మిలాఖత్తయ్యే దేశీయ బడా భూస్వామ్య దళారీ బూర్జువా వర్గాలు వారి వారి రాజకీయ పార్టీలు ప్రభుత్వాలు రాజ్యాంగ యంత్రాలు తమపై చేసే క్రూరమైన దాడుల్ని త్రిప్పికొట్టడానికి ప్రజలు చేపట్టే సమరశీల వుద్యమాల్ని వాటికండగా నిలిచే వర్గ విప్లవోద్యమాలని విచ్ఛిన్నం చేసి అణచడానికి ప్రపంచ సామ్రాజ్యవాదం ప్రత్యేకించి అమెరికన్ సామ్రాజ్యవాదం 'తక్కువ స్థాయీ యుద్ధతంత్రం' (లో ఇంటెన్సిటీ కాన్‌ఫ్లిక్ట్-ఎల్.ఐ.సి.) అనే ప్రతీఘాతుక విప్లవ యుద్ధతంత్రాన్ని వివిధ దేశాల్లో అక్కడి దోపిడీ ప్రభుత్వాల ద్వారా అమలు చేయిస్తోంది. మన పార్టీ నేతృత్వంలో సాయుధ విప్లవోద్యమం బలంగా వేళ్లూనుకొని వుంటున్న ఆంధ్రరాష్ట్రంలో ఈ ప్రతీఘాతుక విప్లవ యుద్ధతంత్రాన్ని ప్రయోగాత్మకంగా పకడ్బందీగా అమలు చేయడంలో ప్రత్యేకంగా తర్ఫీదు అయినవాడుగానే రుజువవుతున్నాడు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు.

సామ్రాజ్యవాద గుత్తసంస్థల ప్రయోజనాలకి వాటితో మిలాఖత్తయ్యే రామోజీరావు లాంటి దళారీ బూర్జువా బడాభూస్వాముల ప్రయోజనాలకు అనుగుణంగా అన్ని రంగాలనీ ప్రైవేటీకరించేయడానికి, కార్పొరేట్ రంగాలుగా మార్చేయడానికి నడుం బిగించిన చంద్రబాబు వీటికి వ్యతిరేకంగా తలెత్తే ప్రజా ఉద్యమాన్ని, వాటికండగా నిలచే విప్లవోద్యమాన్ని అణచివేయడానికి రాష్ట్రాన్ని ఒక పోలీసు రాజ్యంగా మలుస్తున్నాడు. ఇంకో ప్రక్క ఘడియకొక్కటిగా రకరకాల బూటకపు వాగ్దానాలు, పథకాలతో ఊపిరిసలపనివ్వని ప్రచారార్భాటంతో అన్నిరకాల వంచనలు అవకాశవాదాల్ని రంగరించి మరీ బూటకపు ఎన్నికల్లో ఎలాగోలాగ నెట్టుకొస్తూ తన దోపిడీ అణచివేత వ్యూహానికి సాధికారత కల్పించుకుంటున్నాడు, పారదర్శకతగా ప్రచారం చేయించు కుంటున్నాడు. ఇవన్నీ ఈ ప్రతీఘాతుక యుద్ధతంత్రంలో భాగమే!

టి.డి.పి. అనే లేబుల్‌తో చంద్రబాబు అనే ఏజెంట్ ద్వారా రాష్ట్రంలో ప్రపంచబ్యాంకు నడుపుతున్న ప్రభుత్వంలోని పోలీసుశాఖ రాష్ట్రంలో మన పార్టీ ఉద్యమాలపై ఎక్కుపెట్టిన కోవర్టులు, ఇన్‌ఫార్మర్లు, గ్రీన్‌టైగర్లు, ప్రజాబంధులు, నల్లదండులు, మైత్రీసంఘాలు, కౌన్సిలింగులు - ఇవన్నీ కూడా ఈ ప్రతీఘాతుక యుద్ధతంత్రంలో (ఎల్.ఐ.సి.) భాగమే! ప్రభుత్వ పాలన రూపంలో ప్రజాస్వామ్యంగా కనబడుతూ సారంలో ఫాసిస్టు నియంతృత్వంగా మాత్రమే కొనసాగడం ఈ యుద్ధతంత్రంలోని కీలకాంశం! దీన్ని అనుసరించే దోపిడీ పాలకులు, ప్రభుత్వాలు తమకి ప్రజల అండదండలున్నట్టుగాను; తమ పాలనా పద్ధతులు, విధానాలకి ప్రజల మద్దతు వున్నట్టుగాను; ప్రజా ఉద్యమాలు, విప్లవోద్యమాలు అనవసరం, నిరుపయోగం అయినవిగానూ; కాలం చెల్లినవిగానూ విషప్రచారం చేస్తూ ప్రజల్లోనూ ఉద్యమకారుల్లోనూ గందరగోళం నిరాశా నిస్పృహలు కలిగించడానికి విఫలయత్నం చేస్తుంటాయి. చంద్రబాబు ప్రభుత్వం, దాని ప్రచార సాధనాలు, దాని పోలీస్ యంత్రాంగం మన పార్టీ ఉద్యమాలపై సాగిస్తున్న ప్రచారదాడి ఇందులో భాగమే!

ఇలాంటి చంద్రబాబు ప్రభుత్వ ఫాసిస్టు పాలనా విధానాల్ని, ప్రతీఘాతుక యుద్ధతంత్రంలో భాగంగా అతడి ప్రభుత్వం అమలుచేస్తున్న దారుణ నిర్బంధకాండని ఎదిరిస్తూ 1995 నాటి 14వ మహాసభలు తరువాత గడచిన 5 సంవత్సరాల కాలంలో కా॥ మహేష్‌లాంటి అగ్రశ్రేణి నాయకులతో పాటు మెరికల్లాంటి ఎంతోమంది వీరకామ్రేడ్స్‌ని కోల్పోయినా కూడా మన పార్టీ ఉద్యమాలు నిలద్రొక్కుకుంటూ, పునస్సంఘటితమవుతూ, పురోగమిస్తున్న ఒక మలుపుదశలో ఈ 15వ మహాసభలు జరగడమనేది వీటి మరో ప్రాధాన్యత! ఈ కారణాలు, విశేషాల రీత్యా ప్రాధాన్యతని సంతరించుకున్న ఆంధ్ర రాష్ట్ర 15వ మహాసభలు తదనుగుణంగానే సాగాయి.

ఆంధ్రప్రదేశ్‌లోని ఒకానొక అటవీ ప్రాంతం. ఎత్తైన కొండల మధ్య పచ్చటి అడవిలో వెలసింది. కొయ్యూరు అమరుల కమ్యూన్. ఇది సి.పి.ఐ. యం-యల్ (పీపుల్స్‌వార్) పార్టీ ఆంధ్రప్రదేశ్ 15వ రాష్ట్ర మహాసభల వేదిక. కమ్యూన్‌కి ప్రారంభం చంద్రగిరి గట్టు అమరుల ద్వారం. కమ్యూన్ నలువైపులా మహాసభల నిర్వహణలో భాగంగా ఏర్పర్చిన పలు నిర్మాణాలు. కమ్యూన్ చుట్టూ శత్రు దుర్భేద్యమనిపించే రీతిలో ఏర్పర్చిన సెంట్రీ పోస్టులు. కమ్యూన్ పొడవునా వివిధ అవసరాల రీత్యా నిర్మించిన అనేక శిబిరాలు. డిఫెన్స్ టెంట్, కమ్యూన్‌కి ఒక వైపున మిలటరీ గ్రౌండ్, కాన్ఫరెన్స్ హాలు, వైద్యశాల, లైబ్రరీ, దాదాపు నెలరోజుల పాటు 80 మంది విప్లవకారుల అవసరాల కోసం ఏర్పర్చిన వంటశాల, మధ్యలో కేంద్ర, రాష్ట్రకమిటీ సభ్యుల సమావేశాల కోసం విడిగా ఏర్పాటుచేసిన శిబిరం. మిలటరీ గ్రౌండ్‌లోనే కా॥ బాలక్రిష్ణ, రామస్వామి, శ్రీధర్‌ల సాహితీ వేదిక, పెదతూండ్ల మహిళా అమరులు కా॥ సునీత, సమ్మక్క, జానకి, స్వప్నల సాంస్కృతిక వేదిక, ధూమపాన వ్యతిరేక వేదికలకు స్థానం కల్పించారు. అది పి.జి.ఏ. యోధుల పటిష్టమైన రక్షణలో ఏర్పడిన విప్లవ కుగ్రామం. రాష్ట్ర కాన్ఫరెన్స్ జరుగబోతోందన్న ఖచ్చితమైన అంచనాతో శత్రువు పల్లెల్లోనేగాక స్పెషల్ బలగాలను కాన్ఫరెన్స్ ప్రాంతం పరిసరాల వరకూ దింపి తీవ్రంగా గాలింపు జరిపిన ఉద్రిక్త వాతావరణంలో ప్రజాగెరిల్లాలు సదా అప్రమత్తులై కమ్యూన్‌ని కంటికి రెప్పలా కాపాడుతూ వచ్చారు.

పటిష్టమైన ప్లెటూన్ రక్షణలో ప్రజాగెరిల్లా సైన్యం ఆవిర్భవించిన ఉత్తేజకరమైన వాతావరణం మధ్య పీపుల్స్‌వార్ పార్టీ ఆంధ్రప్రదేశ్ 15వ రాష్ట్ర మహాసభలు 2000 డిసెంబర్ 14న ప్రారంభమైనాయి. అంతకుముందు రోజు అంటే డిసెంబర్ 13ని మొత్తంగా ప్రజాగెరిల్లా సైన్య దినంగా జరుపుకుని ఒక ఉత్తేజపూరితమైన వాతావరణంలో మహాసభలకు అంతా సిద్ధమయ్యారు. (ప్రజాగెరిల్లా సైన్యం డిసెంబర్ 2వ తేదీనే ఆవిర్భ వించినప్పటికీ కొన్ని అనివార్య కారణాల వల్ల ఆంధ్రప్రదేశ్‌లో పి.జి.ఏ. ఆవిర్భావ దినం కార్యక్రమం డిసెంబర్ 13న జరపడమైంది. ఈ కార్యక్రమ విశేషాలకు 2000 సం॥రం నవంబర్-డిసెంబర్ క్రాంతి సంచికను చూడండి) రాష్ట్ర మహాసభలు 14-12-2000 నుండి 30-12-2000 వరకు 16రోజుల పాటు నిరాటంకంగా జరిగి విజయవంతంగా ముగిశాయి.

14-12-2000 ఉదయం ప్రతినిధులంతా మహాసభల హాల్‌లోకి ప్రవేశించాక రాష్ట్రకమిటీ 13 అంశాలతో కూడిన ఎజెండాని ప్రతిపాదించింది. 1. డెలిగేట్స్ పరిచయం, 2. అధ్యక్షవర్గం ఎన్నిక; ప్రారంభోపన్యాసం, సందేశాలు; అమరులకు జోహార్లు చెప్తూ తీర్మానం; జైల్ కామ్రేడ్స్‌కి విప్లవాభివందనాలు తెలుపుతూ తీర్మానం, 3. స్టీరింగ్ కమిటీ ఎన్నిక, 4. చర్చించాల్సిన ముసాయిదా డాక్యుమెంట్లు - ఎ. పార్టీ కార్యక్రమం, బి. పార్టీ నిబంధనావళి, సి. వ్యూహం-ఎత్తుగడలు, డి. గెరిల్లాజోన్ పర్స్పెక్టివ్, ఇ. ప్రస్తుత రాజకీయ పరిస్థితి-మన కర్తవ్యాలు; చైనా కమ్యూనిస్టు పార్టీపై తీర్మానం; ఎఫ్. ఆర్థిక విధానం, జి. కేంద్ర పి.ఓ.ఆర్., హెచ్. రాష్ట్ర పి.ఓ.ఆర్.; కా॥ వినోద్ డీమోట్ తీర్మానం; ఈస్ట్ రీజియన్ విడిపోవడంపై తీర్మానం, 5. అకౌంట్స్-బడ్జెట్, 6. విమర్శ-స్వయంవిమర్శ, 7. కమిటీ ఎన్నిక-ప్రతిజ్ఞ, 8. కాంగ్రెస్‌కి డెలిగేషన్ ఎన్నిక, 9. తీర్మానాలు, 10. తక్షణ కర్తవ్యాలు, కాన్ఫరెన్స్ నినాదాలు, 12. డెలిగేషన్ ప్రతిజ్ఞ, 13. ముగింపు ఉపన్యాసం. ఈ ఎజెండాను ప్రతినిధులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు.

రాష్ట్రకమిటీ ముందుగా డెలిగేట్స్‌ని పరిచయం చేస్తూ వారు

వచ్చిన రంగాన్ని, వారి ఉద్యమ జీవితాన్ని, ప్రస్తుత స్థాయిని పరిచయం చేయగా వారంతా హాల్‌కి 'లాల్‌సలాం' చెబుతూ ఆయా ప్రాంతాలవారీగా వారికి కేటాయించిన స్థలాలలో కూర్చున్నారు. మహాసభలకి ఎన్నిక కాబడిన మొత్తం ప్రతినిధుల సంఖ్య ఓటుహక్కు లేనివారితో సహా 31 కాగా ఒక్క ప్రతినిధి కామ్రేడ్ మాత్రం కొన్ని కారణాల వల్ల హాజరు కాలేదు. మిగతా 30 మంది హాజరయ్యారు. ప్రతినిధులలో నలుగురు మహిళా కామ్రేడ్స్ వున్నారు. కేంద్రకమిటీ నుంచి కా॥ బసవరాజ్, కా॥ గంగాధర్‌లు ఈ మహాసభలకు పర్యవేక్షకులుగా వచ్చారు. ఢిల్లీ, కర్నాటక రాష్ట్రాల పార్టీ కార్యదర్శులు, తమిళనాడు రాష్ట్రకమిటీ సభ్యుడు ఈ కాన్ఫరెన్స్‌కి పరిశీలకులుగా వచ్చారు. ఒక మహిళా కామ్రేడ్‌తో పాటు ముగ్గురితో కూడిన అధ్యక్ష వర్గాన్ని ప్రతినిధులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మినిట్స్ రైటర్స్‌ని కూడా ఎంపిక చేసుకున్న తరువాత కేంద్రకమిటీ సభ్యుడు కా॥ గంగాధర్ ఈ కాన్ఫరెన్స్ ప్రాముఖ్యత గురించి హాల్‌ని ఉద్దేశిస్తూ ప్రసంగించాడు. ఇతర ఎజెండా అంశాలపైని చర్చ కొనసాగింది. కా॥ గంగాధర్ ప్రారంభోపన్యాసం తరువాత పరిశీలక కామ్రేడ్స్ ముగ్గురూ తమ తమ సందేశాలని అందిస్తూ ప్రసంగించారు. ఆయా రాష్ట్రకమిటీల తరపున వీరు ఏ.పి. 15వ రాష్ట్ర మహాసభలు విజయవంతం కావాలని ఆశిస్తూ తమ సందేశాలు వినిపించారు.

డాక్యుమెంట్లపై చర్చ ప్రారంభానికి ముందు అమరవీరులకు జోహార్లు అర్పిస్తూ ఒక తీర్మానాన్ని, నిర్బంధ శిబిరంలోని కామ్రేడ్స్‌కి విప్లవ జేజేలు చెబుతూ ఇంకో తీర్మానాన్ని హాలు ఆమోదించింది. ''ఆంధ్రరాష్ట్ర 14వ మహాసభలు జరిగి ఇప్పటికి 5 సం॥లు గడచిపోయాయి. ఈ మధ్యకాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా తలపెట్టిన దాడిలో 241 మంది కామ్రేడ్స్‌ని కోల్పోయాం...ప్రభుత్వం తలపెట్టిన ఈ సాయుధ అణచివేత దాడిని మన పార్టీ నాయకత్వంలో గెరిల్లా దళాలు, ప్రజలు వీరోచితంగా తిప్పికొడుతూ పోరాటంలో ఉన్నతమైన విప్లవ సాంప్రదాయాలు నెలకొల్పారు. ఈ మొత్తం కాలంలో ఆంధ్ర రాష్ట్రకమిటీ సెక్రటరీ కా॥ మహేష్ నుండి మొదలుకుని సాధారణ ప్రజల వరకు ఎంతోమంది కామ్రేడ్స్ వీరోచితంగా పోరాడుతూ తమ నెత్తుటి త్యాగాలతో ఎర్రజెండాను సమున్నతంగా నిలిపారు. వీరిలో రాష్ట్రకమిటీ సభ్యులు 5గురు, రీజియనల్ కమిటీ సభ్యులు ఇద్దరు, జిల్లాకమిటీ సభ్యులు 10 మంది, కమాండర్స్ 17 మంది, శాక్‌స్థాయి సభ్యులు 29 మంది, సి.ఓ.లు 8 మంది, దళసభ్యులు 77 మంది (వీరిలో 43 మంది పార్టీ సభ్యులు, 34 మంది నాన్ పి.యం.లు) పి.పి.యం.లు 17 మంది, ప్రజాసంఘాల వారు 51 మంది వున్నారు. ఈ అమరవీరులు అందించిన స్ఫూర్తితో వారి ఉజ్వలమైన వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని వారి ఆశయసాధనకు పునరంకితమవుదాం. శతృమూకలతో వీరోచితంగా పోరాడుతూ అమరత్వ శిఖరాలను అధిగమించిన అమరవీరులకు తలవంచి వినమ్రంగా జోహార్లు అర్పిద్దాం'' అంటూ అమరవీరులపైని తీర్మానం జోహార్లర్పించింది. ''ప్రపంచ సోషలిస్టు విప్లవంలో భాగంగా భారతదేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవ విజయానికై దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాలో అహర్నిశలూ కృషి చేస్తూ లక్ష్య సాధనలో అరెస్టు కాబడి చిత్రహింసలెన్నింటినో నిబ్బరంగా ఎదుర్కొని సడలని విప్లవదీక్షతో కమిటీ నాయకులు, పి.ఆర్.లు, యాక్టివిస్టులు, సానుభూతిపరులు, ప్రజలు జైలు జీవితం గడుపుతున్నారు... శత్రువు విధించిన యావజ్జీవ శిక్షను దృఢదీక్షతో సవాల్ చేస్తున్న కామ్రేడ్స్ బండి ప్రకాశ్, ప్రకాశ్‌లు, కామ్రేడ్స్ అప్పారావు, గణేశ్ మరియు రాష్ట్రంలోని వివిధ జైళ్లలో నిర్బంధించబడిన పార్టీ సభ్యులు, సానుభూతిపరులకు రాష్ట్ర మహాసభ విప్లవ జేజేలు తెలియజేస్తున్నది'' అంటూ నిర్బంధ శిబిరంలోని కామ్రేడ్స్‌కి జేజేలు పలుకుతూ మహాసభ తీర్మానించింది.

అప్పటివరకు కొనసాగిన రాష్ట్రకమిటీయే కాన్ఫరెన్స్‌కి స్టీరింగ్‌కమిటీగా వ్యవహరించేట్టు లాంఛనప్రాయమైన నిర్ణయం జరగడంతో స్టీరింగ్ కమిటీ సలహాతో అధ్యక్షవర్గం ముసాయిదా డాక్యుమెంట్లపై చర్చను ప్రారంభించింది.

పార్టీ ముసాయిదా కార్యక్రమంపై జరిగిన చర్చలో ప్రధానంగా రెండు విషయాలు చోటు చేసుకున్నాయి. నూతన ప్రజాస్వామ్యం-జనతా ప్రజాస్వామ్యం అనే రెండింటినీ మనం ఒకే అర్థంలో వాడుతున్నాం. దీనిపై శ్రేణుల్లో కొంత గందరగోళం వుంటోంది కనుక ఒక వివరమైన వ్యాసం ద్వారా దీన్ని అర్థం చేయించాలని కాన్ఫరెన్స్ తీర్మానించింది. ఇక రెండవ అంశం యుగ స్వభావానికి సంబంధించి. దీనిపై కేంద్రకమిటీలో మెజారిటీ, మైనారిటీలుగా రెండు అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అయితే ఈ రెండూ కూడా యుగాన్ని లెనినిస్టుయుగంగానే చెప్పడంలో ఏకాభిప్రాయంతోనే వుంటున్నా లెనినిస్టు యుగం అంటే 'సామ్రాజ్యవాద యుగం, కార్మికవర్గ విప్లవాలయుగం'గానే చెబితే చాలని మైనారిటీ అభిప్రాయపడగా 'సామ్రాజ్యవాదం అంతిమ పతనంవైపు ప్రపంచ సోషలిస్టు విప్లవం సంపూర్ణ విజయంవైపు ప్రయాణిస్తున్న యుగం'గా చెప్పాలనేది మెజారిటీ అభిప్రాయం. దీనిపై సి.సి. మైనారిటీ నుండి వచ్చిన నోట్ తగినంత విపులంగా లేదని భావిస్తూ కాన్ఫరెన్స్ సి.సి. మెజారిటీ అభిప్రాయాన్నే బలపరచింది. సస్పెన్షన్లు, డీమోషన్ల విషయంలో అన్ని ప్రాంతాల్లోనూ ఒకేరకమైన విధానం, వైఖరులు అమలుకావడం లేదని ఇది ఇబ్బందికరంగా వుంటుందనేది 'నిబంధనావళి'పైని చర్చలో ప్రధాన చర్చనీయాంశం కాగా కొత్తగా రాబోయే కేంద్ర, రాష్ట్రకమిటీలు దీన్ని దృష్టిలో పెట్టుకొని ఒకే విధానం అమలయ్యేట్లు చూడాలని కాన్ఫరెన్స్ తీర్మానించింది. దృఢమైన కార్మిక-రైతాంగ ఐక్యతను సాధించడం మన లక్ష్యం, మన విధానం-కాగా ఇలాంటి ఐక్యతను సాధించడంలో కొన్ని సందర్భాలలో మనం విజయవంతం కాలేక పోవడంతో కొన్ని కార్మిక సమ్మె పోరాటాలు నిర్వహణలో చేదు అనుభవాలు పొందుతున్నాం. వీటినుంచి సరైన పాఠాలు తీసుకుంటూ దృఢమైన కార్మిక రైతాంగ ఐక్యతను సాధించడానికి మనం అనుసరించాల్సిన పని పద్ధతులు, సూత్రబద్ధమైన వైఖరులని వివరిస్తూ ఆయా రంగాల్లోని మన శ్రేణుల్ని విద్యావంతం చేసే వ్యాసాలు మన పత్రికల్లో రావాలని 'వ్యూహం-ఎత్తుగడలు' ముసాయిదా డాక్యుమెంటు చర్చ సందర్భంగా కాన్ఫరెన్స్ భావించింది. అలానే 'సంఘటిత రంగం - అసంఘటిత రంగం' అనే వాటిపై స్పష్టత కల్పించాలని ఈ రంగాలలో మన పని ప్రాధాన్యతలను వివరిస్తూ ఎడ్యుకేట్ చేయాల్సి వుంటుందని కూడా ఈ డాక్యుమెంట్ చర్చ సందర్భంగా కాన్ఫరెన్స్ భావించింది. 'ప్రస్తుత రాజకీయ పరిస్థితి-మన కర్తవ్యాలు' అనే ముసాయిదా డాక్యుమెంటుని చర్చించే సందర్భంగా 'నూతన ప్రజాస్వామిక విప్లవదశ' 'ప్రధాన వైరుధ్యం' అనే రెండు అంశాలపై ప్రధానంగా డెలిగేట్స్ మాట్లాడారు.

# సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలు

విప్లవ జీవిత కాఠిన్యతను, విప్లవ భావుకతా సౌకుమార్యతను ప్రగాఢంగా ప్రతిబింబిస్తూ రాష్ట్ర మహాసభల సందర్భంగా సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలు యధాప్రకారంగా కొనసాగాయి. కమ్యూన్ నిర్వహణ కోసం వివిధ బృందాలు, కమిటీలు, టీమ్‌లు ఏర్పడినట్లే ఇటీవలి కాలంలో అమరులైన కా॥ బాలక్రిష్ణ, రామస్వామి, శ్రీధర్‌ల సాహిత్య వేదిక, పెదతూండ్ల మహిళా అమరులు కా॥ సునీత, సమ్మక్క, జానకి, స్వప్నల సాంస్కృతిక వేదిక కూడా ఏర్పడినాయి. ధూమపానానికి వ్యతిరేక కమిటీ కూడా మహాసభల మధ్యకాలంలో ఏర్పడింది. కవిత్వ రచనాపరంగా గెరిల్లాల విప్లవ భావుకతకు రూపమిచ్చేందుకుగాను కవిత్వ నిర్మాణరూపాలపై వర్క్‌షాప్ కూడా ఏర్పడింది. విప్లవాచరణ క్రమంలో ఈ మధ్య కాలంలోనే వెలుగులోకి వచ్చి ప్రాచుర్యం పొందిన 'గెరిల్లావాణి' గోడ పత్రిక కూడా మహాసభల కమ్యూన్‌లో ప్రత్యక్షమై తాజా రచనలతో కామ్రేడ్స్‌ను ఆకర్షించింది.

సం॥రం క్రితం కేంద్రకమిటీ సభ్యులు కా॥ శ్యాం, మురళీలతోపాటు, ఆంధ్ర రాష్ట్రకమిటీ కార్యదర్శి కా॥ మహేష్ సైతం దారుణ ద్రోహానికి గురై శత్రువు వలలో చిక్కి అమరుడవడం. వీరి అమరత్వ దినానే సరిగ్గా సం॥రం తర్వాత ప్రజా గెరిల్లా సైన్యం ఏర్పడటం. రాష్ట్ర మహాసభల సందర్భంగానే 2000 డిసెంబర్ 13న పి.జి.ఏ. అవతరణ కార్యక్రమాలు జరగడం. ఉద్యమ అవసరాల రీత్యా ఈస్ట్ రీజియన్ ఆంధ్ర రాష్ట్ర ఉద్యమం నుండి విడిపోయి ఆంధ్రా ఒరిస్సా సరిహద్దు స్పెషల్ గెరిల్లాజోన్‌గా ఏర్పడనుండటం వంటి నేపథ్యంలో రాష్ట్ర మహాసభలు జరిగాయి. సహజంగానే వీటి ప్రభావం కామ్రేడ్స్‌పై పడి అమరత్వం, పి.జి.ఏ.; ఈస్ట్ రీజియన్ వేరుపడటం వంటి అంశాలపై ప్రధానంగానూ, ఇతర అంశాలపై కూడా వివిధ ప్రక్రియలలో రచనలు చేశారు. వివిధ సాహిత్య ప్రక్రియలలో విశేషంగా కృషిచేసినవారు, ఇపుడిపుడే రచనలు సంకల్పించిన వారు పలు అంశాలపై రాసిన కవితలు, పాటలు, గల్పికలు, లఘు వ్యాసాలు మొ॥నవి మూడు రోజులకోసారి 'గెరిల్లావాణి' బాధ్యులు చక్కటి దస్తూరీలో రాసి, రాయించి, కమ్యూన్‌లో గోడపత్రిక బోర్డుకి అంటించేవారు. ఈ సందర్భంగా విప్లవ కవిత్వంలో వాడే అలంకారాలు, పదచిత్రాల ఔచిత్యం, తీరుతెన్నులపై వాదవివాదాల చర్చకు కూడా గెరిల్లావాణి వేదికయింది. సాధారణ సభ్యుల నుండి రాష్ట్రకమిటీ సభ్యుల వరకు తమ తమ రచనలతో గెరిల్లావాణికి తోడ్పడినారు. సాహిత్య ప్రక్రియలతో అంతో ఇంతో పరిచయమున్న వారే కాకుండా కొత్త కామ్రేడ్స్, పార్టీలోకి వచ్చాకే చదువు నేర్చుకున్న, నేర్చుకుంటున్న కామ్రేడ్స్ కూడా తీవ్రమైన పని ఒత్తిడిలో వుంటూనే మంచి వ్యక్తీకరణలతో కవితలు, పాటలు రాశారు. ఆ రచనలలో రాసి వాసి పరిమితులకంటే తరాలుగా సాహిత్య వ్యాసంగాలకు దూరమైన సామాజిక వారసత్వంలోంచి బయట పడటానికి కామ్రేడ్స్ చేసిన కృషి, తపన, ఉత్సాహాలే ప్రశంసనీయమైనవి.

ఈసారి సాహిత్య వేదిక రెండు పనులు చేపట్టింది. నూతనంగా రూపొందుతున్న రచయితలకు సాహిత్య ప్రక్రియలపై సాధారణ అవగాహన కల్పించటం. అట్లే కామ్రేడ్స్ ఎక్కువగా ఆసక్తి చూపుతున్న కవితా ప్రక్రియకి సంబంధించిన నిర్మాణ రీతులను వారు రాసిన కవితలనే విడిగా బేరీజు వేస్తూ అర్థం చేయించటం. దీంట్లో భాగంగా మూడు సాయంత్రాలు కవిత, కథ, పాటల రచనా ప్రక్రియ గురించి కొందరు కామ్రేడ్స్ మాట్లాడారు. కవిత ప్రారంభం, నడక, ముగింపులను సమన్వయించటంలో, కవితాశైలి-(పదజాలం, ఉపమానాలు, అలంకారాలు, పదచిత్రాలు వంటివి వాడటం)ని సమకూర్చు కోవటంలో ఎదురవుతున్న సమస్యలను, ప్రజల జీవితాలను పాటగా, కథగా మల్చడంలో ఉద్యమ రచయితల సమస్యలను, వాటిని అధిగమించాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా వివరించారు.

ఇక కమ్యూన్‌లో దైనందిన కార్యక్రమాలన్నీ ముగిశాక రాత్రి 10 నుండి 12 గంటల వరకు కవిత్వంలో నిర్మాణ రూపాలపై వర్క్‌షాప్ మహాసభల చివర్లో ఆసక్తికరంగా నడిచింది. సెంట్రీలకు పోయినవారు పోగా మిగిలిన ప్రొటెక్షన్ కామ్రేడ్స్‌లో కవితలు రాయటంపై ఆసక్తి కలిగిన, రాస్తున్న కామ్రేడ్స్ చూపిన శ్రద్ధనుబట్టి కవితలు రాసే రీతులపై ప్రాథమిక విషయాలను ఆచరణాత్మకంగా అర్థం చేయించడానికిగాను ఈ వర్క్‌షాప్‌కి క్యాంప్ నిర్వాహకులు రాత్రి 10 గంటల తర్వాతే అవకాశమివ్వటం జరిగింది. రచనారంగంలో ఓనమాలు నేర్చుకుంటున్నవారితో, ఈ మధ్యనే కవితలు రాయటం మొదలెట్టిన వారితో పరస్పర సంబంధంలోకి వెళ్ళి వారి రచనలనే వారిచే చదివిస్తూ, చదువుతూ కవితా మెలకువలను అర్థం చేయించటం, కవిత వస్తువును, శైలిని ఎన్నుకోవడంలో లోపాలను వారే కనుగొనే రీతిలో ఈ వర్క్‌షాప్ నడిచింది. రాత్రి క్యాంపు నిశ్శబ్దమయ్యే వేళ క్యాంప్‌కి భంగం కాకుండా మిలటరీ గ్రౌండ్‌లో నెగడుముందు చుట్టూ కూచుని ఎర్రని మంటల వెలుగులో చలి కాచుకుంటూ తమ కవితలను తామే చదువుతూ వర్క్‌షాప్ బాధ్యుడైన కామ్రేడ్ సాయంతో ఆయా కవితల గుణదోషాలను విశ్లేషించుకుంటూ తమకుతాముగా పరిశీలించుకుంటూ కామ్రేడ్స్ ఈ వర్క్‌షాప్‌లో అత్యంత ఆసక్తితో పాల్గొన్నారు. రోజంతా సెంట్రీలతో ఇతర పనుల ఒత్తిడితో వుంటూనే కవిత్వ రచనలలో మెలకువలను గ్రహించాలన్న తలంపుతో నిద్రను కూడా ఆపుకుని స్వచ్ఛందంగా వచ్చి కూర్చున్న కామ్రేడ్స్‌తో (10 నుంచి 15 మంది) వర్క్‌షాప్ అయిదు రాత్రులు నడిచింది. ఆయా కామ్రేడ్స్ తాము రాసిన కవితలకు ఎన్నుకున్న వస్తువు, ఆ వస్తువును మల్చిన పద్ధతి ఈ క్రమంలో వారెదుర్కొన్న సమస్యలు, వాటిలో దొర్లిన లోపాలు, కవితలోకి అనేక అంశాలను తీసుకు రావాలనే తాపత్రయంలో ప్రధానాంశాన్ని, కేంద్ర బిందువును వదిలేయటం, కవిత చివర్లో పేలవంగా ముగియటం, శ్రోతలకు చివర్లో గాఢమైన అనుభూతిని ఇవ్వలేక పోవటం, కవిత్వంలో పొడుగు పాదాలు వాడటంలో సమస్యలు, చిట్టిపొట్టి పాదాల అవసరం, తట్టిందల్లా కాగితంపై పెడుతూ మెలకువలను మర్చిపోవటం కవితా వస్తువుకు అలంకారాలతో పద చిత్రాలతో నగిషీలు చెక్కడంలో సమస్యలు వంటి పలు అంశాలను కామ్రేడ్స్

రాసిన కవితల్లోంచే ఎత్తిచూపుతూ రాసిన వారికే విమర్శనా దృష్టినందిస్తూ ఈ వర్క్‌షాప్ మంచి ప్రభావం కల్గించింది. తొలి రాత్రి హాజరైనవారు సెంట్రీ బాధ్యతలను సైతం పగటివేళకు మార్చుకుని చేసి మరీ వర్క్‌షాప్ నడిచినన్ని రోజులూ క్రమం తప్పకుండా హాజరై పాల్గొన్నారు.

సాంస్కృతిక కార్యక్రమాల కోసం ఏర్పడిన పెదతూండ్ల మహిళా అమరుల సాంస్కృతిక వేదిక రాష్ట్ర మహాసభల ప్రాధాన్యత కనుగుణంగా మంచి ప్రదర్శనలను రూపొందించింది. పోలీసుల పాశవికతకు విప్లవోద్యమం అడ్డుకట్ట వేయటం, దోపిడీకి గురవుతున్న చెంచుగూడేల జీవిత విధానం, పార్టీలో చోటు చేసుకున్న ఉదారవాదం, ఆర్థికవాదం వంటి చెడుధోరణులు మొదలైన పలు అంశాలపై సాంస్కృతిక వేదిక తరపున జె.యన్.యం. కామ్రేడ్స్ పాత్రల్లో జీవిస్తూ ప్రేక్షకులను రంజింపజేశారు. చెంచుగూడేల్లో పనిచేసిన లోకల్ గెరిల్లా దళసభ్యులు అచ్చం చెంచు దంపతులను అలాగే అనుకరిస్తూ నటించిన తీరు కాని, పార్టీలో చెడుధోరణులను పాములతో పోలుస్తూ, ఏ రకం పాము కరిస్తే ఏ స్థాయి ప్రమాదం వస్తుందో దళాల ఆచరణలోంచే మలచుకున్న సంభాషణలతో ప్రదర్శించిన తీరు కాని కార్మికుల్లోని ఆర్థికవాద ధోరణులను గురించి 'మా కంపెనీకి జీతాలు పెరిగినయ్' సంవాద పాటకు కా॥ ఉమ, ధర్మన్న చేసిన సహజనృత్య రూపకం కాని, స్థాయీ భేదాలు లేకుండా వీక్షకులను అలరింపజేశాయి. ప్రజా గెరిల్లా సైన్యం కవాతు, కా॥ శ్యామ్ అమరత్వంపై రాసిన 'తల్లి వలపోత' పాటకు చేసిన దృశ్యీకరణ మొత్తం మహాసభలకే ప్రత్యేక ఆకర్షణగా మారి ఉత్తేజ, విషాద, ఆగ్రహ ప్రకంపనలతో కమ్యూన్‌ని ముంచెత్తాయి. ముఖ్యంగా మహాసభలు ముగిసిన తర్వాత చివరి రోజున ప్రజా గెరిల్లా సైన్యంలో జనం ఒకరొకరుగా చేరుతూ ముక్త కంఠంతో మార్చింగ్ సాంగ్ పాడుతూ కదం తొక్కుతూ, గెరిల్లాజోన్ల, స్థావర ప్రాంతాల నినాదాలిస్తూ జన సముద్రంగా రూపొందిన దృశ్యాన్ని అద్భుతంగా రూపొందించారు. చిన్న వీధి నాటికలా మొదలైన ఈ సన్నివేశం చివరలో వాస్తవ రూపంగా మారి చూస్తున్న ప్రేక్షక కామ్రేడ్స్ కేంద్రకమిటీ సభ్యులతో సహా స్వచ్ఛందంగా జన ప్రవాహంలో కలసి కదం తొక్కుతూ ముందుకు పోవడంగా రూపొంది మొత్తం కమ్యూన్‌ని ఉత్తేజపర్చింది. యధావిధిగా జె.యన్.యం. పాత, కొత్త పాటలతో కొయ్యూరు అమరుల కమ్యూన్ ప్రతిరోజు ప్రతిధ్వనించేది.


ఓ సందర్భంలో కర్నాటక పార్టీ కార్యదర్శి కా॥ సురేష్ స్త్రీ పురుష సంబంధాలపై కర్నాటక జానపద గీతాన్ని పాడాడు. తమిళనాడు రాష్ట్రకమిటీ సభ్యుడు కా॥ రఘు తమిళనాడు ప్రజల సమస్యపై పాట పాడాడు.

మిలటరీ గ్రౌండ్ ఓ మూల నుండి నిశ్శబ్దాన్ని పారద్రోలుతూ మోగిన మిలటరీ బాండ్, విషాదాన్ని గాంభీర్యతను మోసుకుంటూ సైనిక సంగీతం... దాని వెనుకే సమాంతరంగా అడుగులో అడుగు వేసుకుంటూ ఇద్దరు పి.జి.ఏ. గార్డులు... వారి వెనుక ఎర్రబట్టతో కప్పిన శవాన్ని మోసుకొస్తున్న సైనికులు. మౌన గంభీర ముద్రతో శిలా ప్రతిమలా మిలటరీగ్రౌండ్, ఆ అనంత నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ కా॥ ధర్మన్న గొంతులోంచి ఓ విషాద రాగం. కిందికి దింపిన శవంపై పడి రోదిస్తున్న తల్లి. దశాబ్దాల క్రితమే దూరమైపోయిన కొడుకు జ్ఞాపకాలను వలబోసుకుంటూ గుండె లోతుల్లోంచి పాట రూపంలో దూసుకొచ్చిన కన్నతల్లి మమకారం...రాజ్యం తెస్తానంటూ వూరొదిలి పోయిన బిడ్డ ఎర్రజెండాలతో, తూట్లు పడిన దేహంతో ఇంటికొస్తే, ఇసుకేస్తే రాలని జనం కొడుకును గూర్చి వలబోస్తుంటే, దూరమైన కొడుకు గుణం ఇవరంగా తెలుసుకున్న తల్లి తనకు తెలియని కీర్తిని తనకు తెచ్చి పెట్టినందుకు మల్లంటూ జన్మంటే విన్నొగంటరో.... అంటూ రోదిస్తూ నేలకొరిగిన కొడుకును పట్టి ఊపేస్తుంటే....మిలటరీ గ్రౌండ్ శిలాకృతి దాల్చింది. దృశ్యాల పరంపరను చూస్తున్న కామ్రేడ్స్ హృదయాల్లో అంతులేని అలజడి, ఆక్రోశం, ఆగ్రహం.... ఈబాధకు, ఈ వేదనకు, ఈ మౌన రోదనకు పదాలు చాలవు. వ్యక్తీకరణ సాధ్యం కాదు. హృదయాలను కదిలించటం అనేది ఈ సందర్భంలో చాలా చిన్నమాటే. మహా శోకం సముద్ర గంభీరాకృతి దాల్చి కమ్యూన్ మొత్తం నిరుత్తరురాలై, మూగగా అశ్రుతర్పణ చేస్తోంది. హృదయాలు బరువెక్కడం, మనసు రోదించటం పరమ వాస్తవికతా రూపం ధరించిన వేళ... కన్నతల్లి ఒక్కోమాట ఒక్కో పాటై, పలుకై హృదయతంత్రుల్ని పెకిలిస్తున్నవేళ.... క్యాంప్ రోదిస్తోంది. దళసభ్యులు, శాక్‌లు, జిల్లాకమిటీలు, రీజినల్ కమిటీలు, రాష్ట్రకమిటీ సభ్యులు, సౌహార్ద ప్రతినిధులు, కేంద్రకమిటీ సభ్యులు మూగ వేదనతో తలలు వాల్చేశారు. ఒక్కొక్క హృదయంలో ఒక్కో రకం అలజడి, ఆవేదన, అనుకంపన. ఆ అమరుడి జ్ఞాపకాల చిత్తడిలో తడుస్తున్న కమ్యూన్. అక్కడ అశ్రుతర్పణలు లేవు. బతుకులోనూ, చావులోనూ వర్గ బంధంతో పెనవేసుకుపోయిన హృదయాలు మౌన నీరాజనాలు అర్పిస్తున్నాయి. కేంద్రకమిటీ సభ్యుడు కా॥ శ్యామ్ కన్నతల్లి వలపోతను అద్భుతంగా అక్షరీకరించిన, దృశ్యీకరించిన విప్లవ కళా సంస్కృతి ఆ వేళ సార్థకమైంది. ఆ కన్నీళ్ళకే శక్తివుంటే, ఆ మూగ వేదనలకే రూపముంటే.... ఓ మూల నుంచి నిశ్శబ్దం బద్దలైంది. అమరులకు జోహార్లు, విషాదాగ్రహావేశాలతో నినాదాలు, పాటలు, కవాతులు, ధూలలు, నృత్యాలు అఖండ సామూహిక గీతమై ప్రజాగెరిల్లా సైన్యం కవాతులో భాగమైనాయి. అది కష్టాల, కన్నీళ్ళ, నెత్తుటి త్యాగాల వలపోత. మహాసభలకు విప్లవ కళ సమర్పించిన నిరుపమాన కల(ళ)బోత.

మన దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవానికి నాయకత్వం వహించే కార్మికవర్గ రాజకీయ పార్టీ అయిన కమ్యూనిస్టు పార్టీ 1925లో ఆవిర్భవించింది. కనుక అప్పటినుంచే ఈ విప్లవ దశ ప్రారంభమైనదిగా భావించాలని ముసాయిదా డాక్యుమెంటు ప్రతిపాదించగా- కార్మికోద్యమ వెల్లువని నూతన ప్రజాస్వామ్య విప్లవదశ ప్రారంభానికి సూచికగా భావిస్తూ చైనా కమ్యూనిస్టు పార్టీ మే 4వ తేదీన కార్మికోద్యమ వెల్లువ కాలాన్ని ఈ విప్లవ ప్రారంభ కాలంగా తీసుకున్నట్లుగానే మనం కూడా మనదేశంలో కార్మికోద్యమ వెల్లువ ప్రారంభమైన 1914ని ఈ విప్లవదశ ప్రారంభ సమయంగా తీసుకోవాలని కొంత చర్చ జరిగి దీనిపై తుది నిర్ణయం కాంగ్రెస్‌కే విడచిపెట్టడం జరిగింది. ఇక రెండో అంశం-ప్రధాన వైరుధ్యం అనేది

(తరువాయి 24వ పేజీలో...)

# సి.పి.ఐ. (యం-యల్) [పీపుల్స్‌వార్]






# ఆంధ్రప్రదేశ్ 15వ మహాసభల దృశ్యాలు





(21వ పేజీ తరువాయి)

వుంటుందా? వుండదా? అనేది. వైరుధ్యాలంటూ వున్న తరువాత వాటిలో ఒకటి కాకపోతే వేరొకటి ప్రధాన వైరుధ్య స్థానంలోను ఆ స్వభావంతోనూ వుంటుండటమనేది గతితార్కిక నియమంగానే వుంటుందని అభిప్రాయపడిన రాష్ట్ర కాన్ఫరెన్స్ ప్రధాన వైరుధ్యం అంటూ ఏదీ వుండి తీరాల్సిన అవసరం లేదంటూ గత కేంద్ర కాన్ఫరెన్స్ అభిప్రాయపడటాన్ని, పైగా దానిపై గడచిన కాలమంతటా కేంద్రకమిటీ ఎలాంటి ఎడ్యుకేషన్ అందివ్వక పోవటాన్ని తప్పుపట్టింది. దీనిపై కాన్ఫరెన్స్‌లో హాజరై వుండిన కేంద్రకమిటీ సభ్యుడు తగిన స్వయంవిమర్శతో స్పందిస్తూ వివరణ ఇవ్వగా అక్కడితో దానిపై చర్చ ముగిసింది. కాని కాన్ఫరెన్స్ విమర్శని కాంగ్రెస్‌కి తీర్మానంగా పంపాలని మెజారిటీ కోరడంతో ఆ మేరకు తీర్మానించడమైంది.

'కేంద్ర రాజకీయ నిర్మాణ సమీక్ష' ముసాయిదా డాక్యుమెంటుపై సవివరమైన చర్చ జరిగింది. ముసాయిదా డాక్యుమెంట్‌లో చెప్పబడినదానికి భిన్నంగా ''ప్రజాగెరిల్లా సైన్యం (పి.జి.ఏ.) 1985 నాటికే నిర్మించాల్సి వుండె'' అని ఈ కాన్ఫరెన్స్ తీర్మానించింది. 'ఆర్థికవాదం అనేది మన ఉద్యమంలో వుంది కాని పార్టీలో లేదు' అనే ముసాయిదా వాదనని తిరస్కరిస్తూ ''మన ఉద్యమంలోనే కాదు, పార్టీలోనూ ఆర్థికవాదం వుంది'' అంటూ కాన్ఫరెన్స్ ఇంకో తీర్మానం చేసింది. మహిళా కామ్రేడ్స్ ప్రమోషన్ విషయంలో మన కేంద్రకమిటీ అనుసరించే విధానం అవసరానికి మించే కఠిన నిబంధనలతో వుంటున్నదని; నేపాల్, పెరూ, ఫిలిప్పైన్స్ తదితర సోదర పార్టీలతో అనుసరిస్తుండే తీరులో ఈ విషయమై మన విధానం మెరుగుపడాల్సి వుంటుందనే చర్చ వచ్చింది. అలానే పార్టీ ఆధ్వర్యంలో సాగే 'దిద్దబాటు'' ఉద్యమంలో స్త్రీ-పురుష సంబంధాలని చేర్చాలనే ప్రతిపాదన సైతం వచ్చింది. ఈ సందర్భంగా ''పార్టీలో స్త్రీ-పురుష సంబంధాల విషయంలో కొనసాగుతున్న అశాస్త్రీయమైన భావజాలాన్ని వదిలించుకోడానికి ఎడ్యుకేషన్, రెక్టిఫికేషన్ కేంపెయిన్ తీసుకోవాలి'' అని కాన్ఫరెన్స్ తీర్మానించింది. 'మావో ఆలోచనా విధానం'కి బదులు 'మావోయిజం' అని అనడం ఎక్కువ అర్థవంతంగానూ శాస్త్రీయంగానూ వుంటుందనే కేంద్ర ప్రతిపాదనను కాన్ఫరెన్సు ఆమోదించింది. 'జనశక్తి' పార్టీని రివిజనిస్టు పార్టీగా పరిగణించాలనే కేంద్రకమిటీ ప్రతిపాదనను కూడా కాన్ఫరెన్స్ ఆమోదించింది. పోతే అఖిల భారత విద్యార్థి ఉద్యమం, సాంస్కృతిక రంగం, మహిళా రంగం, పట్టణోద్యమం అనే కీలకాంశాలు ముసాయిదాలో తగిన విధంగా సమీక్షించబడలేదని కనుక వీటిని సైతం సమీక్షిస్తూ డాక్యుమెంటు పరిపుష్టం కావాల్సి వుంటుందని హాల్ సూచించింది. ఇక 'గెరిల్లాజోన్ పర్స్పెక్టివ్' ముసాయిదా డాక్యుమెంట్‌ని చర్చించిన హాల్, పర్స్పెక్టివ్‌గా దీన్ని స్వీకరించడమంటే గెరిల్లాజోన్‌కి వ్యూహాత్మక ప్రాధాన్యత నివ్వడమే అవుతుందని; అది సరికాదని అవసరం లేదని భావిస్తూ; దాన్ని 'విముక్తి ప్రాంతాల పర్స్పెక్టివ్'గా మార్చాలని ప్రతిపాదిస్తూ తీర్మానించింది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయ నిర్మాణ సమీక్ష (ఏ.పి.పి.ఓ.ఆర్.)పై కూడా మంచి చర్చే జరిగింది. ఈ ముసాయిదాని ముందస్తుగానే క్రింది కాన్ఫరెన్స్‌లకి అందివ్వడంలో రాష్ట్రకమిటీ వైఫల్యాన్ని కమిటీ కార్యదర్శి స్వయంవిమర్శనాత్మకంగా చెప్పుకుంటూ డాక్యుమెంటుని పరిచయం చేశాడు. ముందు పర్స్పెక్టివ్స్ మీద వాడిగా వేడిగా చర్చ జరిగింది. వీటిని డ్రైవ్ చేయడంలో రాష్ట్ర, కేంద్రకమిటీల వైఫల్యాల్ని డెలిగేట్ కామ్రేడ్స్ తీవ్రంగానే ఎత్తిచూపారు. దీనిపై కేంద్రకమిటీ సభ్యుడు మాట్లాడుతూ ఇందులో ప్రధాన లోపం కేంద్రకమిటీదేనని తరువాత రాష్ట్రకమిటీదని చెప్పారు. దానిపై కొన్ని సవరణలతో సౌత్, నల్లమల, ఏ.ఓ.బి. పర్స్పెక్టివ్‌లను హాలు ఏకగ్రీవంగా ఆమోదించింది. ఆ తరువాత ఈస్ట్ ఏ.పి. నుండి విడిపోయే తీర్మానాన్ని కేంద్రకమిటీ సభ్యుడు ప్రతిపాదించగా హాలు ఏకగ్రీవంగా ఆమోదించింది. ''ఏ.ఓ.బి.ని విముక్తి ప్రాంతంగా నిర్మిద్దాం'' అనే నినాదంతో హాలు మారుమ్రోగింది. రాయలసీమ పర్స్పెక్టివ్‌ను చివరి నిముషంలో తయారు చేయాల్సి రావడం వలన దాన్ని ఫైనల్ చేసే బాధ్యతను కొత్త రాష్ట్రకమిటీకి అప్పజెబుతూ హాల్ తీర్మానించింది. రాష్ట్రకమిటీ ఫంక్షనింగ్‌లో వ్యక్తమవుతుండే పెత్తందారీ పోకడలు వ్యక్తిగత పనితీరులు సైతం తీవ్ర విమర్శకు గురికావడం వాటిని సవరించుకోగలమని రాష్ట్రకమిటీ హామీపడటం జరిగింది. కొన్ని నిర్దిష్టమైన ఆరోపణలతో ఈస్ట్ రీజియన్ కార్యదర్శి కా॥ వినోద్‌పై ఆ రీజియన్ కాన్ఫరెన్స్ ప్రతిపాదించిన క్రమశిక్షణాచర్యను ఆమోదించిన రాష్ట్రకమిటీ కాన్ఫరెన్స్‌లో దాన్నే ప్రతిపాదించగా హాలు ఏకగ్రీవంగానే దాన్ని ఆమోదించింది. రాష్ట్రస్థాయి కాన్ఫరెన్సులు, ప్లీనాలలో అలానే కేంద్రస్థాయి ప్లీనాలు కాంగ్రెస్‌లలో దళితులకు డెలిగేషన్‌లో 10 శాతం ప్రాతినిధ్యం కల్పించాలని హాలు కాంగ్రెస్‌కు ప్రతిపాదన పంపుతూ తీర్మానించింది. ఈ మహాసభల నాటికుండే పార్టీ సభ్యత్వ వివరాలతో కూడిన నివేదికను రాష్ట్రకమిటీ హాలుముందుంచగా హాలు దాన్ని ఆమోదిస్తూ తీర్మానించింది. 1999 జనవరి నుండి 2000 డిసెంబర్ వరకు బడ్జెట్‌ని ఆమోదిస్తూ ''ప్రజలపై ఆధారపడి ఆర్థిక వనరులను పెంపొందించుకుందాం'', ''ఆర్థిక విషయాలలో కొనసాగుతున్న దుబారాను వదిలించుకుందాం'' అని హాల్ తీర్మానించింది.

తరువాత నూతన రాష్ట్రకమిటీ ఎన్నిక అంశాన్ని హాల్ చేపట్టింది. కేంద్రకమిటీ సభ్యుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రకమిటీని ఒక ప్యానల్‌గా ప్రతిపాదిస్తూ సభ్యుల్ని హాల్‌కి పరిచయం చేయగా హాల్ ప్యానల్‌ని ఏకగ్రీవంగా ఆమోదించింది. ఆంధ్ర రాష్ట్రకమిటీ నుండి ఈస్ట్ రీజియన్ విడిపోయే ప్రతిపాదనను అప్పటికే హాలు ఆమోదించి వున్నందున ఎన్నికైన ఈ కమిటీయే 'ఆంధ్ర రాష్ట్రకమిటీ (ఏ.పి.యస్.సి.)'గాను, ఆంధ్ర ఒరిస్సా బోర్డర్ స్పెషల్ జోనల్ కమిటీ (ఏ.ఓ.బి.యస్.జెడ్.సి.)గాను విడిపోతూ లాంఛనప్రాయంగా హాల్‌లోనే ప్రకించబడ్డాయి. ఏ.పి.ఎస్.సి.కి కా॥ శ్రీనివాస్, ఏ.ఓ.బి.యస్.జెడ్.సి.కి కా॥ బి.కె. కార్యదర్శులుగా ఆయా కమిటీలకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పరిశీలకులుగా హాజరైన ముగ్గురు కామ్రేడ్స్ తరఫున మాట్లాడిన కా॥ శ్రీకాంత్ హాల్‌లో రాజకీయాంశాలపై జరగాల్సినంతగా చర్చ జరగలేదని; సిద్ధాంత అధ్యయనం విషయంలో కూడా కామ్రేడ్స్ వెనకబడివుంటున్న తీరు కొంత వ్యక్తమైందని; అయినా ఎప్పటిలాగానే ఆచరణ విషయంలో ఆంధ్ర కామ్రేడ్స్ ఆదర్శప్రాయంగా ముందే వుంటున్నారని వారి నుంచి తాము సైతం నేర్చుకోగలిగేలా వుందని తన హర్షాభినందనల్ని వ్యక్తపరిచాడు. తరువాత కేంద్రకమిటీ సభ్యుడు

ఇచ్చిన ముగింపు ఉపన్యాసంలో మొత్తం కాన్ఫరెన్స్ వర్గపొందికలో మధ్యతరగతి, పెటీబూర్జువా ప్రాతినిధ్యం హెచ్చుగా వుందని, ఇది తగ్గి పునాదివర్గాల ప్రాతినిధ్యం పెరిగేలా కృషి జరగాలని సూచించారు. అలానే గత కాన్ఫరెన్స్‌కి హాజరైన వారిలో కేవలం 10 మందే ఈ కాన్ఫరెన్స్‌కి హాజరవడమనేది నాయకత్వ కొనసాగింపు సమస్యపై దృష్టిపెట్టాల్సిన అవసరాన్ని చాటేదిగా అర్థం చేసుకోవాలని చెప్పారు. చివరగా ప్రతినిధులందరితో హాల్‌లోనే ఏ.పి.ఎస్.సి. కార్యదర్శి ప్రతిజ్ఞ చేయించారు.

మర్నాడు అందరిలో జరిగిన ముగింపు కార్యక్రమంలో ఏ.పి.ఎస్.సి., ఏ.ఓ.బి.ఎస్.జెడ్.సి. కమిటీ సభ్యులతో కేంద్రకమిటీ సభ్యుడు ప్రతిజ్ఞ చేయించారు. ముఖ్యమైన తీర్మానాల్ని కాన్ఫరెన్స్ స్ఫూర్తినీ ఏ.పి.ఎస్.సి. కార్యదర్శి కామ్రేడ్స్‌కి వివరించారు. ఈ 15వ మహాసభ 17 తక్షణ కర్తవ్యాలను రూపొందించుకుందని, ఆ కర్తవ్యాల సాధనకు 6 నినాదాలను చేపట్టిందని వివరించారు. తరువాత జరిగిన జె.యన్.యం. కార్యక్రమాలలో సి.సి.ఎం. నుండి మిలిటెంట్ల వరకూ అందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు. పార్టీజెండాను కా॥ శ్రీనివాస్, పి.జి.ఏ. జెండాను కా॥ బి.కె. అవనతం చేయడంతో కాన్ఫరెన్స్ విజయవంతంగా ముగిసింది.

### నినాదాలు

1. డి.కె., ఏ.ఓ.బి.లను విముక్తి ప్రాంతాలను చేసే లక్ష్యంలో గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం చేద్దాం!

   ఉత్తర దక్షిణ తెలంగాణా గెరిల్లాజోన్స్‌లో విప్లవ యుద్ధాన్ని తీవ్రతరం చేద్దాం!

   నల్లమల రీజియన్, రాయలసీమ డివిజన్‌లను గెరిల్లాజోన్లుగా అభివృద్ధి చేద్దాం!

2. పార్టీని శక్తివంతం చేద్దాం - నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేద్దాం!
3. పి.జి.ఏ.ను నిర్మిద్దాం! ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం చేద్దాం!
4. అధ్యయనాన్ని పెంచుకుందాం - స్వీయాత్మకతను వదిలించుకుందాం!
5. గ్రామరాజ్య కమిటీలను నిర్మిద్దాం! గ్రామస్థాయి నుండి ప్రజల రాజ్యాధికారాన్ని నెలకొల్పుదాం!
6. బలమైన ఐక్య సంఘటనను నిర్మిద్దాం! ప్రజా పోరాటాలు తీవ్రతరం చేద్దాం! ❑

## నేపాల్‌లో మావోయిస్టు గెరిల్లాల పెనుదాడి

### భారీ ఎత్తున ఆయుధాల స్వాధీనం

ఈ సం॥రం ఏప్రిల్ 6న నేపాల్ దేశాన్ని మొత్తంగా స్తంభింపజేసిన సార్వత్రిక సమ్మెతో జత కలుపుతూ మావోయిస్టులు కొయిరాలా ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారీ సైనిక దాడిని ప్రారంభించారు. నేపాల్ రాజరికం పరాజయం పాలై ఏప్రిల్ నాటికి సరిగ్గా 11 సం॥రాలు అయింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని జరిగిన సార్వత్రిక సమ్మెతో పాటు మావోయిస్టులు బాంబుదాడులతో రెయిడ్‌లు, ఆంబుష్‌లతో ఈ ప్రత్యేక దినాన్ని జరుపుకున్నారు.

ఏప్రిల్ 2న దాదాపు 300 మంది మావోయిస్టు గెరిల్లాలు పశ్చిమ నేపాల్‌కి చెందిన రుఖుంకోట్ జిల్లాలో ఒక పోలీస్ పోస్ట్‌పై దాడి చేసి 35 మంది పోలీసులను హతమార్చారు. 14 మంది పోలీసులను గాయపర్చి, మరో 23 మందిని బందీలుగా పట్టుకెళ్ళారు. భారీ ఎత్తున ఆయుధాలు, మందుగుండు సామగ్రి చేజిక్కించుకున్నారు. అదే రోజున తూర్పు నేపాల్‌లోని ధోల్ఖా జిల్లాలోని పోలీస్ పోస్ట్‌పై జరిగిన మరొక దాడిలో ఐదుమంది పోలీసులు హతమయ్యారు. దేశ రాజధాని ఖాట్మండులో నేపాల్ కాంగ్రెస్ ఎం.పి. అయిన లేఖ్‌నాథ్ న్యుపాన్ మరియు పేరుమోసిన క్రూర మాజీ పోలీసు ఇన్స్‌పెక్టర్ జనరల్ అచ్యుత్ ఖారెల్‌ల ఇళ్ళ ముందు మావోయిస్టులు బాంబులు పేల్చారు.

ఆ మరుసటి దినమే 600 మంది గెరిల్లాలు, మిలీషియా పశ్చిమ రీజియన్‌లోని పాల్పో జిల్లాలోని పోలీస్ చెక్ పోస్ట్‌పై దాడి చేశారు. ఈ దాడిలో ఇద్దరు పోలీసు అధికార్లు హతమవగా, మరో పదిమంది గాయపడ్డారు. వీరిలో ఒకరికి తీవ్రగాయాలైనాయి.

ఏప్రిల్ 7న సార్వత్రిక సమ్మె నేపథ్యంలో 300 మంది మావోయిస్టులు పశ్చిమ నేపాల్‌లో దయ్‌లేఖ్ జిల్లాలోని నాన్యులె గ్రామంలోని పోలీస్ చెక్‌పోస్ట్‌పై దాడిచేశారు. పోలీస్ పోస్ట్‌పై జరిగిన బాంబుదాడిలో 29 మంది పోలీసులు హతమవగా 12 మంది పోలీసులు గాయపడ్డారు. మరో 28 మంది పోలీసులు భవన శిథిలాల క్రింద చిక్కుకుపోయారు. చాలామంది తీవ్రంగా గాయపడినారు. వీరిని తర్వాత హెలికాప్టర్‌లో తరలించారు. అదేరోజు ఒక మంత్రి ఇంటిపై కూడా బాంబుదాడి జరిగింది.

ఏప్రిల్ నెల తొలి వారంలో 71 మంది పోలీసులు చంపబడ్డారు. పశ్చిమ రీజియన్‌లోని మూడు ప్రధానమైన పోలీస్ పోస్టులు ధ్వంసమైపోయాయి. వీటన్నింటి పరాకాష్టగా **పశ్చిమ నేపాల్‌లోని ఒక జైలులో సొరంగం తవ్వటం ద్వారా ఆరుగురు మహిళా కామ్రేడ్స్ సాహసోపేతంగా జైలునుండి తప్పించుకున్నారు.**

పెరుగుతున్న మావోయిస్టుల దాడిని ఎదుర్కొనేందు కోసం, భారత పారా మిలటరీని పోలిన సాయుధ పోలీస్ బలగం (ఏ.ఆర్.యఫ్.) పేరుతో 15,000 మందితో కూడిన శక్తివంతమైన నూతన పోలీస్ టాస్క్‌ఫోర్స్‌ని ఏర్పర్చేందుకు నేపాల్ ప్రభుత్వం ఓ పథకాన్ని ప్రకటించింది. ఈ నూతన బలగానికి ఆయుధాల కోసం, గెరిల్లా వ్యతిరేక యుద్ధతంత్రంలో వారికి శిక్షణనిచ్చేందుకు ప్రభుత్వం 200 కోట్ల రూ॥లను వెచ్చిస్తుంది. నిస్సందేహంగా ఇదంతా భారత ప్రభుత్వ తోడ్పాటుతోనే జరుగుతోంది. అయితే ఈ ప్రయత్నం సైతం విఫలమయ్యే తీరుతుంది. శత్రు బలగాలు మరింతగా తమ ఆయుధశక్తిని పెంచుకోవడమంటే అది ఖచ్చితంగా మావోయిస్టుల ఆయుధ సమీకరణకు పెద్ద వనరు మాత్రమే. ❑

# మాఫియా నేరాల అణచివేత సాకుతో ప్రజల ప్రాథమిక హక్కులను హరించివేసేలా పోలీసు దొరలకు విస్తృత అధికారాలను కట్టబెడుతున్న నల్లచట్టమే 'వ్యవస్థీకృత నేరాల అదుపు చట్టం'!

మార్చి నెల 29 అర్ధరాత్రి తెలుగుదేశం ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ వ్యవస్థీకృత నేరాల నిరోధక చట్టం (ఏ.పి. సి.ఒ.సి.ఏ. : ఏ.పి. కంట్రోల్ ఆఫ్ ఆర్గనైజ్డ్ క్రైమ్స్ యాక్ట్) ని అమలులోకి తెచ్చింది. గత 8 నెలలుగా ప్రజల్లోని వివిధ విభాగాలూ, ప్రతిపక్షాలూ, నిరసన తెలుపుతున్నా లెక్కచేయని ప్రభుత్వం ప్రతిపక్షాల తీవ్ర నిరసనల మధ్య, వాకౌట్ల మధ్య హడావుడిగా ఈ బిల్లును ప్రవేశపెట్టి మందిబలంతో ఆమోదింపజేసుకుంది. మాఫియా గ్యాంగులతో వ్యవహరించటమే ఈ బిల్లు లక్ష్యంగా సమర్థించుకుంటూ వచ్చిన ప్రభుత్వం బూర్జువా ప్రమాణాలను సైతం పక్కనబెట్టి కనీస పాటి చర్చకు కూడా అవకాశం ఇవ్వకుండా దొంగచాటుగా ఈ బిల్లును రాష్ట్రం మీదికి వదిలింది. ''ఆర్గనైజ్డ్ గూండాలు''గా ఎన్నడో ముద్రపడి పోయిన పోలీస్ యంత్రాంగానికే వ్యవస్థీకృత నేరాల నిరోధక అధికారాన్ని కట్టబెట్టడం పరమ హాస్యాస్పద అంశం కాగా ప్రతిపక్షాలే మూకుమ్మడిగా ఈ చట్టంపట్ల భయాందోళనలు ప్రకటించాయి. అంటే పిచ్చివాడి చేతిలో రాయిలాగా ఈ చట్టం రాష్ట్ర ప్రజానీకంపై విరుచుకుపడనుంది. చరిత్రలో ప్రతి నల్లచట్టం కూడా ప్రజా వుద్యమాలను, నిరసన తెలిపే గళాలను మాత్రమే లక్ష్యంగా చేసుకుంది. ఈ నూతన నల్లచట్టం సారాంశం కూడా ఇదే...

## 'టాడా'ల 'పోటా'ల సారం...?

అణచివేత చట్టాలన్నీ ఏదో ఒక బూచిని చూపి చట్టసభలో ఆమోదం పొంది అమలులోకి వచ్చిన తర్వాత ఆచరణలో పౌర ప్రజాస్వామిక హక్కులనే కాలరాచి వేస్తూ వచ్చాయి. వీటిని సామాన్య ప్రజలపైనే ఎల్లప్పుడూ ప్రయోగిస్తూ వచ్చారు. 1985లో టాడా చట్టాన్ని తీసుకువచ్చినపుడు ఈ చట్టం కేవలం పంజాబ్‌లోని టెర్రరిస్టులను అణచివేయటానికే పరిమితమని భాష్యాలు పలికారు. కాని వాస్తవంలో దేశ వ్యాప్తంగా వేలాదిమంది కార్మికులను, రైతులను, ఆదివాసులను, మైనారిటీలను, ఉద్యమకారులను ఈ చట్టం కింద నిర్బంధించి ఏడాదిపైగా బెయిల్ లేకుండా జైలుపాలు చేశారు. ఈ చట్టం ఆధారంగా పోలీసుల అధికార దుర్వినియోగానికి హద్దుల్లేకుండా పోయింది. ఇది ఏ స్థాయికి పోయిందంటే పౌర హక్కుల సంఘాలు మాత్రమే కాకుండా, దేశ వ్యాప్తంగా ఎందరో మేధావులు, ప్రజాస్వామిక వాదులతోపాటు టి.డి.పి.తో సహా పలు రాజకీయ పార్టీలు సైతం ఈ క్రూర చట్టాన్ని ఉపసంహరించుకోవాలంటూ డిమాండు చేస్తూ తీవ్రంగా నిరసించాయి. దీని ఫలితంగా 1995లో టాడాను కేంద్ర ప్రభుత్వమే వెనక్కు తీసుకోవాల్సి వచ్చింది. టెర్రరిజం 'బూచి'తో అమలులోకి వచ్చిన టాడాని ఆనాడు పార్లమెంట్‌లోనూ, ఇంటా బయటా కూడా వ్యతిరేకించిన తెలుగుదేశం పార్టీకే ఈరోజు మరో బూచి అవసరమైంది. అదే మాఫియా 'బూచి'. దూకుడుగా అమలుచేస్తూ వస్తున్న ఆర్థిక సంస్కరణలను గత సం॥ర కాలంగా ఆంధ్రప్రదేశ్‌లో సకల వర్గాల ప్రజలూ దుమ్మెత్తి పోస్తూ వచ్చిన నేపథ్యమే ఇప్పుడీ నూతన నల్లచట్టానికి ప్రాతిపదిక అయింది.

హైద్రాబాద్ నగరంలో బొంబాయి తరహా మాఫియా గ్రూపులు తలెత్తుతున్నాయని, రాయలసీమలో ఫ్యాక్షనిజం వెర్రితలలేస్తోందని రాష్ట్రమంతటా భూ ఆక్రమణ మాఫియాలకు పట్టపగ్గాలు లేకుండా పోయాయని, కిరాయి హంతకులు, కాంట్రాక్టు హంతకులూ కూడా రంగంలో వున్నారని ప్రభుత్వం ఆరోపించింది. వ్యవస్థీకృత శక్తులుగా వీరంతా సాధారణ చట్ట ప్రక్రియను నిర్వీర్యపర్చి ఎన్‌ఫోర్స్‌మెంట్ యంత్రాంగాన్ని లొంగదీసుకున్నారని, సాక్షులపై హింస ప్రయోగించి నోరుమూయిస్తున్నారని వీరిని అదుపు చేయాలంటే విస్తృతాధికారాలు కలిగిన ప్రత్యేక చట్టం అవసరమని ప్రభుత్వం ప్రకటించింది. సమాజం మారుతూ కొత్త కొత్త నేరాలు చోటు చేసుకుంటున్నాయని ఆ నేరాలు మాఫియా పద్ధతిలో వ్యవస్థీకృత రూపంలో జరుగుతున్నాయని వాటి అదుపుకు ఇప్పుడున్న చట్టాలు సరిపోనందువల్ల కొత్త చట్టం అవసరమని ప్రభుత్వం సమర్థించుకుంది.

## ఏ.పి. నూతన 'నల్లచట్టం' సారాంశం!!

'వ్యవస్థీకృత నేరాల అదుపు బిల్లు'లో ఎంత భయంకరమైన అంశాలున్నాయంటే ఇది గతంలోని దేశీయ నల్ల చట్టాలన్నింటినీ మించిపోయింది. ఈ చట్టంలోని కొన్ని సెక్షన్లయితే ప్రాథమిక హక్కులను ఏ మాత్రం ఖాతరు చేయని విధంగా తయారైనాయి. వ్యవస్థీకృత నేరాలకు సంబంధించిన కేసుల విచారణకు ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేసేందుకు ఈ చట్టం రాష్ట్ర ప్రభుత్వానికి అధికారం కల్పిస్తోంది. వీటికి జడ్జీలను హైకోర్టు సమ్మతితో రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తుంది. ఇక పోలీస్ శాఖకు ఈచట్టం విస్తృతాధికారాలను సంక్రమింప జేస్తోంది. హోంశాఖ కార్యదర్శి ఆమోదంతో ఎస్పీ స్థాయికి తక్కువ కాని అధికారి వ్యక్తుల ఉత్తరాలను, టెలిఫోన్ సంభాషణలను, ఇ-మెయిల్ వంటి ఎలక్ట్రానిక్ సమాచారాన్ని 60 రోజుల పాటు టాపింగ్ చేయగలిగేలా ఈ చట్టం వీలు కల్పిస్తోంది. ఇలా ఎలెక్ట్రానిక్ సాధనాలను రహస్యంగా వినడం, సంభాషణలను రికార్డు చేయడానికి అనుమతించడమే కాదు, వ్యక్తుల ప్రైవేట్ (రహస్య) సంభాషణలను వినే అవకాశాన్ని కూడా ఈ చట్టంలో కల్పించారు. ఇలా సేకరించిన సాక్ష్యాన్ని విచారణా కాలంలో కోర్టు జడ్జి తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవలసి వుంటుంది. అట్లే ఎస్పీ స్థాయికి తక్కువ కాని అధికారి సమక్షంలో నేరాన్ని ఒప్పుకున్నపుడు దానిని కోర్టు పరిగణనలోకి తీసుకోవచ్చున్న వెసులుబాటును ఈ చట్టంలో పొందుపరిచారు. అట్లే నేర అంగీకారం లిఖిత పూర్వకంగా వుండనక్కర్లేదు. ఆడియో, వీడియో క్యాసెట్ల సహాయంతో రికార్డు చేసిన నేరస్థుల నేర ఒప్పుకోలుకు సైతం ఇందులో చట్టబద్ధత కల్పించారు. ఈ చట్టం ద్వారా నేరం రుజువై ఎవరికైనా శిక్ష పడితే అలాంటి వారి ఆస్తులన్నింటినీ ప్రభుత్వం స్వాధీనం చేసుకోవచ్చు.

## నల్లచట్టాల ఫాసిస్టు నేపథ్యం

ఈ నూతన నల్ల చట్టం కూడా ఆకాశం నుంచి ఊడిపడిందేమీ కాదని, భారతీయ శిక్షాస్మృతిలోని అంశాలనే మార్చి దీన్ని తయారు చేశారని, మాఫియా గ్యాంగుల సంఘ విద్రోహకర కార్యకలాపాల అణచివేతకు మహారాష్ట్ర, కర్నాటక ప్రభుత్వాలు రూపొందించి 'సమర్థవంతం'గా అమలు చేస్తున్న వ్యవస్థీకృత నేరాల అదుపు చట్టం ప్రభావంతోనే మన రాష్ట్రంలోనూ దీన్ని ప్రవేశపెట్టారని, ఇది రూపం మారిన 'టాడా'యేనని సమాచార సాధనాలు పలు రకాలుగా వ్యాఖ్యానిస్తున్నాయి. కానీ ఈ చట్టాలన్నింటికీ అంతర్జాతీయ స్వభావం వుంది. ఉదారవాద ప్రజాస్వామ్యం ముసుగులో ఫాసిజం ప్రపంచ వ్యాప్తంగా వివిధ రూపాల్లో ప్రజానీకంపై దాడి చేస్తున్న నేపథ్యంలో ఈ నల్ల చట్టాలన్నీ పుట్టుకొస్తున్నాయి. నిర్బంధంలో సైతం నిందితులకు ప్రాథమిక హక్కులుంటాయన్న బూర్జువా చట్ట ప్రమాణాలను బూర్జువా వ్యవస్థే తోసిపుచ్చి గత కొన్ని దశాబ్దాలుగా క్రూర నిరంకుశ పాలనకు దారి తీసిన, తీస్తున్న నేపథ్యంలోనే ఇవి ఏర్పడుతున్నాయి. జాతుల పోరాటాలకు వ్యతిరేకంగా కొన్ని, కమ్యూనిస్టు ప్రభావానికి వ్యతిరేకంగా కొన్ని, గుత్త సంస్థల కటిక దోపిడీని వ్యతిరేకిస్తున్న ధిక్కార స్వరాలకు వ్యతిరేకంగా కొన్ని, చట్టబద్ధత, విశ్వసనీయత కోల్పోయిన వెనుకబడిన దేశాలలోని పాలనా వ్యవస్థలను నిలబెట్టేందుకు కొన్ని... ఇలా ప్రపంచమంతటా ఈ నల్లచట్టాలు పుట్టుకొస్తున్నాయి. బూర్జువా ప్రజాస్వామ్యపు మేడిపండు డొల్లతనాన్ని ఈ నల్ల చట్టాలు తిరుగులేకుండా నిరూపిస్తున్నాయి. ప్రజాస్వామ్యానికి సంబంధించిన కనీస హేతువు (మినిమమ్ రీజనింగ్) కూడా వీటికుండదు. మనిషి ఎంతకాలం బతుకుతాడనే ఇంగిత జ్ఞానం కూడా లేకుండా ఈ నల్లచట్టాల్లో కొన్ని అమెరికా, యూరప్‌లలో నేరస్థులకు 100, 130 సం॥ల మేరకు కఠిన శిక్షలు వేస్తుంటాయి. ఈ నల్లచట్టాల కారణంగా ఆగ్నేయాసియా దేశాల్లో కమ్యూనిస్టుగా ఆరోపణలకు గురైన వ్యక్తి, ఆ ప్రాతిపదికన శిక్షకు గురి కాకుండా వుండాలంటే తాను కమ్యూనిస్టును కానంటూ తానే స్వయంగా కోర్టులో నిరూపించుకోవలసి వుంటుంది. ఇక 'ప్రజాస్వామిక' దక్షిణ కొరియా పౌరులు 'కమ్యూనిస్టు' ఉత్తర కొరియా భూభాగం మీద అడుగు పెడితే చాలు దేశ ద్రోహులుగా పదేళ్ళు కఠిన కారాగార శిక్షకు పాత్రులు కావలసి వస్తుంది. ఈ విధంగా దోపిడీ వ్యవస్థలు ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక, రాజకీయ, సామాజిక సంక్షోభాల నుండి బయటపడేందుకు హేతుబద్ధతకు ఏ మాత్రం చోటులేని ఇలాంటి క్రూర చట్టాలను తామర తంపరగా తయారుచేసి వదులుతున్నాయి. టి.డి.పి. ప్రభుత్వం సంధించిన ఈ నూతన నల్లచట్టం కూడా ఈ కోవలోంచి పొడుచుకు వచ్చిందే తప్ప మరేం కాదు.

ఈ క్రమం మూడు దశాబ్దాల క్రితమే సామ్రాజ్యవాద దేశాల్లో మొదలైంది. వ్యవస్థీకృత నేరాల అదుపు పేరిట అమెరికా 1970లోనే 'రాకెటీర్ ఇన్‌ఫ్లుయెన్స్‌డ్ అండ్ కరప్ట్ ఆర్గనైజేషన్స్ (రీకో) పేరిట చట్టం తెచ్చింది. పదేళ్ళ అమలు తర్వాత 1980లలో దానికి మరింతగా కోరలు చెక్కి వదిలింది. ఈ బాటలోనే బ్రిటన్ సైతం 1998లో సరికొత్త 'ప్రివెన్షన్ ఆఫ్ ఆర్గనైజ్డ్ క్రైమ్' బిల్లును తెచ్చింది. అమలులో వున్న చట్టాలలోని లొసుగులను వాడుకుంటూ సంఘటితమైన శక్తులు, గ్రూపులు చేస్తున్న చట్టవిరుద్ధ పనులనే వ్యవస్థీకృత నేరాలుగా వ్యాఖ్యానిస్తున్నారు. ఉదార ప్రజాస్వామ్యం ప్రపంచమంతటా వేళ్లూనుకుంటున్నదని చెబుతూ వస్తున్న కాలంలోనే ఇలాంటి క్రూర నిరంకుశ చట్టాలు పాలకవర్గాల అమ్ముల పొదిలో భాగమౌతున్నాయి. ఇంతవరకూ బూర్జువా వ్యవస్థ ఘనంగా చెప్పుకుంటూ వస్తున్న ప్రామాణిక విలువలనే ఇవి తలకిందులు చేస్తున్నాయి. మచ్చుకు కొన్ని చూద్దాం. గత సం॥రం జూలై నెలలో లండన్‌లో జరిగిన ఆంగ్లో-అమెరికన్ లా కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ముర్రే స్టువార్ట్ స్మిత్ అనే బ్రిటీష్ జడ్జి **''మెజారిటీ ప్రజల భద్రతా పరిరక్షణ కోసం కొద్దిమంది నేరస్థుల, దుర్మార్గుల హక్కులను తొక్కిపట్టాల్సి రావచ్చు''** అంటూ బహిరంగ వ్యాఖ్య చేశాడు. అత్యాధునిక రీతుల్లో సాగుతున్న నేరాలకు రహస్య నిఘాయే సరైన విరుగుడు కాగలదంటూ కూడా ఈ జడ్జి హితోపదేశం చేశాడు. అట్లే ''ఉపద్రవం సంభవించక ముందే దాన్ని సమర్థంగా నిలువరించాలంటే చట్టాల్ని అమలుపర్చే సంస్థలకు తగిన సాధన సంపత్తిని సమకూర్చాలం'టూ అమెరికా జడ్జి విలియమ్ వెబ్‌స్టర్ పేర్కొన్నాడు. సంక్షుభిత సామాజిక వ్యవస్థలను అదుపు చేసేందుకుగాను ఆయా పాలక వర్గాలకు అత్యంత అవసరమైన అనుకూల వ్యాఖ్యలివి. పాలకవర్గాలు 'మెజారిటీ' ప్రజలనులను, 'కొద్దిమంది' నేరస్థులను ఏ దృక్పథంతో అంచనా వేస్తున్నారన్నది పక్కన బెడితే, ఈ తరహా వ్యాఖ్యానాలూ, వీటికనుగుణంగా తయారవుతున్న కర్కశ చట్టాలూ బూర్జువా వ్యవస్థ ఘనంగా ప్రచారం చేసుకుంటున్న ప్రాథమిక హక్కుల భావనకే గండి కొడుతున్నాయి. నిందితులకు సంవత్సరం పాటు బెయిల్ ఇవ్వకుండా, పోలీస్ నిర్బంధంలో నిందితుని నేర అంగీకారానికి చట్టబద్ధత కల్పిస్తూ, సాక్షులెవరో ముద్దాయికి తెలియనీయకుండా చేస్తూ రూపొందిన ఏ.పి. నూతన నల్లచట్టం సైతం 'పౌర సమాజం', 'విజ్ఞానదాయక సమాజం' భావనల అసలు రంగును బయటపెడుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ''నేటి ప్రపంచంలో కమ్యూనిజమూ లేదు, కేపిటలిజమూ లేదు వున్నదల్లా టూరిజమే'' అంటూ పదే పదే చేస్తున్న ప్రకటనల సారాంశం స్పష్టంగానే వుంది. నామమాత్రపు బూర్జువా ప్రజాస్వామిక విలువలను సైతం పాలనా వ్యవస్థలు మింగేస్తున్న పాడు కాలానికి సంబంధించిన దుర్మార్గపూరిత వ్యాఖ్యానాలివి.

---

నిందితుల్ని అరెస్టు చేయడానికి కుదరని పక్షంలోనో లేదా పరారీలో వున్నా సరే నిందితుని స్థిరచరాస్థులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవచ్చు. పైగా వ్యవస్థీకృత నేరాలు చేయడం ద్వారా తానీ ఆస్తులు సంపాదించలేదని కోర్టులో నిరూపించుకోవాల్సిన బాధ్యత కూడా నిందితుని పైనే వుంటుంది. వ్యక్తి మరణానికి కారణభూతమైన నేరం జరిగినపుడు ముద్దాయికి మరణశిక్ష లేదా యావజ్జీవ కారాగార వాసాన్ని ఈ చట్టం విధించగలదు. పైగా మరణదండనకు గురైన వ్యక్తికి గానీ లేదా నేరం రుజువైన వ్యక్తికిగానీ ఐదులక్షల రూపాయల మేరకు 'కనిష్ట' జరిమానా విధించేందుకు కూడా ఈ చట్టంలో అవకాశం కల్పించారు. ఏదైనా వ్యవస్థీకృత నేరానికి ప్రోత్సహించినట్లు కుట్రపన్నినట్లు రుజువైన వారికి కూడా ఐదు సం॥ల ఖైదు లేదా జీవిత ఖైదుని, అదనంగా ఐదు లక్షల రూ॥ల వరకు జరిమానా విధించవచ్చు. పైగా

ఇటువంటి నేరాలలో నిందితులను రక్షించేందుకు ఎవరైనా ప్రయత్నించినట్లు రుజువైనా ఇదే రకమైన శిక్ష విధించవచ్చు. అంటే వ్యవస్థీకృత నేరాలతో ప్రత్యక్ష, పరోక్ష సంబంధాలు కలిగిన వ్యక్తులందరిపై ఈ నూతన నల్లచట్టం ప్రకారం చర్య తీసుకునే అవకాశం వుంది. ఇది రాష్ట్రంలో మూడేళ్ళపాటు అమలులో వుంటుంది. తర్వాత కూడా దీన్ని పొడిగించుకోవచ్చు. ఈ విధంగా 'టాడా' కన్నా దారుణమైన శిక్షలను ఈ చట్టం ద్వారా ప్రతిపాదించారు.

ఇంకా నేర విచారణ ప్రక్రియలో ఈ చట్టం పోలీస్‌శాఖకు, న్యాయశాఖకు విచ్చలవిడి అధికారాలను కట్టబెట్టింది. ఈ చట్టం ప్రకారం నిందితులను 24 గంటల పాటు కాక 3 రోజులు అంటే 72 గంటల దాకా పోలీసులు నిర్బంధంలో వుంచవచ్చు. సాక్షి దఖలు చేసే దరఖాస్తు ఆధారంగా ప్రత్యేక కోర్టు సాక్షులెవరైందీ తెలీకుండా వారి వునికిని, చిరునామాను కూడా బయటపెట్టకుండా రహస్యాన్ని పాటించవచ్చు. నేర విచారణను సైతం బహిరంగంగా కాక రహస్యంగానే సాగించవచ్చు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జైల్లోంచే ఖైదీలను విచారించవచ్చు. సాక్ష్యాల ఉపయోగంలో నిందితుల హక్కులను పూర్తిగా కాలరాచేసే అంశాలివి.

## ఈ చట్టం పర్యవసానాలు

'పిరికివాడి చట్టాలు పరమ క్రూరంగా వుంటాయి' అని మార్క్స్ ఏనాడో వ్యాఖ్యానించాడు. స్వేచ్ఛా పెట్టుబడిదారీ దశలోని రాజ్య స్వభావానికి సంబంధించిన ఈ వ్యాఖ్యలు నేటి గుత్త పెట్టుబడిదారీ దశలో మరింత వాస్తవంగా తయారైనాయి. ఈ నేపథ్యంలో తెలుగుదేశం ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన ఈ నల్లచట్టం పర్యవసానాలెలా వుంటాయి? పౌరుల ఉత్తర ప్రత్యుత్తరాలను ఇతరులెవరూ చదవకుండా వాటి అంతరంగికాన్ని-ప్రైవసీ-కాపాడటం దోపిడీ రాజ్యాంగం ప్రకారమే ప్రభుత్వ బాధ్యతగా ఇంతవరకూ అమలవుతోంది. అయితే కాగితాలకే పరిమితమైన ఈ ఉత్కృష్టమైన విలువను పాలకవర్గాలు ఏనాడూ ఏ దశలోనూ పాటించలేదు. ప్రతిపక్షంలో కూర్చున్న పాలకవర్గాల టెలిఫోన్లను, సంభాషణలను సైతం టాపింగ్ ద్వారా పాలకపక్షాలు రాబడుతున్న వైనం ప్రపంచమంతటా సర్వసాధారణమై పోయింది. మన రాష్ట్రంకి సంబంధించినంతవరకూ ప్రభుత్వం నామమాత్రపు రాజ్యాంగ పరమైన ముసుగును సైతం చించేసి నగ్నంగా బయటపడింది. నేరస్థుల ఉత్తరాలను, సంభాషణలను మాత్రమే టాపింగ్ చేయగలమని ప్రభుత్వం బుకాయిస్తోంది. కానీ ఈ చట్టం లేనపుడు సైతం రాష్ట్రంలో ప్రతిపక్షాలవేకాక ప్రజాస్వామికవాదుల, పౌర హక్కుల కార్యకర్తల ఉత్తరాలూ, టెలిఫోన్ సంభాషణలూ సైతం టాపింగ్ బారిన పడుతూనే వచ్చాయి. ఇపుడీ చట్టం ద్వారా ప్రజల ఉత్తరాలను యథేచ్ఛగా చదవటం, వారి టెలిఫోన్ సంభాషణలను దొంగచాటుగా వినడంకి సంబంధించి పోలీసు యంత్రాంగానికి విస్తృతాధికారాలు లభించబోతున్నాయి. ఈచట్టం పర్యవసానాలు ఎలాంటివంటే ప్రభుత్వానికి ఇబ్బందికరంగా పరిణమించిన వారిని ఎలాంటి కారణాలు చూపకుండానే అరెస్ట్ చేయవచ్చు. దేశ భద్రతకు భంగం కలుగుతుందనే నెపంతో పౌరులను ఎవరినైనా నిర్బంధించవచ్చు. ప్రభుత్వం నిషేధించిన విప్లవ పార్టీల నేతలతో పత్రికలు ఇంటర్వ్యూలు జరిపి అచ్చేయటం కూడా ఈ చట్టం కింద మాఫియాలకు, సంఘ వ్యతిరేకులకు సహకరించినట్లే కాగలదు. ఏ వ్యక్తిపైనైనా పది సం॥ల లోపు రెండు చార్జిషీట్లు దాఖలైతే అటువంటి వారిపై ఈ నల్లచట్టం కింద బెయిల్ లేని కేసులు పెట్టి అణచివేయవచ్చు. అంటే ఈ చట్టం ఎంత ప్రమాదకరమైనదో అర్థమౌతుంది. బాధితులు, నేరస్తులు తమ తమ వాదనలు కోర్టులో వినిపించుకునే అవకాశం కూడా లేనంత ఘోరంగా రాష్ట్రంలో పౌరహక్కులను హరించి వేయబోతోందీ చట్టం.

ఈ చట్టంలోని కొన్ని అంశాలు (బి.జె.పి. మినహా) పాలకవర్గ ప్రతిపక్షాలనే ఎంతగా కలవరానికి గురి చేశాయంటే అసెంబ్లీ సమావేశాల్లో మూకుమ్మడిగా ఈ చట్టానికి వ్యతిరేకంగా అవి ధ్వజమెత్తాయి. తీవ్ర విమర్శల పాలై ఈ మధ్యే కేంద్ర ప్రభుత్వం వదులుకున్న 'పోటా' (టెర్రరిస్ట్ కార్యకలాపాల నిరోధక చట్టం) బిల్లునే సరిగ్గా ఈ నల్లచట్టం పోలి వుందంటూ మజ్లిస్ పార్టీకి చెందిన శాసన సభాపక్ష నాయకుడు అసదుద్దీన్ ఓవైసీ అసెంబ్లీలో తీవ్రంగా విమర్శించాడు. గతంలో పంజాబ్‌లో టెర్రరిస్టుల అదుపుకే పరిమితమంటూ రూపొందించిన 'టాడా' చట్టం కింద దేశ వ్యాప్తంగా 3,500 మంది ముస్లింలను నిర్బంధించి బెయిలు లేకుండా చేశారని, హైదరాబాద్‌లో సైతం ఇపుడు ప్రతి చిన్న తగాదాలోనూ ముస్లిం యువతను రౌడీ షీటర్లుగా ముద్రించి నానా యాతనలకు గురి చేస్తున్నారని భవిష్యత్తులో ఈ నల్లచట్టం ముస్లింలను లక్ష్యంగా చేసుకోబోతోందని ఓవైసీ విమర్శించాడు. నాజీ నాయకులకు వ్యతిరేకంగా న్యూరెంబర్గ్‌లో జరిగిన విచారణలు సైతం బహిరంగం గానే జరిగాయని ఇపుడు సాక్షుల పేర్లు, ముఖాలు బయటపెట్టకుండా ఈనల్ల చట్టం కింద సాగించే రహస్య విచారణలో ఆరోపణలకు గురైన ఏ వ్యక్తైనా తనను తాను ఎలా సమర్థించుకుని బయటపడ గలుగుతాడంటూ ఓవైసీ విమర్శించాడు. ఇక ఈ చట్టం వునికిలోకి రాకముందే, నిర్బంధంలోని ఒక నిందితుడి ఒప్పుకోలు ఆధారంగా కాంగ్రెస్ ప్రతిపక్ష నేత కొడుకుపై ప్రభుత్వం సాక్షాత్తూ అనంతపూర్ జిల్లా ఎస్పీ చేతనే అభియోగం మోపించి అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండగానే అభాసుపాలయిన ఉదంతం కూడా జరిగింది. ఇక తెలుగుదేశం పార్టీ వాడుకున్నంతకాలం వాడుకుని ఆనక గెంటేస్తే బొక్క బోర్లాపడ్డ రివిజనిస్టు పార్టీలు దానికి తగ్గట్లే ప్రభుత్వంపై విరుచుకుపడగా, ప్రభుత్వాన్ని సమర్థించే నూతన పాత్రను బి.జె.పి. చేపట్టింది. పేద ప్రజల పక్షాన పోరాడుతున్న నక్సలైట్లకు వ్యతిరేకంగా ఈ చట్టాన్ని వుపయోగిస్తారని సి.పి.ఐ. (యం-యల్) ఎ. గుమ్మడి నర్సయ్య ఒంటరి పోరాటం చేశాడు. తమ తమ ప్రయోజనాలకు అనుగుణంగా ఎవరికి వారు చేస్తూ వచ్చిన ఈ వ్యాఖ్యానాలే ఈ చట్టం భవిష్యత్తు పరిణామాలను అన్యాపదేశంగా సూచించాయి.

గత సం॥ర కాలంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజల నిరసన తీవ్రమై విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు విద్యుత్ వినియోగదారులు వగైరా వివిధ ప్రజా ఉద్యమాలు వెంట వెంట తలెత్తడంతో గుత్త సంస్థల అవసరార్థ పొగడ్తల మేతమేస్తూ పబ్బం గడిపిన చంద్రబాబుకు గంగవెర్రులెత్తినట్లయింది. అంగన్‌వాడీ మహిళలు, అంధ విద్యార్థులు.... ఇలా నేరు తెరిచి వీధుల్లోకి వచ్చిన ప్రతి సెక్షన్ ప్రజానీకాన్ని పోలీస్ లాఠీలతో కుళ్ళబొడిపించిన ప్రభుత్వంకి వ్యతిరేకంగా ప్రజల నిరసన విద్యుత్ ఛార్జీల పెంపుల

వ్యతిరేక పోరాటంతో పరాకాష్ట చేరింది. ప్రపంచబ్యాంకు ఆదేశాలతో, ప్రజల నిరసనను ఏ మాత్రం కూడా సహించడానికి సిద్ధంగా లేని ప్రభుత్వం గత సం॥రం బషీర్‌బాగ్ వద్ద విద్యుత్ ఛార్జీల వ్యతిరేక ఉద్యమకారులపై దారుణంగా జరిపించిన కాల్పులు దేశాన్నే కాక ప్రపంచాన్నే దిగ్భ్రాంతి పర్చాయి. సరిగ్గా ఆనాటినుంచే ఈ నల్లచట్టం గురించి ప్రభుత్వం ప్రస్తావించటం మొదలుపెట్టి దాన్ని ఇప్పటికీ రూపంలో తెచ్చింది. బషీర్‌బాగ్ కాల్పుల్లో మరణించింది. రౌటీషీటర్లే కాని ప్రజలు కారంటూ వ్యక్తుల ప్రాణాలను గడ్డిపోచ కింద లెక్కించిన హంతక ప్రభుత్వం ఈ నల్లచట్టం ద్వారా వ్యక్తుల ప్రైవేట్ జీవితాలకు సైతం భద్రత లేకుండా చేసింది.

## వ్యవస్థీకృత నేరస్థులు ఎవరు?

ఈ చట్టం ప్రకారం వ్యవస్థీకృత నేరాలు అంటే ఏవి? ''ఎవరైనా వ్యక్తిచే, వ్యవస్థీకృత నేర సిండికేటు సభ్యునిగా గానీ, లేక అట్టి సిండికేటు తరపున గాని తన కొరకు లేదా ఇతర ప్రయోజనాలను పొందేందుకు, లేదా తిరుగుబాటును ప్రోత్సహించే ఉద్దేశ్యంతో హింసను అనుసరించటం, లేదా హింసతో భయపెట్టడం, లేదా బలవంతం చేయటం లేదా శాసన విరుద్ధ చర్యల ద్వారా ఒంటరిగా కానీ, సంయుక్తంగా కానీ ఏదైనా శాసన వ్యతిరేక కార్యకలాపాలను కొనసాగించడం'' వ్యవస్థీకృత నేరాల కిందికి వస్తాయి. ఈ సంక్లిష్టమైన చట్ట పరిభాషకు హోంమంత్రి చేసిన భాష్యం ప్రకారం హత్యలు చేయడానికి కాంటాక్టులు కుదుర్చు కోవటం, బలవంతపు వసూళ్ళు, నిషిద్ధ వస్తువుల స్మగ్లింగ్, శాసన విరుద్ధంగా మత్తు పదార్థాల వ్యాపారం, బలవంతంగా డబ్బు వసూలు చేసేందుకు కిడ్నాపింగ్‌లకు ప్రయత్నించటం లాంటి నేరాలు ఈ ప్రత్యేక చట్టం కిందికి వస్తాయి. పై నిర్వచనాన్ని, దానికి హోంమంత్రి భాష్యాన్ని నిశితంగా పరిశీలిస్తే అక్షరాక్షరంగా ఇవన్నీ పాలకవర్గ రాజకీయ పార్టీల నేతలకూ, వారికి కుక్క సేవ చేస్తున్న పోలీస్ శాఖ అధికారులకే పూర్తిగా వర్తిస్తాయి.

వ్యవస్థీకృత నేరాల అదుపు గురించి చట్టం రూపొందించిన రాష్ట్ర అసెంబ్లీలో ఆ చట్టం దుష్ఫలితాల గురించే ప్రతిపక్షాలు భయాందోళనలను ప్రదర్శించాయి కానీ వాటిలో ఒక్కటంటే ఒక్క పార్టీ కూడా అసలీ 'వ్యవస్థీకృత నేరగాళ్ళంతా' ఎక్కడినుంచి పుట్టుకు వచ్చారో చర్చించిన పాపాన పోలేదు. ఎందుకంటే ఈ విషయంలో 'అందరూ దొంగలే' మరి. ఇదీ అదీ అని కాకుండా అన్ని పార్టీలూ, మాఫియా గ్యాంగులకు మహారాజ పోషకులే. రాజకీయాల చలవ పందిరి కింద పెరిగిన ఈ నేర శక్తులే క్రమంగా విశ్వరూపం దాల్చి నాయకుల కాళ్ళకిందికే మంటలు తెచ్చి పెడుతుండటంవల్లే తొలుత మహారాష్ట్ర, తర్వాత కర్నాటక, ఇపుడు ఆంధ్రప్రదేశ్... ఒక రాష్ట్రం తర్వాత మరొటి టాడాను పోలిన కరకు చట్టాలకు పదను పెడుతున్నాయి. మన రాష్ట్రం విషయానికొస్తే తెలుగుదేశం పార్టీ మంత్రులు, ఎం.ఎల్.ఏ.లు సగం మందికి పైగా భూ, లిక్కర్, మాఫియా వ్యవహారాల్లో సిద్ధహస్తులైనవారే తెహల్కా వెబ్‌సైట్ బయటపెట్టినట్లుగా 15 సం॥ల కాలంలో 2 వేల కోట్ల రూ॥లను మూటకట్టుకున్న చంద్రబాబు మొత్తం దేశంలోని రాజకీయ నాయకుల్లోకల్లా బడా గజదొంగ. ఇక పార్టీల పరంగా చూస్తే హైద్రాబాద్ నగరం మొత్తం మీద పేరుమోసిన ఒక నేరగాడు అక్షరాలా అధికార పార్టీలో క్రియాశీల సభ్యుడు. అతగాడి అఘాయిత్యాలు ఏ స్థాయికి పోయాయంటే ఇటీవలే నగర బహిష్కారంతో అతడిని సాగనంపాల్సి వచ్చింది. ఇక 'జ్ఞానం శీలం ఏకత'ల ఘనమైన కమలం పార్టీలోకి ఒక బడా నేరస్తుడిని ఆహ్వానించడానికి రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రే వరసగట్టి మరీ పత్రికలకెక్కాడు. ఇక హైద్రాబాద్ గజరౌడీ కొత్త దాస్‌కి కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయకు వున్న బాదరాయణ సంబంధం రాష్ట్ర ఎల్లలనే దాటిపోయింది. ఇక కాంగ్రెస్ గురించి చెప్ప పనే లేదు. పోలీసులు సైతం ఈ 'అడ్డాలకు మార్కెటింగ్ ఏజెంట్లుగా మారి తమ వద్దకు వచ్చే కొన్ని రకాల కేసులను కమీషన్ పుచ్చుకుని మరీ ఈ అడ్డాలకు పంపిస్తున్నారంటే; దీంట్లో ఒక్కొక్కడు మహా హంతకుడు. ఇలా రాష్ట్రంలోని బడా నేరగాళ్ళంతా ఏదో ఒక పార్టీ గొడుగు కింద హాయిగా విశ్రాంతి తీసుకుంటున్నవారే. ఇక అసెంబ్లీలో కూర్చున్న 'ప్రజా' ప్రతినిధులలో ఎంతోమంది వివిధ నేరాల ఆరోపణలలో చిక్కుకున్న వారే.

## ఎవరు దొంగలు :

ఆంధ్ర రాష్ట్రంలో ప్రభుత్వం నేడు చెప్తున్నట్లుగా రాజకీయ, సామాజిక కల్లోలాలకు కారణమవుతున్న ఈ మాఫియాలు వ్యవస్థీకృత నేరస్థులు నిజంగా ఎవరు అన్నది ఇప్పుడు కొత్తగా తేలాల్సిన పనిలేదు. రాయలసీమలోని పాలెగాళ్ళు, తెలంగాణాలో నక్సలైట్లూ 'అభివృద్ధి'కి విఘాతం కల్గిస్తున్నారంటూ ప్రభుత్వం రెండు పూర్తి వైరుధ్యపూరితమైన విషయాలను ఒకే గాటన కట్టి ప్రచారం చేస్తూంది. బ్రిటీష్ కాలం నుండి ప్రధానంగా రెడ్డి భూస్వాముల, గ్రామ పెత్తందార్ల చేతికింది గ్రామీణ సాయుధ ముఠాలకి రాయలసీమ పెట్టింది పేరు. 1947 అధికార మార్పిడి తర్వాత ఈ పాలెగాళ్ళ సంస్కృతి గ్రామీణ సరిహద్దులు దాటి ఎన్నికల రాజకీయాల్లోకి, అభివృద్ధి కార్యక్రమాల కాంటాక్టుల్లోకి, రియల్ ఎస్టేట్, ఫైనాన్స్ ఒప్పందాల్లోకి ఎగబాకి తిష్ట వేసింది. తమ కార్యకలాపాల్లో గ్రామీణ పెత్తందారీ కర్కశత్వాన్ని ఇప్పటికీ నిలుపుకుంటూ వస్తున్న ఈ ముఠాలు అభివృద్ధి కార్యకలాపాలలో జోక్యం ద్వారా ఆధునిక మాఫియాలైనారు.

రాయలసీమలో అపారమైన ఖనిజ వనరులను వెలికి తీయటంతో సహా ఏ చిన్న అభివృద్ధి కార్యక్రమాన్ని జరపాలన్నా ఈ ముఠా నాయకుల ప్రమేయం లేకుండా జరగవు. పారిశ్రామిక వ్యవహారాల్లో అంతర్జాతీయ అనుభవమున్న లారెన్స్ అండ్ టర్బో అనంతపురం జిల్లా తాడిపత్రిలో సిమెంట్ ఫ్యాక్టరీ పెట్టి నేర్చుకున్న పెద్ద గుణపాఠమేదంటే పాలకపక్షాల పునాదిగా వున్న ఈ పాలెగాళ్ళ జోక్యం లేకుండా ఫ్యాక్టరీ ప్రహరీగోడను సైతం స్వతంత్రించి నిర్మించటం కష్టమనే. ముంబై, గుజరాత్ నగర మాఫియాలతో చక్కగా వ్యవహారం నడిపిన అనుభవం వున్న ఈ బడా కంపెనీ సీమలోని పాలెగాళ్ళ ధాటికి నిలువలేక తన సిమెంట్ ఫ్యాక్టరీనే వదిలేసుకుని పోవడానికి దాదాపు సిద్ధమైపోయింది. అంతర్జాతీయ సంబంధాలు గల ఈ బడా కంపెనీయే రాష్ట్రాన్ని వదిలిపెట్టి పోయిందంటే అది పెట్టుబడులను ఎంతగా దెబ్బ తీయగలుగుతుందో ప్రభుత్వానికి అర్థమై ఇలాంటి సాకులెన్నింటినో బూచిగా చూపిస్తూ నల్ల చట్టం తెచ్చింది. కానీ సాక్షాత్తూ అధికార తెలుగుదేశం పార్టీ శాసన సభ్యుడు పరిటాల రవీంద్రే ఈ కంపెనీ కార్యకలాపాల్లో అడుగడుగునా జోక్యం చేసుకుంటున్నాడంటే, ఈ

చట్టం తేవడంలో ప్రభుత్వం చిత్తశుద్ధి ఏమిటో అర్థమౌతుంది. ఎమ్మెల్యే ముసుగును, అజ్ఞాత 'నక్సలైటు' విభాగాన్ని ఏక కాలంలోనే సాగిస్తున్న ఘనత ఇతగాడిది. పాలకవర్గ ముఠా కలహాల్లోకి మందుపాతర్ల విస్ఫోటనలను ప్రవేశపెట్టి వ్యతిరేకులను తుదముట్టించిన ఇతగాడు ఈరోజు రాయలసీమలోనే అతిపెద్ద పాలెగాడు. ఇక కర్నూలు జిల్లాలోని ఇద్దరు టి.డి.పి. పార్లమెంట్ సభ్యులు, మెజారిటీ అసెంబ్లీ సభ్యులు సైతం తమకుతాముగా ముఠా నాయకులుగానూ, పాలెగాళ్ళ కుటుంబాలకు చెందిన వారుగానూ వున్నారు. ఇంకా చిత్తూరు జిల్లా మిగిలిపోయి వుంది. ఈ జిల్లాలోని గజదొంగల్లోకెల్లా గజదొంగ ఎవరంటే పసిపిల్లలు సైతం 'నారా రామ్మూర్తి నాయుడే' అంటూ ఏక కంఠంతో చెబుతారు. ఈ జిల్లా గజదొంగ రాష్ట్ర గజదొంగ చంద్రబాబుకి స్వయానా తమ్ముడు. ఇతడు ఎన్ని దొంగ సారా లారీలను, బియ్యం లారీలను రాష్ట్ర సరిహద్దుల గుండా తరలిస్తూ పట్టుబడ్డాడో లెక్కేలేదు. గానీ ఒక్కటంటే ఒక్క కేసు ఇతడిపై మోపిన చరిత్ర ఇంతవరకు లేదు. పాణ్యం పార్థ సారధి రెడ్డిలు, కె.ఇ. ప్రభాకర్‌లు, భూమా నాగిరెడ్డి, అతడి తండ్రి సుబ్బారెడ్డి.... ఇలా పేర్లతో నిమిత్తం లేకుండా రాయలసీమ రాజకీయ జీవితంలో వెలుగుతున్న ముఠా నేతలంతా అటు తెలుగుదేశం, ఇటు కాంగ్రెస్ పార్టీలవారే. అందుకే అసెంబ్లీ సమావేశాలలో రాష్ట్రంలోని హత్యా సంస్కృతిపైన, నల్లచట్టం పైనా మొక్కుబడి చర్చలు జరిగిన సందర్భంలో ఏ ఒక్క పార్టీ కూడా ముఠా నాయకుల పేర్లు పొరపాటుగా కూడా పలుకకుండా జాగ్రత్త పడింది. ఎందుకంటే నోరు తెరిస్తే పెంట మొత్తంగా తమ ముఖంమీదే పడుతుంది. ఇలా పాలకవర్గాలు, ప్రభుత్వ యంత్రాంగమూ, ముఠా నాయకులూ ముప్పేట బంధంతో ఎవరి ప్రయోజనాలను వారు పొందుతూ నగ్నంగా చట్టాలను తోసి రాజంటున్నపుడు వాళ్ళ నల్ల చట్టాలు వాళ్ళ కాళ్ళగోటిని కూడా పీకలేవు. ఈ ఘోర పాలనకు వ్యతిరేకంగా నిరసన తెలిపే వారిని అణచి పెట్టడం తప్ప ఈ చట్టాలకు వేరే ప్రయోజనముండదు.

రాజుల కాలం పోయి 'ప్రజాస్వామ్య' ప్రభుత్వాలు, 'నాగరిక' సమాజం, పోలీసు వ్యవస్థ, కోర్టులు వునికిలోకి వచ్చాయంటున్న కాలంలో ఒకనాటి రాజుల స్థానంలో రౌడీలు, రాజకీయ నేతలు, ప్రైవేట్ న్యాయదేవతలై పంచాయితీలు చేస్తున్నారు. దశాబ్దం క్రితం దాకా మొండి బకాయిల వసూళ్ళకు, చిన్నా చితక తగాదాల పరిష్కారానికే పరిమితమై వుండిన ప్రైవేట్ 'అడ్డా'లు నేడు రాష్ట్రమంతటా, భూకబ్జాలకు, అన్ని రకాల పేచీల సెటిల్‌మెంట్లకు కేంద్రాలుగా విరాజిల్లుతూ స్థిరాస్థుల పంపకాలు, వ్యాపార భాగస్వాముల మధ్య తీర్పు చెప్పే స్థాయికి ఎదిగి ప్రతిఫలంగా లక్షల రూపాయిలు చేజిక్కించుకుంటున్నాయంటే; పోలీసులు సైతం ఈ అడ్డాలకు మార్కెటింగ్ ఏజెంట్లుగా మారి తమ వద్దకు వచ్చే కొన్ని రకాల కేసులను కమీషన్ పుచ్చుకుని మరీ ఈ అడ్డాలకు పంపిస్తున్నారంటే; అడ్డాల్లో లభించే కానుకలను 'కాల్‌మనీ'కి తిప్పి కోట్లు కూడేసు కుంటున్నారంటే; ఒకరిద్దరు ప్రైవేట్ అడ్డాల పెదరాయుళ్ళు పరిశ్రమలు పెట్టే స్థాయికి ఎదిగారంటే మన రాష్ట్రంలో పాలకవర్గం, పాలనా యంత్రాంగం ఎంతగా భ్రష్టు పట్టాయో అర్థమవుతుంది. మన రాష్ట్రానికొస్తే ప్రధానమైన భూ మాఫియా, మద్యం మాఫియా వంటివి ప్రభుత్వాల నుండి, అధికారుల నుండి, రాజకీయ వర్గాల నుండి లభించే అండదండలతోనే మనగలుగుతున్నాయి. కొన్ని మాఫియా బృందాలలో సాక్షాత్తూ రాజకీయ నాయకులే సభ్యులుగా వుంటున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇక మాజీ నక్సలైట్లు జనాన్ని బెదిరించి సాగిస్తున్న వసూళ్ల వ్యాపారంలో సీనియర్ పోలీసు అధికారుల ప్రమేయం వుంటున్నట్లు సాక్ష్యాధారాలతో సహా బట్టబయలయింది. భస్మాసురులను ఇలా అధికార యంత్రాంగమే పరిరక్షిస్తూ లాభపడి తాను సైతం మాఫియాలో భాగమైపోయింది.

**పోలీసులూ, శ్రీనివాస్‌లూ, కత్తుల సమ్మయ్యలూ....**

దేశంలో కెల్లా నెంబర్‌వన్ వ్యవస్థీకృత గూండాలెవరంటే పోలీసులు తప్ప మరొకరు కారంటూ దశాబ్దాల క్రితమే ఒక సుప్రీంకోర్టు జడ్జి వ్యాఖ్యానించాడు. సరిగ్గా మన రాష్ట్రంలోకి నూతన నల్లచట్టం అమల్లోకి వచ్చిన తర్వాత జరిగిన రెండు సంఘటనలు పై వ్యాఖ్యలను అక్షరాక్షరంగా రుజువు చేశాయి. అందులో ఒకటి నకిలీ నక్సలైటు శ్రీనివాస్‌తో డి.ఐ.జి. స్థాయి అధికార్ల లాలూచీ కాగా, రెండోది కత్తుల సమ్మయ్య పాస్‌పోర్టు ఉదంతం. మన రాష్ట్రంలో పాలనా యంత్రాంగానికి చట్టబద్ధత పట్ల విశ్వాసం ఏ మాత్రం లేదని, తన నేరపూరిత, అవినీతిపర చర్యలతో ఇది మొత్తం సమాజంతో ఆడుకుంటోందని ఈ రెండు వుదంతాలూ నగ్నంగా నిరూపించాయి. నలుగురు సీనియర్ ఐ.పి.యస్. అధికారులు, పలువురు అదనపు ఎస్పీ, డి.ఎస్పీ స్థాయి అధికారులు నకిలీ నక్సలైట్ సి.హెచ్. శ్రీనివాస్, అతని అనుచరుడు క్రిష్ణమూర్తిలతో కుమ్మక్కై కొన్నేళ్ళుగా అక్రమ కార్యకలాపాలకు చేయూత నందించిన విషయం మార్చి నెల చివరిలో బయటపడింది. వరంగల్ జిల్లా మహబూబాబాద్‌కు చెందిన శ్రీనివాస్ కొందరు పోలీసు వున్నతాధికారుల అవసరాలను తీరుస్తూ, పైరవీలు చేస్తూ అక్రమార్జన చేస్తూ, పలువురు వున్నతాధికారుల నుంచి వడ్డీకి డబ్బు తీసుకుంటూ ఫైనాన్స్ వ్యాపారం సాగిస్తున్న విషయం పోలీస్ విచారణలోనే తేలింది. (పోలీస్‌శాఖలోని వర్గాల మధ్య వైరుధ్యాలే పోలీసుల అసలు రంగును బయటపెట్టే ఇలాంటి విచారణలకూ, వాటి బట్టబయలుకూ దారి తీస్తుంటాయి) నలుగురు ఐ.జి.లు, ముగ్గురు డి.ఐ.జి.లు ఇంకా ఎంతో మంది ఇతర అధికారులు పెద్ద మొత్తంలో డబ్బును ఇతడి వద్ద దాచి నెలనెలా వడ్డీ తీసుకుంటున్నట్లు, ఈ అధికారుల రాసలీలలకు ఇతగాడు నగరంలోని స్టార్ హోటళ్ళలో, శివార్లలోని ఫామ్‌హౌజ్‌లలో 'వయాగ్రా' మందు సరఫరాతో సహా సకల ఏర్పాట్లు చేస్తూ వారికి అత్యంత ఆత్మీయ వ్యక్తిగా మారినట్లు విచారణలో తేలింది. టాస్క్‌ఫోర్సు పోలీసులు ఇతగాడిని అరెస్ట్ చేస్తే హోంశాఖలోని ఓ విభాగం అధిపతిగా వున్న సీనియర్ ఐ.పి.యస్. అధికారి, ఇద్దరు ఐ.జి.లు, ఓ డి.ఐ.జి., మరో అదనపు ఎస్పీ జోక్యం చేసుకుని శ్రీనివాస్ అరెస్ట్ కాకుండా శతవిధాలా ప్రయత్నించారు. పలువురు సి.ఐ.ల, ఎస్సైల బదిలీలు, కేసుల దర్యాప్తులో జోక్యం చేసుకున్నాడని, పలువురు పోలీసు వున్నతాధికారులతో కుమ్మక్కై వారి అండతో ఎంతోమంది అధికారులను బెదిరించి ఇతగాడు కోటి రూపాయల పైగా వసూలు చేశాడని టాస్క్‌ఫోర్స్ నివేదిక వెల్లడిస్తే ప్రభుత్వం కిమ్మనకుండా వుండిపోయింది. ఇక మహబూబ్‌నగర్‌కి చెందిన ఒక నేరస్థుడితో 15మందికి పైగా సీనియర్ ఐ.పి.ఎస్. అధికారులు అత్యంత సన్నిహితంగా మెలుగుతూ కోట్లాది రూపాయల తమ అక్రమార్జనను అతడివద్ద పెట్టి నెల వడ్డీలు తీసుకుంటున్న

విషయం కూడా ఈ సందర్భంలోనే బయటపడింది. 'వృత్తిధర్మం' అనే భావనకు సంబంధించిన ముసుగును సైతం చించేసిన సీనియర్ ఐ.పి.యస్. అధికారులూ, వారికి సర్వవేళలా వత్తాసునిస్తున్న ప్రభుత్వం కంటే మిన్నగా నేరగాళ్ళకు చేయూతనందించే వారు వున్నారా అన్నదే ఇప్పుడు తేలాల్సి వుంది.

'కత్తుల సమ్మయ్య ఇక లేరు' అంటూ డి.జి.పి. దొర ఒక తొత్తు కుక్క చావుకు ఘనంగా నివాళులర్పించి వుండొచ్చు కానీ సమ్మిగాడు అక్షరాలా కుక్కచావే చచ్చాడు. దేశం బయట విమాన ప్రమాదంలో వాడు చావటం నిజమే కావచ్చు. కానీ ప్రాణంమీద వున్న భీతే వాడిని చంపిందనటం అంతకంటే గొప్ప నిజం. ఈ నమ్మక ద్రోహిని విప్లవకారులు నేరుగా నిర్మూలించి వుండలేక పోవచ్చు. కానీ కొలంబో విమానం సీటులో సైతం నిద్రపట్టలేని స్థితిలో వాడిని చావు భయం చివరిదాకా వెంటాడిందనేదే పచ్చి నిజం. ప్రమాదానికి గురైన విమానంలోంచి అమాంతంగా కిందా మీదా గమనించకుండా గుడ్డిగా వాడు కిందికి దూకిన వైనమే వాడిలో ప్రాణభీతి ఎంతలా పేరుకుపోయిందో నిరూపించే సాక్ష్యంగా నిలిచింది.

కానీ కత్తుల సమ్మిగాడు ఎలా చచ్చాడు, చావబోయే ముందు ప్రాణభీతితో ఎలా కంపించిపోయాడు అనేది ఇక్కడ అప్రస్తుతం. కానీ మద్రాస్ నుండి కొలంబో మీదుగా జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్ వరకు వాడి విదేశీ యానానికి గాను చట్టం తొక్కిన అడ్డదారుల చరిత్రే రాష్ట్రంలో సకల వర్గాల ప్రజలనూ కలవరానికి గురి చేసింది. చట్టం దృష్టిలో డి.ఐ.జి. వ్యాస్ హంతకుడూ, మాజీ నక్సలైటూ, నేరస్థుడూ అయిన సమ్మయ్యకు విదేశానికి పోయేందుకు పాస్‌పోర్టు మంజూరు చేయటంలో మండల రెవిన్యూ కార్యదర్శి నుండి డి.ఐ.జి. స్థాయి అధికారుల దాకా ప్రభుత్వ యంత్రాంగం మొత్తం సొంత చట్టాలతో ఆడుకున్న వైనమే ఈ దిగ్భ్రాంతికి కారణం. పాస్‌పోర్ట్ కోసం సమ్మిగాడు చేసుకున్న దరఖాస్తుపై స్పెషల్ బ్రాంచి డి.సి.పి. సంతకం చేయగా, డి.ఐ.జి. రాంతివారీ, ఇంటెలిజెన్స్ ఐ.జి. శివశంకర్ సిఫార్సు చేశారని హైద్రాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి బయట పెట్టేంతవరకు ఈ తేలుకుట్టిన దొంగలంతా కిమ్మనకుండా వుండిపోయారు. అయితే 'నిండా మునిగిన తర్వాత ఇక చలేమిటి' అన్నట్లుగా, కత్తుల సమ్మయ్య గతంలో 'ప్రెస్ కాన్ఫరెన్స్' పెడితే పోలీసులు రక్షణ ఇచ్చారని, ఇపుడు పాస్‌పోర్ట్ ఇప్పించటం తప్పుకాదంటూ డి.ఐ.జి. రాంతివారీ తర్వాత తెగించి చేసిన ప్రకటనపై 'రాష్ట్రంలో చట్టపాలన ఉన్నట్లా లేనట్లా' అంటూ 'వార్త' పత్రిక వ్యాఖ్యానించింది. ఇక 'ఆంధ్రప్రభ' అయితే ''ఒక పోలీసు ఉన్నతాధికారి హత్యతో సహా అనేక క్రిమినల్ కేసులలో ముద్దాయి అయిన ఒక మాజీ నక్సలైటు, 'వ్యాపారం' పనిమీద దర్జాగా రాష్ట్రం విడిచిపెట్టి శ్రీలంక మీదుగా జర్మనీకి ప్రయాణం కట్టడాన్ని ఒక చట్టబద్ధ వ్యవస్థలో ఊహించుకోగలమా?...'' అంటూ కలవరం ప్రకటించింది. రాజ్యాంగ యంత్రపు అణచివేత స్వభావాన్ని, చరిత్రలో రాజ్యాంగ యంత్రం పుట్టుక నేపథ్యాన్ని కనుమరుగు చేసే పత్రికలు, ప్రచార సాధనాలూ ఇలా కృత్రిమ ఆశ్చర్యాన్ని, కలవరాన్ని ప్రకటించవచ్చు కానీ, ప్రజా ఉద్యమకారులకు ఇలాంటి భ్రమలేమీ లేవు. వాస్తవమేమిటంటే ఇలాంటి 'చట్ట' విఘాత చర్యలన్నీ పాలకవర్గాల ప్రమేయంతోనే, వాటి మనుగడ రీత్యానే అణచివేత యంత్రాంగం ద్వారా అమలవుతూ వస్తున్నాయి. ప్రభుత్వ పంచన చేరిన మాజీ నక్సలైట్లూ, నకిలీ నక్సలైట్లూ, క్రాంతి సేన, గ్రీన్ టైగర్లు, నల్లదండు వగైరా సవాలక్ష హంతక ముఠాలూ ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహిస్తున్న విప్లవ పార్టీలను ప్రత్యేకించి పీపుల్స్‌వార్‌ని నిర్మూలించే ఏకైక లక్ష్యంతో ప్రభుత్వ యంత్రాంగం అండతోనే కొనసాగుతూ వస్తున్నాయి. అయితే విప్లవోద్యమాన్ని అణచివేసే క్రమంలో పోలీసు అధికార్లు పెంచి పోషించిన మాజీ, నకిలీ నక్సలైట్లూ నేరస్థులూ భస్మాసురుల్లాగా తయారై 'చట్టబద్ధ' వ్యవస్థ ముసుగులకే ప్రమాదకరంగా తయారవుతుండటమే వ్యవస్థానుకూల శక్తుల కలవరానికీ, దిగ్భ్రాంతికి కారణమవుతోంది. గత ఒకటిన్నర దశాబ్దంగా పాలకవర్గాలు పోలీస్ యంత్రాంగం పగ్గాలు సడలించి రాష్ట్రంలో అమలు చేస్తూ వస్తున్న అరాచక, అణచివేత విధానాలను గురించి విప్లవోద్యమం గొంతెత్తి ప్రచారం చేస్తున్నా, చీమకుట్టినట్లుగా కూడా భావించని ఈ వ్యవస్థానుకూల శక్తులన్నీ మాజీ నక్సలైట్ల ముఠాలు వ్యవస్థ విశ్వసనీయతకే ప్రమాదం తెచ్చి పెడుతుండటంతో అనివార్యంగానే ఇలా ఆశ్చర్యాన్ని, దిగ్భ్రాంతిని ప్రకటించక తప్పడం లేదు.

## కౌంటర్ ఇన్‌సర్జెన్సీ ముఠాలు

భూ, సారా మాఫియా, పాలెగాళ్ళ గురించి టముకు వాయించిన ప్రభుత్వం తీవ్రవాద వ్యతిరేక హంతక ముఠాల ప్రస్తావన రాకుండా జాగ్రత్త పడింది. విప్లవోద్యమాన్ని, ప్రజాస్వామికవాదుల కార్యకలాపాలను అడ్డుకునేందుకుగాను ప్రభుత్వం బరితెగించి వునికిలోకి తెచ్చిన వ్యవస్థీకృత నేరస్తుల గుంపే ఈ కౌంటర్ ఇన్‌సర్జెన్సీ ముఠాలు. తమ దుందుడుకు చర్యల, హత్యాకాండల పరంపరతో ఈ ముఠాలు 15 సం॥ల నుండి ఆంధ్ర రాష్ట్రంలో వునికిలో వుంటూ వస్తున్నాయి. కాశ్మీర్‌లోని జాతి వ్యతిరేక విద్రోహముఠాలు, అస్సాంలోని 'సల్ఫా'లుగా ప్రభుత్వ ప్రమేయంతోనే, ప్రభుత్వ ప్రోత్సాహంతోనే పుట్టుకొచ్చిన ముఠాలివి. మన రాష్ట్రంలో ఈ ముఠాల్లో మాజీ నక్సలైట్లే ప్రధానంగా కనబడుతున్నా వీటి యంత్రాంగం పోలీసులతో, ఇన్ఫార్మర్లతో, ప్రజా వ్యతిరేక లంపెన్‌లతో విస్తృతంగా అల్లుకుని పోయింది. మొదట్లో పోలీసులే నేరుగా కౌంటర్ ఇన్‌సర్జెన్సీ కార్యకలాపాలు ప్రారంభించి డాక్టర్ రామనాథం, గోపీ రాజన్న, జాపాలక్ష్మారెడ్డి, నర్రా ప్రభాకర్ రెడ్డి, అందే నారాయణ వంటి పౌరహక్కుల నేతలను విప్లవోద్యమ సానుభూతిపరులను కాల్చిచంపారు. తర్వాత ఉద్యమంలోకే నేరుగా విద్రోహులను ప్రవేశపెట్టి, దళాలను, నేతలను అదనుచూసి చంపే కోవర్ట్ ఆపరేషన్లకు తెరలేపారు. 1993లో కత్తుల సమ్మయ్యతో మొదలై సోమ్లానాయక్, జడల నాగరాజుల ద్వారా కోవర్ట్ ఆపరేషన్లను పతాకస్థాయికి తీసుకుపోయారు. ఇక మొదటినుండి కోట్లాది రూ॥ల ఖర్చుతో ఇన్ఫార్మర్ల వ్యవస్థను పెంచి పోషిస్తూ గ్రామాల్లో, పట్టణాల్లో, దళాల కోసం, ఆర్గనైజర్ల కోసం ఇన్ఫార్మర్లను విస్తృతంగా ఉపయోగించిన పోలీస్ యంత్రాంగం 'కౌన్సిలింగ్' వంటి నూతన పద్ధతులతో విప్లవకారుల కుటుంబాలకే గాలంవేసి, ప్రలోభపెట్టి, బెదిరించి మరీ ఉద్యమాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నించారు. పీపుల్స్‌వార్ కేంద్రకమిటీ సభ్యులకే ఎరవేసిన కొయ్యూరు సంఘటన ఈ విధమైన కౌన్సిలింగ్ ఎత్తుగడల్లో భాగంగానే జరిగింది. ఈ మధ్యకాలంలో లొంగిపోయిన నక్సలైట్లనే నేరుగా రంగంలోకి దింపి ఉద్యమకారులను, మేధావులను వేటాడడానికి పూనుకున్నారు. వీరిలో

నయీముద్దీన్, బయ్యపు సమ్మిరెడ్డి, తిరుపతి బాలన్న శ్రీను వంటి వారితో కూడిన ముఠా గత సం॥రం ఫిబ్రవరి 18న నల్గొండలో పురుషోత్తం, ఆజం ఆలీలను పాశవికంగా నరికి చంపింది. కాశ్మీర్‌లో, ఈశాన్య భారతంలో కూడా జరగని విధంగా ఈ హంతక ముఠా పోలీసుల నిర్బంధంలో వుంటూనే విప్లవోద్యమాన్ని సవాలుచేస్తూ, విప్లవోద్యమాన్ని బలపర్చే ప్రజాస్వామికవాదుల, మేధావుల హిట్‌లిస్ట్‌లు ప్రకటించే స్థాయికి బరితెగించి పోయింది. పాలక ప్రభుత్వాలూ, పోలీస్ యంత్రాంగం విచ్చలవిడిగా సాగించిన ఈ కౌంటర్ ఇన్‌సర్జెన్సీ ఎత్తుగడల్లో ప్రతి ఒక్కటి వ్యవస్థీకృత నేరం కిందికి వచ్చేవే. జాతి ఉద్యమాలకంటే బలమైన రాజకీయ పరిపక్వతను, సంఘటితత్వాని కల్గిన విప్లవోద్యమాన్ని అణచివేసేందుకు సకల వ్యర్థ ప్రయత్నాలూ చేసిన ప్రభుత్వ యంత్రాంగం కొత్తగా ఇపుడు ఈ మాజీ నక్సలైట్ హంతకముఠాలను నేరుగా రంగం మీదికి వదిలి చేస్తున్న హత్యాకాండ ఈ నల్లచట్టం పరిధిలోకి వచ్చేదే అయినా వీరి నేరాల గురించిన ప్రస్తావనే చట్టంలో తీసుకుని పోలీస్ యంత్రాంగం అవసరమైతే విదేశాలకు కూడా పంపి కౌంటర్ ఇన్‌సర్జెన్సీ శిక్షణ ఇప్పించేందుకు ప్రయత్నిస్తోంది. పోలీస్ యంత్రాంగం ఇలా మాజీ నక్సలైట్లలో కొందరిని విదేశాలకు పంపిస్తోందని వార్తలు వెలువడిన మూడో రోజుకే కత్తుల సమ్మడి వుందంతం జరగటం కాకతాళీయం కాదు.

## ఏం చేయాలి?

విదేశీ పెట్టుబడుల కోసం శాంతి సుస్థిరతల మంత్రజపం చేస్తున్న పాలకవర్గాల చేతిలో ఆయుధమే నల్లచట్టాలు. ఈ కోవలో కొత్తగా పుట్టుకొచ్చిన ఎ.పి. వ్యవస్థీకృత నేరాల అదుపు చట్టం సహజ న్యాయ సూత్రాలకే విరుద్ధంగా తయారైంది. ప్రతి నల్లచట్టమూ ఇంతవరకు పాలకుల, పోలీసుల చేతుల్లో దుర్వినియోగమవుతూ వచ్చింది. తెలుగుదేశం ప్రభుత్వం తెచ్చిన ఈ నూతన నల్లచట్టం కూడా వాస్తవంగా స్మగ్లర్లను, భూఆక్రమణదారులను, నిర్బంధంగా డబ్బులు వసూలు చేసేవారిని, ఫాక్షనిస్టులను, మాఫియాలను ఏమీ చేయదు. దుర్వినియోగానికి వందశాతం అవకాశం వున్న ఈ చట్టం ప్రకారం 'వ్యవస్థీకృత నేరాల ముఠా'గా నక్సలైట్లే అంతిమంగా తేలతారు. పీపుల్స్‌వార్ కార్యకర్తలూ, వారి సానుభూతిపరులూ, వారికి మద్దతుపలికే విప్లవ రచయితలూ, ఉద్యమ వార్తలను ఇంటర్వ్యూలను ప్రచురించే జర్నలిస్టులూ, విప్లవ సాహిత్యాన్ని అచ్చేసే ప్రింటర్లూ పోలీస్‌శాఖ జాబితాకెక్కిన పౌరహక్కుల కార్యకర్తలూ, ఇంకా సమస్యల పరిష్కారం కోసం వీధుల్లోకొచ్చే ప్రజాసమూహాలూ వీరే ఈ క్రూరచట్టం పరిధిలోకి వస్తారు. మౌలికంగానే ఈ చట్టం ప్రజా, విప్లవోద్యమాలమీదే గురిపెట్టింది. నేరాల మూలాన్ని, నేరాలకు అమల్లోవున్న వ్యవస్థలకు మధ్య సంబంధాన్ని ఉద్దేశ్యపూర్వకంగా పక్కనబెట్టి నేరస్థులెవరు, నేరాలకు శిక్షలేమిటి అని నిర్ణయించే విచక్షణాధికారాన్ని రాజ్య పాశవిక శక్తి అయిన పోలీసుశాఖకే కట్టబెడుతున్న ఈ భయంకర చట్టానికి వ్యతిరేకంగా సకల ప్రజా విభాగాలూ పోరాడాల్సి వుంది. ఈ దుష్ట చట్టం పర్యవసానాలకు, దుష్పరిణామాలకు వ్యతిరేకంగా విస్తృతమైన ప్రచారం, పోరాట కార్యక్రమం మన కర్తవ్యాలలో భాగంగా కావాలి.

❑

(33వ పేజీ తరువాయి)

భాగోతం సముద్రంలో నీటి బిందువంత కూడా వుండదు. నిజానికి 'చట్టబద్ధం' కుంభకోణాలకంటే రహస్య కుంభకోణాల్లో జరిగే మోసాలే చాలా ముఖ్యమైనవి. ఉదా॥కు స్టాక్ ఎక్స్ఛేంజ్‌ని మాయచేసి కోట్లాది రూ॥లను దారి మళ్ళించిన ఉదంతం కేసి చూడండి. బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజిని దగా చేసిన కేతన్ పరేఖ్ బయటకు కన్పిస్తుండవచ్చుగానీ బయటపడకుండా అతని ద్వారా '99 జనవరి నుండి 2000 మార్చి వరకు 1,47,000 కోట్ల రూ॥ల మదింపు పెట్టిన నాలుగు పరోక్ష విదేశీ మదుపు (ఎఫ్.ఐ.ఐ.) సంస్థలే ఈ భారీ కుంభకోణంలో నిజమైన నేరస్థులు. ఈ స్టాక్ కుంభకోణంలో గుజరాత్ రాష్ట్రంలోని రెండో అతిపెద్ద బ్యాంకు అయిన మాధవపుర మర్కంటైల్ సహకార బ్యాంకు కుప్పగూలి పోవటంతో లక్షలాది చిన్న చిన్న డిపాజిట్‌దారులు 1,100 కోట్ల రూ॥లు నష్టపోయారు. మరొక అతిపెద్ద కుంభకోణమేదంటే పేద రైతుల కోసం ఉద్దేశించిన సబ్సిడీలలో దాదాపు 5,000 కోట్ల రూ॥లు మోసపూరితంగా కొల్లగొట్టిన ఎరువుల పరిశ్రమే తప్ప మరొకటి కాదు. ఇలా ఈ చిట్టాకు అంతముండదు. వీటిలో లాభపడింది సంపన్నులు, శక్తిమంతులు కాగా సామాన్యులు, మధ్యతరగతి ప్రజలే నిండా మునిగి పోయారు.

ఇకపోతే తెహెల్కా ఇంటర్నెట్ పత్రికా సంపాదకుడిని చంపడానికి అడ్డదిడ్డంగా ప్రయత్నాలు జరగడంతో అంతర్గత కుమ్ములాటలు మరింత తీవ్రరూపం దాల్చాయి. త్యాగి ఉదంతంలో ప్రతిపాదిత హత్యలను పాకిస్తాన్ గూఢచార సంస్థ ఐ.ఎస్.ఐ.కి అంటగట్టేందుకు ప్రయత్నాలు జరిగి విఫలమైన తర్వాత ఇపుడు దీంట్లో దావూద్ హస్తమున్నట్లుగా పుకార్లు రేపారు. పాలకవర్గ రాజకీయాలకు, రహస్య ఒప్పందాల చీకటి ప్రపంచానికి సంబంధించిన ఈ జూద క్రీడలో ఏం జరగడానికయినా అవకాశముంది. దీంట్లో ప్రయోజనాలు చాలా భారీ స్థాయిలో వున్నాయి కాబట్టి హత్యలు, అంగవిచ్ఛేదనలు వంటివి సహజ పరిణామాలే.

వీటన్నింటినీ బట్టి తెలుస్తున్నదేమంటే మన దేశాన్ని ఏలుతున్న ఈ రాజకీయ నాయకుల, బడా వ్యాపారుల మేడిపండు ప్రపంచం పెద్ద మనుషుల రూపంలోని మాఫియా జూదగాళ్ళ గుంపే తప్ప మరొకటి కాదనే. వీళ్ళే దేశాన్ని ఏలేందుకు ఓట్ల కోసం ప్రాధేయపడుతున్నారు లేక తమ కీలు బొమ్మకు విరాళాలిస్తున్నారు. ప్రజలు ఈ దగాకోర్లను తిరస్కరించటమే కాదు, ప్రజా న్యాయ స్థానాలలో వీళ్ళని విచారించి శిక్షించాలి. ఎన్నికలు, వృధా నిరసన ప్రదర్శనలు వంటి శాంతియుత పద్ధతుల ద్వారా ఈ రక్తం పీల్చే జలగల నుండి మన దేశాన్ని విముక్తి చేయటం సాధ్యం కాదు. ఈ ప్రజా శత్రువులను, దేశ శత్రువులను నిర్మూలించడానికి బలమైన విప్లవ శక్తి అవసరం ఎంతైనా వుంది.

❑

# పాలకవర్గాల దుర్గంధభూయిష్ట రాజకీయాల బట్టబయలు

## తెహెల్కా డాట్‌కామ్

ఫిబ్రవరి నెల చివర్లో బి.జె.పి. ఆధ్వర్యంలోని ఎన్.డి.ఏ. ప్రభుత్వాన్ని నాలుగు గంటల వీడియో ప్రదర్శనతో దిమ్మెర పోయేలా చేసింది తెహెల్కా డాట్ కామ్-Tehelka.Com-అనే ఇంటర్నెట్ ఆధారిత కంపెనీ. వాస్తవానికి అది పెద్దగా కష్టపడిందేమీ లేదు. భారత రక్షణశాఖ ఒప్పందాల చీకటి వ్యాపారంలోకి ఆ కంపెనీ గుడ్డేటు చందాన ఒక రాయి విసిరి చూసిందంతే. ఆ రాయి రేపిన కలకలం ఎలాంటిదంటే భారత రాజకీయ నాయకుల సైన్యాధికారుల కంపు మొత్తంగా బయటపడి పోయింది.

ఫిబ్రవరి నెలలో ఢిల్లీ నగరంలోని ఓ హోటల్‌లో తెహెల్కా డాట్ కామ్ కంపెనీ ప్రదర్శించిన నాల్గుగంటల నిడివిగల వీడియో చిత్రం భారత రాజకీయ నాయకుల, సైన్యాధికారుల అవధులు మీరిన ధన లోభిత్వాన్ని నగ్నంగా ప్రదర్శించింది. 'వెస్ట్ ఎండ్ కార్పొరేషన్' అనే ఆయుధాల విక్రయ కంపెనీ ముసుగులో తెహెల్కా ప్రతినిధులు అందించిన లక్ష రూపాయల కరెన్సీ నోట్ల కట్టల్ని పరిశుద్ధ బి.జె.పి. అధ్యక్షుడు బంగారు లక్ష్మణ్ చేతులు చాచి తీసుకుని సొరుగులో పెట్టుకుంటూ తదుపరి వాయిదా డబ్బుల్ని డాలర్ల రూపంలో తీసుకురావాలని కోరుతుండటాన్ని, సాక్షాత్తూ రక్షణమంత్రి ఇంట్లోనే సమతా పార్టీ అధ్యక్షురాలు జయాజైట్లీ ఆయుధాల విక్రయ వ్యాపారులమంటూ తమకు తాముగా ప్రకటించుకున్న తెహెల్కా ప్రతినిధుల నుండి కొంత డబ్బుని తీసుకుంటుండటాన్ని, సీనియర్ మేజర్ జనరల్స్, బ్రిగేడియర్లు కూడా ప్రతిపాదిత ఆయుధ ఒప్పందాలకు గాను కమీషన్లను దిగమింగుతుండటాన్ని కళ్ళారా చూసిన యావత్ ప్రజానీకమూ దిగ్భ్రాంతికి గురైంది.

తెహెల్కా కంపెనీ బోర్డు సృష్టించిన లండన్ ఆధారిత కుహనా 'వెస్ట్ ఎండ్' కంపెనీ పూర్వాపరాలను కనీసంగా అయినా నిర్ధారించుకోకుండానే లక్ష, రెండు లక్షల రూ॥ల ముష్టి మొత్తాలకు సైతం ఈ నానా రకాల 'కంగాళీ'లు వెంపర్లాడిన వైనాన్ని పరిశీలిస్తే వీరిలో దమ్మిడీకి పనికిరాని మడ్డి ఏ స్థాయిలో పేరుకుపోయిందో సులభంగా అర్థమవుతుంది. అయితే వేలాది కోట్ల రూ॥ల విలువైన ఆయుధ కాంట్రాక్టులకు ఆమోద ముద్ర వేసే కీలక అధికారిక స్థానాల్లో వుంటూ భారీ ఒప్పందాలపై సంతకం పెడుతున్న సందర్భాలలో ఏం జరుగుతుందో, జరుగుతూ వస్తోందో తెహెల్కా ఉదంతం స్పష్టాతిస్పష్టంగా చూపించింది. ఈ సం॥రం కేంద్ర ప్రభుత్వం 20,000 కోట్ల రూ॥ల భారీ మొత్తాన్ని ఆయుధ కొనుగోళ్ళకి కేటాయించింది. ఈ భారీ కొనుగోళ్ళకుగాను కేవలం 5 శాతమే కమీషన్‌గా వుంటుందనుకున్నా, దళారీలకు, రాజకీయ నాయకులకి, సైన్యాధికారులకు, కీలక స్థానాల్లోని బ్యూరాక్రాట్లకు 1000 కోట్ల రూ॥లు అప్పనంగా లభించినట్లే అవుతుంది.

సమతా, బి.జె.పి., ప్రధానమంత్రి అందరూ అవినీతిపరులైన రాజకీయ నాయకులను ఖండించటానికి బదులుగా సమర్థిస్తూ, ప్రభుత్వాన్ని అస్థిరత్వం పాలు చేసేందుకుగాను జాతి వ్యతిరేక కుట్రలో తెహెల్కా ఓ భాగం అంటూ ఆరోపించారు. ప్రజల తీవ్ర నిరసన వల్ల వీరంతా రాజీనామా చేయక తప్పింది కాదు కాని, జార్జి ఫెర్నాండెజ్ మటుకు ఈ రోజుకీ ఎన్.డి.ఏ. కూటమి కన్వీనర్‌గా వెలుగుతూనే వున్నాడు. ఈ ధూర్తులను విచారించే మాటే లేదు. జాయింట్ పార్లమెంటరీ కమిటీ చేత వీరిని విచారించాలన్న డిమాండ్‌ని ప్రభుత్వం నిర్ద్వంద్వంగా తోసి పుచ్చింది. పరిస్థితిని చల్లబర్చేందుకుగాను న్యాయ విచారణకు మాత్రం ఆదేశించారు.

ఈ రాజకీయ నాయకులూ, సైన్యాధికారులే 'జాతీయ భద్రత' గురించి గావు కేకలు పెడుతూ వస్తున్నారు. కానీ కొన్ని డాలర్ల కమీషన్ కోసం నాసిరకం సైనిక సామగ్రిని కొనేందుకు ఉబలాటపడుతున్న దేశంలోకెల్లా మించిన కుట్రదారులూ వీళ్ళే. ప్రతి నెలా కనీసం ఒకటో రెండో రష్యన్ 'మిగ్' యుద్ధ విమానాలు నేలకూలుతూ పైలెట్లను చంపుతూ దేశానికి వేలాది కోట్ల రూ॥ల నష్టాన్ని కొనితెస్తున్న వైనం గురించి వీరెవరూ నోరెత్తరు. చావడానికిగాను జవాన్లు యుద్ధరంగం లోకి పంపబడుతుండగా, మరోవైపున ఆజ్ఞలు జారీ చేస్తున్న వారు లోపాయికారీ ఒప్పందాలతో డబ్బు గుంజటంలో తమ సమయాన్నంతటినీ వెచ్చిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో తెహెల్కా బయటపెట్టిన గుట్టుమట్లు సాయుధ బలగాలలోని శ్రేణులను నైతికంగా పెద్ద ఎత్తున కుంగదీసినందుకు ఆశ్చర్య పడాల్సిందేమీ లేదు.

బి.జె.పి.కి, కాంగ్రెస్‌కి మధ్య, బి.జె.పి.లోనే ప్రధానమంత్రి కార్యాలయంలోని ఉన్నతాధికారులను బయటకు సాగనంపాలని చూస్తున్న వారికి, వీరి వ్యతిరేకులకు మధ్య అంటే పాలకవర్గాలలోని తీవ్రమైన అంతఃస్సంఘర్షణలే పై అవినీతి వ్యవహారాలు బట్టబయలయేందుకు నిజమైన కారణం. తెహెల్కా ఉదంతంలో 'పట్టుబడిన' వారంతా వాజ్‌పేయికి సన్నిహితంగా వుంటున్నవారే కావటంలో ఆశ్చర్యపడాల్సింది ఏమీ లేదు. తెహెల్కా ఉదంతం తర్వాత దుష్ట దుర్మార్గుడిగా పేరుమోసిన బ్రిజేష్ మిశ్రాకి, హిందూజా మాఫియాలతో అతని లోపాయికారీ సంబంధాలకు వ్యతిరేకంగా ప్రచారం మొదలైంది. ఆ తర్వాత ప్రధానమంత్రి కార్యాలయం తనపై ఆరోపణల వెల్లువను తిప్పికొట్టడానికి, సోనియా గాంధీ కుడి భుజమైన విన్సెంట్ జార్జి పోగేసిన భారీ సంపద వివరాలను గుట్టుమట్లును విప్పి బయటేసింది. తెహెల్కాలో సైతం ముంబాయి స్టాక్ బ్రోకర్ శంకర్ శర్మకి 15 శాతం వాటాలు వున్నాయి. ఇటీవలి స్టాక్ మార్కెట్ కుంభకోణంలో పాత్ర వున్న ఇతగాడు పేరుమోసిన స్టాక్‌బ్రోకర్ కేతన్ మెహతాపై గట్టి వ్యతిరేకత కలిగిన బ్రోకర్ల లాబీకి చెందినవాడు.

అవధులు మీరిన అవినీతి, లంచగొండితనం అనేవి సరళీకరణ క్రమం విశిష్ట లక్షణమే. తెహెల్కా వుదంతంలో బయటపడిన అవినీతి

(తరువాయి 32వ పేజీలో...)

**లిబరేషన్‌తో ఘర్షణలు**

# ''రివిజనిజాన్ని తిప్పికొట్టడానికి ఈరోజుకీ మా పార్టీ రాజకీయ, సైద్ధాంతిక పోరాటాలనే నమ్ముతూంది తప్ప భౌతిక దాడుల్ని కాదు''

– కా॥ శ్రావణ్‌తో ఇంటర్వ్యూ

**ప్రశ్న : ఇటీవల సి.పి.ఐ. (యం-యల్) లిబరేషన్‌తో మీ పార్టీకి తీవ్రమైన ఘర్షణలుంటున్నాయి (ఇక నుండి ఈ పార్టీని లిబరేషన్‌గా పేర్కొందాం) దీనికి కారణమేమిటి?**

**కా॥ శ్రావణ్ :** ఈ ఘర్షణలు కొత్తవేమీ కాదు. చాలా కాలం నుంచి వున్నవే. పరిస్థితుల్ని బట్టి పరిమితంగానో, తీవ్రంగానో వుంటున్నాయి. రెండు పార్టీల మధ్య ఘర్షణలకు మూల కారణం రాజకీయమైనది. ఘర్షణల వెనుకనున్న రాజకీయ కారణాల్లోకి వెళ్ళకుండ వాస్తవ పరిస్థితిని అర్థం చేసుకోవటం చాలా కష్టం.

ఒకప్పుడు చారుమజుందార్ విప్లవ పంథాని బలంగా సమర్థించిన గ్రూపుల్లో లిబరేషన్ గ్రూప్ కూడా ఒకటి. కా॥ జోహార్ అమరత్వం తరువాత నాయకత్వం వినోద్‌మిశ్రా చేతుల్లో పడి, భారత విప్లవానికి వాళ్ళు ద్రోహం చేయటం ప్రారంభించారు. కుట్రపూరిత పథకంలో భాగంగా ఒకనాటి విప్లవ పార్టీ సి.పి.ఐ., సి.పి.యం.ల మాదిరిగా క్రమంగా రివిజనిస్టు పార్టీగా మారింది. అప్పటి 'లిబరేషన్' నాయకత్వం ప్రభుత్వ దాడులకు వ్యతిరేకంగా చేపట్టిన సాయుధ ప్రతిఘటనా పోరాటాలు ముగిశాయి. భూస్వామ్య ప్రైవేటు సైన్యాలను అణచివేసేందుకు జరిగే సాయుధ పోరాటం అప్రధానమైన కర్తవ్యంగా తయారైంది. ఈ రకంగా ఐక్య సి.పి.ఐ. (యం-యల్) రూపొందించిన, ప్రత్యేకించి దాని స్థాపకుడైన కా॥ చారుమజుందార్ రూపొందించిన దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథా అనే మౌలిక సాయుధ పోరాట మార్గం నుంచి మొత్తం గ్రూపును వాళ్ళు ప్రక్కదారి పట్టించి, వారిని పార్లమెంటరీ ఎన్నికల పంథా ముందు సాగిలబడేలా చేయటం ద్వారా పాలకవర్గాల ఏజెంట్లుగా మారిపోయారు. కా॥ జోహార్ నేతృత్వంలోని 'లిబరేషన్'ని విప్లవ పార్టీ నుండి ఒక లీగల్ పార్టీగా, సంస్కరణవాద పార్టీగా, పార్లమెంటరీ ఎన్నికల పోరాటంగా వీళ్ళు మార్చివేశారు. అంతేగాక రహస్య సంస్థని బహిరంగ అవకాశవాద, రివిజనిస్టు సంస్థగా మార్చారు.

ప్రత్యేకించి, రెండు పార్టీలూ పనిచేస్తున్న బీహార్‌లో, రివిజనిస్టు పంథాను స్థాపించడానికి ప్రయత్నిస్తూనే, ప్రత్యేకించి, మా విప్లవ పంథా ప్రభావానికి లిబరేషన్ భీతిల్లుతున్నది. ఆ కారణం చేత, వారి రాజకీయాలు మారుతున్న స్థితికి అనుగుణంగా, మా మీద (అప్పటి సి.పి.ఐ. (యం-యల్) (పి.యు.)) పథకం ప్రకారం దాడులు చేయడానికి పూనుకున్నారు. దీన్ని మొదట మాకు వ్యతిరేకంగా చెడు ప్రచార కార్యక్రమంలో ప్రారంభించారు. తన పతనానికి ముందు, లిబరేషన్ మా పార్టీని విప్లవ పార్టీగానే పరిగణించింది. అయితే పతనం వైపుగా తన పంథాని మళ్ళించటం మొదలెట్టిన తరువాత, మొదటగా మమ్మల్ని అర్ధ అరాచకవాదులమనే ప్రచారం ప్రారంభించి, తరువాత అరాచకులమని, ఆ తరువాత భూస్వామ్య నేరగాళ్ళ ముఠా అని ఆరోపించింది. ఈరోజు వారు పిరికి ద్వేషంతో, పాలకవర్గాలు, వారి రాజకీయ పార్టీలు ఉపయోగించే పదజాలాన్ని ఉపయోగిస్తూ మమ్మల్ని ఉగ్రవాదులని పిలుస్తున్నారు. అంతేగాక మాపై పోలీసు నిర్బంధాన్ని అమలు చేయాలని డిమాండ్ చేసే వరకు పోయారు. ''పార్లమెంటరీ ఎన్నికల పంథాను బహిష్కరించి, దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథా పైననే దృఢంగా నిలబడి మిగిలివుండే రహస్య పార్టీగా'' ఐక్య సి.పి.ఐ. (ఎం-ఎల్) మరియు దాని స్థాపకుడైన కా॥ చారుమజుందార్, కా॥ జోహార్‌లు రూపొందించిన ప్రధాన విప్లవ పంథాను, మా పార్టీ ఏర్పడినప్పటి నుండి, ఈనాటి వరకు మేము దృఢంగా అమలు చేస్తున్నప్పటికీ, వాళ్ళు ఇవన్నీ మాట్లాడుతున్నారు.

ఈరోజు, పాలకవర్గాలకు, వారి సైన్యాలకు వ్యతిరేకంగా సాయుధ పోరాటాన్ని కొనసాగిస్తూ, ప్రభుత్వం, ప్రైవేటు సైన్యాలు అనేక రూపాల్లో పెంచుతున్న నిర్బంధ క్యాంపెయిన్లను తట్టుకొని నిలబడుతూ, రాజకీయ పంథాను అభివృద్ధి చేస్తూ, దేశ వ్యాప్తంగా సాయుధ పోరాటానికి నాయకత్వం వహిస్తున్నందుకు మేము గర్విస్తున్నాము.

లిబరేషన్ తప్పుడు ప్రచారానికే పరిమితం కాకుండా 1986/87 నుండి మాకు (మునుపటి పి.యు.కి) వ్యతిరేకంగా సాయుధ దాడుల్ని కూడా ప్రారంభించింది. కొంత కాలం భూస్వామ్య ప్రైవేటు సైన్యాలకు, పోలీసులకు వ్యతిరేకంగా ఉపయోగించిన వారి సాయుధ దళాల్ని, ఇప్పుడు ఎక్కువగా మామీద దాడులకే ఉపయోగిస్తున్నారు. వాస్తవంగా, లిబరేషన్ ఇప్పుడు అమలు చేస్తున్న వ్యూహమేమిటంటే, ప్రజల నిజమైన శత్రువులైన మధ్యయుగాల నాటి అనాగరిక భూస్వామ్య గూండా సేనలకువారి పోషకులకు, క్రూరమైన ప్రభుత్వ యంత్రాంగానికి వ్యతిరేకంగా రాజకీయ, సైద్ధాంతిక పోరాటాన్ని మాత్రమే నిర్వహించటం, మరోవైపున ప్రజల నిజమైన మిత్రులైన కమ్యూనిస్టు విప్లవకారులకు, ప్రజాస్వామిక శక్తులకు వ్యతిరేకంగా సాయుధ పోరాటానికి దిగటం మాత్రమే. ఇలాంటి పరిస్థితుల్లో విప్లవ శక్తులకు, ప్రజలకు రాజకీయ పోరాటంతోపాటు, సాయుధ ఆత్మరక్షణా చర్యల్ని ఆశ్రయించటం కంటే, మరో ప్రత్యామ్నాయం లేదు.

పాలకవర్గాలు, వారి రాజకీయ పార్టీలు విప్లవ రాజకీయాల్ని ఎదుర్కోవటం చేతకాక, తప్పుడు ప్రచారాన్ని, దౌర్జన్యకర చర్యల్ని ఆశ్రయించినట్లు, అదే ఫక్కీలో నయా రివిజనిస్టు పార్టీ అయిన లిబరేషన్ కూడా, మా విప్లవ రాజకీయాల్ని, రాజకీయంగా ఎదుర్కోవటం చేతకాక, తప్పుడు ప్రచారాన్ని, సాయుధ దాడుల్ని ఆశ్రయించింది. ప్రజల్ని మోసం చేస్తూ, వర్గ పోరాటం, విప్లవం పేరున ఒక సెక్షన్‌కు వ్యతిరేకంగా ఇంకొక సెక్షన్ ఎగదోస్తూ, వారి

ఐక్యమత్యాన్ని దెబ్బతీస్తున్నారు. వాళ్ళు సాయుధ దళాల్ని కొనసాగిస్తూ, హింసాత్మక చర్యలకు పాల్పడుతున్నప్పటికీ, వారి విప్లవ వ్యతిరేక కార్యక్రమాల (విప్లవం పేరుతోనే అనుకోండి) కారణంగా, పాలకవర్గాలు, ప్రభుత్వం లిబరేషన్ పార్టీకి చట్టబద్ధత కల్పిస్తూ, వారి నాయకుల్ని ఎన్నికల్లో పాల్గొనటానికి విధానసభ, లోకసభలను అలంకరించటానికి అనుమతిస్తున్నారు. ప్రభుత్వ రక్షణతోపాటు వాళ్ళు ప్రభుత్వం నుంచి అనేక రకాల ప్రయోజనాలు పొందుతున్నారు. 'సర్కారు (ప్రభుత్వ) నక్సలైట్ల' హోదాని లిబరేషన్ పొందగలుగుతోంది.

కానీ, ఇంతకముందు ఇప్పుడు మామీద లిబరేషన్ చేసిన, చేస్తున్న దాడుల స్వభావంలో ఒక తేడా వుంది. ప్రారంభంలో, మా పార్టీ కొత్తదిగా, చిన్న పార్టీగా వుంటే, లిబరేషన్ పెద్ద పార్టీ అనే అహంకారంతో చాలా పరిమితమైన మా ప్రజా పునాదిని మింగేసే స్థాయిలో మా మీద దాడుల్ని ప్రారంభించింది. కానీ ఇప్పుడు క్షీణిస్తున్న వారి ప్రజాపునాదిని కాపాడుకోలేని నిరాశా, నిస్సహాయ స్థితిలో మామీద దాడులు చేస్తున్నారు.

ప్రారంభ దశలో, జెహనాబాద్ /తూర్పు ముఖ్దుంపూర్ రీజియన్లు/ జెహనాబాద్ జిల్లాలోని ఘోషి, కాకో, కుర్తా, కార్పి ఇంకా పాట్నా జిల్లాలోని కొన్ని ప్రాంతాలపై ప్రధానంగా వారి దాడులు కేంద్రీకరించారు. ఆ రోజుల్లో మా కార్యక్రమాలు జెహనాబాద్-పాట్నా బెల్ట్‌లోని ఈ ప్రాంతాలకే పరిమితం కాగా, లిబరేషన్ పార్టీ మామీద దాడులు ప్రారంభించడానికి, అనేక ప్రాంతాల నుంచి మా సంఖ్య కంటే అనేక రెట్ల పెద్ద మొత్తంలో తన సాయుధ బలగాల్ని కూడగట్టింది. ఆ సమయంలో చర్చల ద్వారా సమస్యని పరిష్కరించుకోవడానికి మేము కూడా ఎంతగానో శ్రద్ధ వహించాము. కానీ, వాళ్ళు దుష్ట తలంపుతో వున్నందువల్ల సమస్య మరింత ఘోరంగా తయారైంది. మా వునికిని కాపాడుకునే క్రమంలో పోలీసు నిర్బంధానికి, భూస్వామ్య ప్రైవేట్ సైన్యాలకు వ్యతిరేకంగానే కాక, లిబరేషన్ దాడులకు వ్యతిరేకంగా కూడా ప్రజల్ని కదిలించాము. వాస్తవాలను విస్తృతంగా ప్రచారం చేయటం ద్వారా వారి తప్పుడు ప్రచారాన్ని ఎదుర్కొన్నాము. సాయుధ ఆత్మరక్షణ చర్యలతో వారి సాయుధ దాడుల్ని ఎదుర్కొన్నాము. మా పార్టీకి మరో ప్రత్యామ్నాయం లేదు. దీని ఫలితంగా, ఆ ప్రాంతాల్లో రివిజనిస్టులకు, విప్లవ శక్తులకు మధ్య (అంటే నిజమైన శక్తులకు, తప్పుడు శక్తులకు మధ్య) తీవ్రమైన ఘర్షణలు చోటు చేసుకున్నాయి.

ఈరోజు అనేక పాత ఏరియాల్లో, సాయుధ ఘర్షణలు చాలావరకు ఆగిపోయాయి. అక్కడ విప్లవకర నక్సలైట్లు విజయం సాధించారు, సర్కారు (ప్రభుత్వ) నక్సలైట్లు ఓడిపోయారు. ఆ ప్రాంతాల్లో లిబరేషన్ ఇంకా వునికిలో వున్నప్పటికీ, ప్రారంభంతో పోల్చుకుంటే చాలా బలహీనపడింది. ఇప్పుడు వాళ్లు మామీద సాయుధ దాడులు నిర్వహించగల స్థితిలో లేరు. ఫలితంగా, మావైపు నుంచి కూడా సాయుధ దాడుల్ని ఆశ్రయించాల్సిన అవసరం లేదు. అయితే రాజకీయ పోరాటం కొనసాగుతూనే వుంటుందనుకోండి.

కానీ, వారి చారిత్రాత్మకమైన భోజ్‌పూర్ దుర్గంలో భోజ్‌పూర్ (ఒకప్పుడది మహోన్నత అమరులు కా॥ జోహార్, రామేశ్వర్, జగదీష్, బూటేన్‌ల నిజమైన విప్లవ కోట. కానీ, ద్రోహి వినోద్ మిశ్రా నాయకత్వంతో తరువాత రివిజనిస్టు స్థావరంగా మారింది) ఔరంగాబాద్‌లో మరొకసారి మేము విప్లవ జ్వాలను వెలిగించటం ప్రారంభించగానే, వారు సాయుధ దాడులు మళ్ళీ ప్రారంభించారు. లిబరేషన్‌కు సంబంధించిన సాయుధ బంట్లు ఒక రాజకీయ ప్రచారం నిర్వహిస్తున్న మా ప్రజా సంఘం ఊరేగింపుపై దాడి చేశారు. ప్రజల్ని కాళ్ళు, చేతులు కట్టేసి, నిర్దాక్షిణ్యంగా కొట్టి, వాళ్ళ వద్ద వున్న వస్తువులను దోచుకున్నారు. అమరులు కామ్రేడ్ హరి శర్మ, కా॥ సురేష్‌రామ్, కా॥ గిరిజారామ్‌ల అంత్యక్రియల సందర్భంగా జరుగుతున్న సమావేశం మీద కాల్పులు కూడా జరిపారు. ఈ కామ్రేడ్లను లిబరేషన్ చర్చలకు పిలిచి, మోసంతో చంపింది.

కానీ, లిబరేషన్ చంపింది ఈ ముగ్గురు కామ్రేడ్లని మాత్రమే కాదు. భోజ్‌పూర్, ఉత్తర ఔరంగాబాద్‌లలో మా ఎదుగుదలను అడ్డుకొనే క్రమంలో అప్పటి పి.యు.కి చెందిన మా కార్యకర్తలు కా॥ రాజేందర్ దాస్, లూతేన్ యాదవ్ లాంటి వారిని, మా మద్దతుదారులు కా॥ సునీల్ మహతో, రామ్‌కిషన్, రామ్‌దీప్ పాశ్వాన్, లాలన్‌రామ్ లాంటి అసంఖ్యాక కామ్రేడ్స్‌ను చంపారు. అనేక ఇండ్లను ధ్వంసం చేయటమేగాక పోలీసులను పిలుచుకొచ్చి అనేకమంది ప్రజల్ని అరెస్టు చేయించి, జైల్లో పెట్టించారు. అయినా కూడా భోజ్‌పూర్, ఉత్తర ఔరంగాబాద్‌లలోకి మా ప్రవేశాన్ని అడ్డుకోలేక పోయారు. విస్తృతమైన ప్రతిఘటన వల్ల ఎదుగుతున్న విప్లవశక్తుల ముందు రివిజనిస్టులు చివరికి తలవంచారు. మాపై సాయుధ చర్యల్ని ఆపవలసిన స్థితికి వాళ్ళు నెట్టబడటం వల్ల, మేము కూడా వాళ్ళకు వ్యతిరేకంగా ప్రతీకార సాయుధ చర్యల్ని నిలిపివేశాము.

ఈరోజు, జెహనాబాద్‌లోని కొన్ని చిన్న పాకెట్లు, పాలిగంజ్ జోన్, ధనుర్వాజోన్ లోని చిన్న భాగాలు వదిలేస్తే లిబరేషన్‌కు మాకు మధ్య ప్రధానమైన ఘర్షణలు పాట్నా జిల్లాలోని విక్రమ్-సొబత్‌పూర్-మసౌది రీజియన్లు ఇంకా వారి చారిత్రక కోటలాంటి మగధ్ రీజియన్‌లోని పున్ పున్ ప్రాంతం చుట్టూ కేంద్రీకృతమైనాయి. వాళ్ళ ప్రధాన చారిత్రక కేంద్రాలు వాళ్ళ చేతుల్లో నుండి జారిపోయినందుకు దిగ్భ్రాంతి చెందారు. మామీద నీచమైన అబద్ధాలను వ్యాపింప జేయటమేగాక, నిస్సహాయ స్థితిలో కోపంతో సాయుధ దాడుల్ని ఆశ్రయించారు. వాళ్ళ సాయుధ గూండాలు మా పి.జి.ఏ. దళాలను ఎదుర్కోలేక మా మద్దతుదార్లను పెద్ద ఎత్తున చంపుతున్నారు. ఉదాహరణకు మా దళానికి ఒకేసారి అన్నంపెట్టి, ఆశ్రయమిచ్చినందుకే వాళ్ళ సాయుధ గూండాలు సపధి గ్రామం (మసౌది పి.ఎస్.), ముక్దుంపూర్ (పున్‌పున్ పి.యస్.) గ్రామాల ప్రజలమీద దాడి చేసి చంపారు కూడా. ఛాటా (మసౌది పి.యస్.) గ్రామంలో మా మద్దతుదారుల్లో కృష్ణాదేవి అనే దళిత మహిళను చంపి, ఆ తరువాత ఆమెను పీపుల్స్‌వార్ ఏజెంటు అని ప్రకటించారు. యువజన సంఘం బి.ఎన్.ఎస్. (భారత నౌజవాన్ సభ) రాష్ట్రకమిటీ సభ్యుడు, మసౌది కార్యాలయం కార్యదర్శి, పూర్తిగా వికలాంగుడు అయిన కా॥ వినయ్ పాశ్వాన్‌ను చంపటం, వాళ్ళు చేసిన అత్యంత సిగ్గుమాలిన చర్య. బాఖ్రా గ్రామం నుంచి అతని మూడు చక్రాల సైకిల్‌మీద కార్యాలయానికి తిరిగి వస్తుంటే దాడిచేసి పాశ్వాన్‌ను చంపారు. వికలాంగుడు, నిస్సహాయుడైన వ్యక్తిమీద పథకం ప్రకారం చేసిన దాడి, వాళ్ళెంత పిరికివాళ్ళనేది చూపిస్తున్నది. ఇంకా ఇటీవల సోలాపూర్ (జెహనాబాద్ జిల్లా) గ్రామంలో మారణకాండ జరిపి

వెనుకబడిన కులాలకు చెందిన మా మద్దతుదారులు నలుగురిని చంపారు.

1997 నుండి ఈ మూడు సంవత్సరాల్లోనే కామ్రేడ్స్ జవహర్ యాదవ్, సర్వాసింగ్, మధేష్ రవిదాస్, శివరతన్ సింగ్, ఘోలత్ సింగ్, గజల్‌బింద్, జితేంద్ర యాదవ్, దినేష్ యాదవ్, మహేష్ యాదవ్, సంజీవ్ సింగ్, సుభాష్, వైద్యనాద్ యాదవ్, అజిత్, యాదవ్‌లతో సహా మా యాక్టివిస్టుల్ని మద్దతుదారుల్ని 45 మందిని లిబరేషన్ సాయుధ గూండాలు చంపారు. ఇంతవరకు దీన్ని సహించాము. కానీ చివరికి ప్రజల్నించి వత్తిడి పెరగటంతో, 2000 ఆగస్టు నుండి ప్రతీకార చర్యలు చేపట్టాము. వాళ్ళు వరసబెట్టి చంపేటప్పుడు ఒక్కమాట మాట్లాడలేదు గానీ, మేము ప్రతీకార చర్యలు చేపట్టగానే పనికి మాలిన వుత్తుత్తి మాటలు మొదలు పెట్టారు. మా చేతుల్లో వాళ్ళ మనుషులు డజను మంది చచ్చారని చెప్పటానికి మేమీమీ సందేహించటం లేదు. కానీ, మేమెప్పుడూ వాళ్ళ సాధారణ మద్దతుదారుల మీద గురిపెట్టలేదు. విప్లవకారుల హత్యల్లో పాల్గొన్న వాళ్ళనే హతమార్చాము. అంతేగాక ఆర్గనైజేషన్ ప్రాంతాల్లో మాతో ఘర్షణలకు సిద్ధమైన మరో డజను మంది కూడా మా చేతుల్లో చచ్చారు.

రివిజనిస్టులతో కూడా రాజకీయంగానే పోరాడుతామని మేము స్పష్టంగా చెప్తున్నాం. కానీ, అభివృద్ధి నిరోధకుల్లా రివిజనిస్టు శక్తులేవైనాగానీ మమ్మల్ని ఆయుధాలతో నాశనం చేయాలని చూస్తే తగిన శాస్తి జరిపిస్తాం. ఏమైనప్పటికీ ఇతర ఏరియాల్లో చేసినట్లు, విప్లవకారుల్ని హత్య చేయడానికే లిబరేషన్ ఎక్కువగా ప్రయత్నిస్తుందనటంలో సందేహం లేదు. ఒకవేళ అహంకారంతో సాయుధ చర్యలు చేస్తే, త్వరలోనే వాళ్ళ గర్వాన్ని అణచివేస్తాం. విక్రమ్-నౌబస్త-మసౌది బెల్ట్‌లో మాత్రమే కాదు, గతంలో వారి చారిత్రక కోటలాంటి పున్‌పున్‌లో కూడా రివిజనిస్టుల్ని మేము ఖచ్చితంగా ఓడిస్తాం. ఇకప్పుడు ఈ రీజియన్లలో కూడా ఇరు పార్టీల మధ్య ఘర్షణలు ముగింపు కొస్తాయి.

**ప్రశ్న : పీపుల్స్‌వార్‌కు రణవీర్ సేనతో సంబంధాలు వున్నాయని లిబరేషన్ నిందిస్తున్న దానికేమంటారు?**

**కాII శ్రావణ్ :** అసత్యాలు, అబద్ధాల మీద ఆధారపడే రాజకీయ పునాది కలిగిన పార్టీ, జరుగుతున్న సంఘటనల్ని వాస్తవంగానే విశ్లేషిస్తుందని ఎలా ఆశించగలం? వాళ్ళు ప్రజల కళ్ళల్లో దుమ్ముకొట్టి, అసత్యాలతో, అన్నిరకాల మోసాలు, జిత్తులు, నాటకాలు, వింత వింత దుష్ప్రచారాలతో ప్రజల్ని తెలివి తక్కువ వాళ్ళను చేస్తున్నారు. దీన్ని వ్యతిరేకించేవాళ్ళని రకరకాల అబద్ధాలు, కట్టుకథలల్లి నోరు మూపిస్తారు. వారి రాజకీయ ఉనికిని కాపాడుకోడానికి తక్షణంగా ఇది అవసరమైంది. వాస్తవంగా, ఈ లక్ష్యాల్ని సాధించేందుకే మాకీ సంబంధాలు అంటగట్టారు. ఇలాంటి వాటిలోనైతే లిబరేషన్ నైపుణ్యం సాధిస్తుదనేందుకు సందేహం లేదు.

మీరు మమ్మల్ని రణవీర్ సేనతో సంబంధాలున్నాయా? అని మాత్రమే అడిగారు కానీ, లిబరేషన్ అయితే మాకు రణవీర్‌సేనతోనే కాక, భూమిసేనతో కిసాన్ సంఘ్‌తో కూడా సంబంధాలు అంటగడుతున్నది. ఇంత మాత్రమేనా! పోలీసు అధికారులతో, ఆర్.జె.డి. ప్రభుత్వంతో కూడా మాకు సంబంధాలున్నాయని ప్రచారం చేస్తున్నారు.

పాలకవర్గ పార్టీలకు కూడా ఇలాంటి అహేతుక అబద్ధాలు కల్పించడానికి దమ్ముల్లేవు. ఇంత సాహసానికి పాల్పడినందుకు లిబరేషన్ జనరల్ సెక్రటరీ దీపంకర్ భట్టాచార్యని, ఇతర అగ్ర నాయకుల్ని అభినందించాల్సిందే. ఇలాంటి శుద్ధ అబద్ధాలతో ప్రజల్ని తెలివి తక్కువ వాళ్ళను చేసేదేమోగానీ, వాళ్ళ భండారం మాత్రం బయటపడ్తున్నది.

లిబరేషన్‌ని, దాని నాయకుడు దీపంకర్ బాబుని, మా పార్టీ అడుగుతున్నదేమంటే, మా పార్టీకి ఆర్.జె.డి.తో, పోలీసు వ్యవస్థతో సంబంధాలుంటే ప్రభుత్వం మా కార్యక్రమాలను ఎందుకు నిషేధించింది? మా ప్రజాసంఘాల మీద అప్రకటిత, ప్రకటిత నిషేధాలెందుకు అమలు చేస్తున్నట్లు? లాఠీలు, బుల్లెట్లతో పోలీసు దాడులెందుకు చేస్తున్నట్లు? మా ప్రజల్ని జైళ్ళల్లో కుక్కి-మమ్మల్ని విచ్ఛిన్నం చేయడానికి నిరంతరం కొత్త కొత్త పద్ధతులెందుకు తీసుకొస్తున్నట్లు? మా నాయకుల్ని, గెరిల్లాలను నిరంతరం పోలీసులెందుకు చంపుతున్నట్లు? మేము ఈ నిర్బంధాలన్నీ ఎదుర్కొంటుంటే, వాళ్ళ పార్టీకి సాయుధ గూండాల్ని తయారు చేసుకోవటానికి, అన్నిరకాలుగా చట్ట విరుద్ధంగా ఆయుధాలుంచు కోవడానికి అనుమతిస్తూ, హింసాత్మక చర్యలు కొనసాగించటానికి పూర్తి స్వేచ్ఛని ఇస్తున్నారు. వాళ్ళమీద నిషేధం లేదు. మరీ ఘోరంగా, రాష్ట్ర ప్రభుత్వం వాళ్ళ నాయకుల పూర్తి రక్షణకు హామీనిస్తూ, వాళ్ళకు అనేక రకాల రాయితీలు, సదుపాయాలు కల్పిస్తున్నదెందుకు?

వాస్తవమేమిటంటే సాయుధ వ్యవసాయ విప్లవాన్ని వదిలేసి నప్పటినుండి, సామ్రాజ్యవాదం, భూస్వామ్యం నుంచి ప్రజల్ని విముక్తి చేసి, నూతన ప్రజాస్వామిక భారతదేశాన్ని సృష్టించే లక్ష్యాన్ని వదిలేసినప్పటి నుండి, సాయుధ విప్లవ పంథాని వదిలేసి అసెంబ్లీ పార్లమెంట్‌లో ఎక్కువ సీట్లు సంపాయించి, ఎన్నికల ద్వారా అధికారం చేజిక్కించుకోవడానికి ప్రయత్నించినప్పటి నుండి, వాళ్ళ సాయుధ పోరాటాన్ని, ప్రభుత్వం మీద పాలకవర్గాలమీద గురిపెట్టకుండా ప్రజాస్వామిక, విప్లవ శక్తులమీద గురిపెట్టినప్పటి నుండి పాలకవర్గాలు లిబరేషన్‌కు ఈ సదుపాయాలన్ని కల్పిస్తూ వస్తున్నారు. లేకుంటే ప్రజల నిజమైన శత్రువు, మిక్కిలి క్రూరమైన, వ్యవస్థీకృత శక్తి అయిన ప్రభుత్వం మీద, పాలకవర్గాల మీద గురిపెట్టడానికి లిబరేషన్‌కు చేతులెందుకు వణుకుతున్నట్లు?

ఆర్.జె.డి.తో మాకు సంబంధాలున్నాయని నిందలు మోపుతూనే, విధాన సభలో అది ఆర్.జె.డి.తో, ఇతర పాలకవర్గ పార్టీలతో చేతులు కలుపుతున్నట్లు, వ్యతిరేకిస్తున్నట్లు ఆడుతున్న నాటకాలు దాని పచ్చి అవకాశవాదాన్ని బహిర్గత పరుస్తున్నాయి. లాలూ పాలకవర్గాన్ని, ఆర్.జె.డి. పార్టీని కాపాడటానికి, మధ్యే మార్గ (ప్రజానుకూల) ప్రజాస్వామిక ప్రభుత్వమనే పిలుపునిస్తూ, విధానసభలో ప్రతిపక్షాలకు వ్యతిరేకంగా లాలూకు మద్దతునిస్తూ, ప్రజల్ని పిచ్చోళ్ళని చేయడానికి ప్రయత్నించింది. కానీ తరువాత, చాలామంది లిబరేషన్ ఎం.ఎల్.ఏ.లను (ఐదారుమందిని) లాలూ కొనేసినప్పుడు ఆర్.జె.డి. పాలక వర్గమని, అభివృద్ధి నిరోధక పార్టీ అని పిలుపునిస్తూ పచ్చి అవకాశవాదాన్ని ప్రదర్శిస్తుంది. అలాగే, ఎన్నికల్లో గెలవడానికి పాలకవర్గ-నితీష్‌ల సమతా పార్టీని ప్రజాస్వామిక శక్తిగా పరిగణించే వరకు పోయింది. ఇక ఆ తరువాత రంగులు మార్చే

రాజకీయాల్లో భాగంగా జార్జి ఫెర్నాండెజ్‌కు అమెరికా ఏజెంటని, నితీష్ భూస్వాముల ఏజెంటని పిలుపునివ్వడానికి కూడా వాళ్ళు వెనుకాడటం లేదు.

గత సంవత్సరం, రబ్రీ ప్రభుత్వాన్ని తీసుకురావడానికి, నితీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటెయ్యడానికి వాళ్ళు పాలకవర్గ పార్టీలతో అవకాశవాద పొత్తులు కూడటమనేది మరో ఉదాహరణ. రబ్రీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత లిబరేషన్ దానికి వ్యతిరేకంగా నాటకమాడింది. పాలకవర్గ పార్టీలతో ఇలాంటి నాటకాలాడుతూ, ఇవన్నీ చేస్తూనే, ప్రజల కళ్ళల్లో దుమ్ముకొట్టడం లిబరేషన్ సంస్కృతిలో భాగం కాని, అది మా సంస్కృతి కాదు.

వాళ్ళ అవకాశవాదం, పాలకవర్గ పార్టీలతో ప్రవర్తించటం వరకే పరిమితం కాదు, విప్లవకారులతో ప్రవర్తించటంలో కూడా అవకాశవాదం కన్పిస్తుంది.

చకియా గ్రామ (ఇమాంగంజ్ దగ్గర) సంఘటన అందరికీ తెలిసిందే. అక్కడ మాకు మద్ధతిస్తున్న వెనుకబడిన కులాల రైతుకూలీలు ఒక జులాయి యువకుడు అగ్రకుల భూమిహార్ల అమ్మాయిని వేధించినందుకు ప్రజాపంచాయితీలో జరిమానా వేశారు. దీన్ని మసిబూసి మారేడు కాయ చేసి మేము అగ్రకుల భూమిహార్‌లకు కొమ్ముకాస్తూ, వెనుకబడిన కొయిరి కులానికి వ్యతిరేకంగా చర్య తీసుకున్నామని గొంతు చించుకొని ప్రచారం చేశారు. కొయిరీలను రెచ్చగొట్టటంతో వాళ్ళు ప్రజాకోర్టు నిర్ణయానికి వ్యతిరేకంగా ఊరేగింపు తీశారు. ఈ వివాదాన్ని సాకుగా తీసుకొని పోలీసులు విచక్షణా రహితంగా లాఠీ ఛార్జీ చేసి ముగ్గురు పిల్లల్ని చంపారు. ఈ ఉద్రిక్త పరిస్థితిలో, సహనాయకులతో కలసి దీపంకర్ బాబు ఇమామ్‌గంజ్‌కి వచ్చి బహిరంగ సభలో ప్రజా పంచాయితీ నిర్ణయానికి వ్యతిరేకంగా విషంకక్కి, ప్రజల్ని మా పార్టీకి వ్యతిరేకంగా రెచ్చగొట్టాడు. అంతేగాదు, కొయిరీల ఓట్లు దండుకోడానికి కుల విద్వేషాల్ని రెచ్చగొట్టి, మేము రణవీర్ సేనతో, పోలీసులతో కూడా కలిసి కుట్ర వున్నామనే నిందలు మోపాడు.

ఇక కొద్ది నెలల తర్వాత సేలాపూర్ (జెహనాబాద్)లో జరిగిన సంఘటనలో వాళ్ళు ఖచ్చితంగా మాకు ప్రత్యర్థులుగానే నిలబడ్డారు. ఇక్కడ గౌరీశంకర్ శర్మ (భూమిహార్) అనే అభివృద్ధి నిరోధకుడొకడు ప్రజలమీద అరాచకం చేస్తున్నందుకు, విప్లవకారులకు వ్యతిరేకంగా పోలీసులతో కుమ్మక్కైనందుకు వాడిమీద సాయుధ చర్య తీసుకున్నాం.మేము వాడి ఆస్థులు స్వాధీనం చేసుకుని, ఇళ్ళు పేల్చి వేసినప్పుడు, లిబరేషన్ వాళ్ళు మాపై ప్రజల్ని రెచ్చగొట్టటమేగాక, మా చర్యకు ప్రతీకారంగా మా మద్ధతుదారులైన నలుగురు పేద ప్రజల్ని చంపారు.

భూమిహార్ కుటుంబం వైపు న్యాయం మాట్లాడిన చిన్న విషయానికే మాకు రణవీర్ సేనతో, పోలీసులతో సంబంధాలు అంటగడుతూ ఇమామ్‌గంజ్‌లో మాట్లాడారే, మరి వారి రాజకీయ పరిభాషలోనే, సేలాపూర్‌లో వాళ్ళు ఎవరి కొమ్ముకాస్తూ నిలబడ్డట్లు? ఈ రెండు సంఘటనల్లో కూడా కులం సమస్య మీద వాళ్ళ పచ్చి అవకాశవాద విధానం బయటపడుతున్నది.

ప్రైవేటు సైన్యాలతో మాకు సంబంధాలున్నాయా, లేవా అనేది, వాస్తవాల వెలుగులో స్పష్టంగా కన్పిస్తూనే వుంది. భూమిసేన పుట్టిందే లిబరేషన్ పాత ఏరియాలైన పున్‌పున్, మసౌది, ధనుర్వా ఏరియాల్లోనైతే, జెహనాబాద్-మసౌది ఏరియాల్లో ప్రధానంగా వాళ్ళమీద తీవ్రమైన పోరాటాలు చేసింది మా పార్టీ (అప్పటి పి.యు.) యేననేది ప్రతి ఒక్కరికి తెలుసు. మా పార్టీ భూమిసేన మీద దృఢంగా పోరాడి, ప్రజల్ని రాజకీయంగా సాయుధంగా కదిలించి, సమర్థవంతంగా ఓడించింది. దీని ఫలితంగానే వాళ్ళు ప్రజలముందు, మా పార్టీ ముందు ఆయుధాలతో లొంగిపోయే స్థితికి నెట్టబడ్డారు. నేరస్థులుగా వాళ్ళకు ఆర్థిక జరిమానాలు, సాంఘిక బహిష్కార దండన కూడా పడింది.

లోరిక్ సేన కూడా లిబరేషన్ వారి నలందా ఏరియాలో పుట్టిందే. ఇక లోరిక్ సేన ప్రధాన బలగం అయిన రామానంద్ బందిపోటు ముఠాని మేము తుడిచిపెట్టేశాం. జెహనాబాద్‌లో మిగిలిన వాళ్ళ పని కూడా ముగించాం. అదే విధంగా కిసాన్ సంఘ్ కూడ లిబరేషన్ వాళ్ళ పాత ఏరియాలైన మసౌది, పాలిగంజ్‌ల్లో పుట్టిందే. ఆ సమయంలో ఈ ఏరియాల్లో మా కార్యక్రమాలు ఎక్కువగా లేవు. ఈ భూస్వామ్య గూండాలు లిబరేషన్ వాళ్ళ ప్రజాపునాది మీద పూర్తి దౌర్జన్యంతో పట్టు సాధించారు. ఈ గూండాలు తిష్కారా (మసౌది), దరియాపూర్ (విక్రమ్), కర్కట్ భిషూ (పాలిగంజ్) మారణకాండల్లో లిబరేషన్ క్యాడర్‌ని, మద్ధతుదార్లని 27 మందిని చంపారు. అంతేగాక వేరు వేరు సంఘటనల్లో లిబరేషన్ వాళ్ళ ప్రజల్ని మరో డజను మందిని చంపారు. కానీ, కిసాన్ సంఘ్ గూండాలమీద, లిబరేషన్ వాళ్ళొక చిన్న సాయుధ చర్య మాత్రం చేసి, రాజకీయ ప్రతిపక్షంగా పోరాడే వరకే పరిమితమయ్యారు. ఫలితంగా, కిసాన్‌సంఘ్‌కు వ్యతిరేకంగా ఐక్యమయ్యారు. మసౌది దక్షిణ రీజియన్‌లో మా గెరిల్లాల మొదటి దెబ్బకే ఐదుగురు సాయుధ గూండాలు ఖతమయ్యారు. ఈ మొదటి దెబ్బకే కిసాన్ సంఘ్ గూండాలకు చుక్కలు కళ్ళబడినాయి. అక్కడ వాళ్ళ పని ముగించి, కాప్రిగంజ్‌లో కూడా వాళ్ళని దెబ్బతీశాం. ఈ తీవ్రమైన దాడులకు కిసాన్‌సంఘ్ ముక్కలైనప్పటికీ, ఇంకా కొన్ని చిన్న చిన్న మూకలు మిగిలాయి. మా గెరిల్లాలు వీళ్ళని కూడా పూర్తిగా తుడిచి పారేశారు. కానీ, ఇంత జరిగినా, లిబరేషన్ ప్రజాపునాది మధ్యనే కిసాన్ సంఘ్ బ్రతుకుతున్నా, వాళ్ళని లిబరేషన్ ఇంత కడా వేలెత్తి చూపలేదు.

భూస్వామ్య ప్రైవేటు సైన్యాలతో నిజంగా పోరాడిందెవరో చరిత్రే సాక్ష్యాలు చూపిస్తుంది. ఆసక్తికరంగా రణవీర్ సేన కూడా లిబరేషన్ కోట యిన భోజ్‌పూర్‌లోనే పుట్టింది. లిబరేషన్ తప్పుడు పంథా వల్ల, సమర్థవంతమైన సాయుధ చర్యలు తీసుకోక పోవటం వల్ల రణవీర్ సేన ఎదిగి, శక్తి పుంజుకుని, లిబరేషన్ వాళ్ల ప్రజా పునాదిని తినేని, మగధ్ రీజియన్‌లో బలంగా కాలూనుకుంది.

ఈ రోజున సిగ్గు లేకుండా లిబరేషన్ మమ్మల్ని రణవీర్ సేనతో సంబంధాలున్నాయని నిందిస్తున్నది గానీ, మొట్టమొదటినుంచీ ఆర్.ఎస్.కు వ్యతిరేకంగా మేము ప్రజల్ని రాజకీయంగా ఆర్థికంగా, సాయుధంగా పెద్ద ఎత్తున కదిలించిన విషయం జనానికి బాగానే తెలుసు. వాళ్ళమీద మేము ముప్పేట దాడి కొనసాగించాము. జాల్‌పుర (పాలిగంజ్)లో వందలాది ఎకరాల భూమి ఆక్రమించే విషయంలో మొట్టమొదట మేము వాళ్ళనెదుర్కొన్నాం. ఇక్కడ ఒక ప్రక్కన పోలీసు బలగాల అండతో వచ్చిన రణవీర్ సేనకు, మరోపక్క ప్రజలు,

గెరిల్లా దళాలకు మధ్య పెద్ద యుద్ధం జరిగింథి. పట్టపగలు ఏడు గంటల సేపు జరిగిన యుద్ధంలో రణవీర్‌సేన గూండాలు నలుగురు చావగా, ఇద్దరు పోలీసులు (ఒక ఇన్‌స్పెక్టర్‌తో సహా) గాయపడ్డారు. మరొకసారి 500 మంది (పాలిగంజ్)లో ఆకస్మాత్తుగా జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు ఆర్.ఎస్. గూండాల్ని మా గెరిల్లాలు ఖతం చేశారు. ఇక మరొకసారి నారాయణపూర్ మారణకాండ జరిపిన వెంటనే అందులో నలుగురు భీమ్‌పూర్ (జెహనాబాద్)లో ఖతమయ్యారు. బెర్తా (మక్దుంపూర్)లో రణవీర్ సేనకు చెందిన ముగ్గురు రాటుదేలిన గూండాల ఇళ్ళు తగలబెట్టి అందులోనే ఖతం చేయటం జరిగింది. ఇక అనేక హత్యాకాండాల్లో పాల్గొన్న ఆర్.ఎస్. నాయకుడు, కమాండర్ లాలా శర్మ (కుర్తా గ్రామం), గోబోధిన్ శర్మ (కాప్రి గ్రామం), శ్యాంశర్మ (ఆర్వాల్ గ్రామం)లను విడి విడి సంఘటనల్లో ఉరితీయటం జరిగింది. శంకర్ బిఘా మారణకాండ తరువాత కొద్ది రోజులకే వాగేశ్వర్ శర్మను, సి.పి.ఐ. నాయకుడ్ని, రణవీర్ సేన కార్యకర్తని మరొకణ్ణి కూడా ఖతం చేయటం జరిగింది. ఇవేగాక రాధాపూర్ (విక్రమ్), తూరి (బేలా), రామ్‌పూర్ (పాలిగంజ్) లాంటి అనేక ప్రాంతాల్లో మేము ఆర్.ఎస్. మీద దాడులు ప్రారంభించి, వాళ్ళ గూండాలు అనేకమందిని ఖతం చేశాం. దీనికితోడు, ప్రజల్ని కదిలించి ఆర్.ఎస్. అగ్ర నాయకులు 12 మందిని ఆర్థిక దిగ్బంధంలో బిగించాం.

అయినా గ్రామాల్లో తిరగడానికి తీరిక లేక నగరాల్లో కాలం గడుపుతున్న దీపంకర్ బాబుకి నిజం తెలుసుకోవాలనుకుంటే ఇప్పుడెవరు చెబుతారు. వూరకే శంకర్ బిఘా, బాతే గ్రామాలకు తీర్థ యాత్రలు చేస్తున్న ఆయనకేమీ అర్థం కాదు. రణవీర్ సేనకి గుణపాఠాలు నేర్పిన గ్రామాలకు అతడోసారైనా పోతే మంచిది. నిజంగా రణవీర్ సేనను ఎదుర్కొన్నది మా పార్టీనా? అతని పార్టీనా? అనేది మగధ గడ్డమీదకి పోతేనే అతనికి అర్థమౌతుంది. బహుశా అప్పటికీ అతనికి వెలగకకపోవచ్చు. పచ్చకామెర్లున్న వాళ్ళకు లోకమంతా పచ్చగానే కన్పిస్తుంది కనుక, సరైన దృక్పథమే లేని వాళ్ళకి, కళ్ళ ముందు వాస్తవాలు కన్పిస్తున్నా, విశ్లేషించి నిజం తెలుసుకోవటం కష్టమే.

అయితే ఈ విషయమై దీపాంకర్ బాబును ఎవరైనా ప్రశ్నించినట్లయితే చేరమ్ (అర్వాల్)లో జరిగినటువంటి కొన్ని సాయుధ చర్యలైనా ఖచ్చితంగా చెప్పగలడు. ఇక్కడ బాతే మారణకాండలో చనిపోయిన వారి అంత్యక్రియల నుండి ప్రజలు తిరిగొస్తుంటే, రాబోయే ఎన్నికల్లో దళితుల, వెనుకబడిన కులాల ఓట్లు దండుకొనే లక్ష్యంతో 9 మంది సామాన్య భూమిహార్లని లిబరేషన్‌వాళ్ళు చంపారు. అయితే వీరి చరిత్రలో మరొక ముఖ్యమైన ప్రతీకార చర్య కూడా వుంది. కానీ ఈ చర్యపట్ల లిబరేషన్ చడీ చప్పుడు లేకుండా వుండిపోయింది. ఎందుకంటే ఆ గొప్ప ప్రతీకార చర్య వెలుగులోకొస్తే వారు సిగ్గుతో తలదించుకోవలసి వస్తుంది మరి! అదేంటో చూద్దాం.

శంకర్ బిఘా మారణకాండ జరిగిన కొద్దిరోజుల తర్వాత, ప్రతీకారంగా వుల్సీ బజార్ (ఆర్వార్)లో షాపుకు వస్తువులు కొనుక్కోవడానికి వచ్చిన అమాయకులమీద లిబరేషన్ దళం దాడి చేసి అనేక మందిని చంపింది. అందులో ఎక్కువమంది ఆర్.ఎస్.తో సంబంధాలు లేని వెనుకబడిన కులాలకు చెందిన వాళ్ళు లేక దళితులు, చనిపోయిన అమాయకులు భూమిహార్లే అయితే వారిపై లిబరేషన్ బలంగా రణవీర్‌సేన ముద్రవేసి, ఈ సంఘటన నుండి రాజకీయ ప్రయోజనం పొంది వుండేది. వీటితోపాటు వీళ్ళు ఇద్దరు రణవీర్‌సేన గూండాల్ని చంపగలిగారు. వాస్తవాలు మగధ్ రీజియన్‌లో కన్పిస్తాయి. అక్కడ మా గెరిల్లాలు ఆర్.ఎస్.తో నిరంతరం పోరాడుతుంటే లిబరేషన్ రణవీర్‌సేనపై కాక పీపుల్స్‌వార్‌పైనే తీరిక లేనంత దాడులు చేసింది. ఇంకా వింతేమిటంటే, ఈ యుద్ధాలు, మారణకాండల మధ్య అప్పటి వినోద్‌మిశ్రా, ఆర్.ఎస్.తో చర్చలు చేయడానికి భోజ్‌పూర్ పర్యటన ప్రారంభించాడు. వాస్తవంగా 1997 నుంచి, మేము ఆర్.ఎస్. గూండాల్ని 40 మందిని చంపితే, అదే కాలంలో లిబరేషన్ మా ప్రజల్ని 45 మందిని చంపింది. ఆర్.ఎస్.తో మేము పోరాడుతుంటే, లిబరేషన్ మామీద దాడుల్ని చేసి మమ్మల్ని బలహీనపర్చాలని ప్రయత్నించింది. మరోపక్క అదే సమయంలో వాళ్ళ నాయకులు ఆర్.ఎస్.తో ఒప్పందాలు కుదుర్చుకునే ప్రయత్నాల్లో చురుగ్గా పాల్గొంటూ వచ్చారు. ఇది వాస్తవం. అద్దంలో కన్పించినట్లు వాస్తవాలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. ఆర్.ఎస్.తో నిజంగా పోరాడుతున్నదెవరో మీరే చెప్పండి.

ఈరోజు కూడా భూస్వామ్యానికి బీహార్ గట్టి కోటగానే వుంది. ఇక్కడి వర్గపోరాట క్రమంలో భూస్వామ్య ప్రైవేటుసైన్యాలు, గూండాసేనలు పుట్టి, ఆ తరువాత నాశనం కావడం సర్వసాధారణమై పోయింది. ఇది ఈ ప్రాంత ప్రత్యేకత. వాస్తవమేమిటంటే గ్రామాల్లో తీవ్ర అణచివేతకు గురౌతున్న పేద ప్రజలు, ప్రత్యేకించి దళిత కులాలు ఐక్యమై రాజకీయ, సామాజిక శక్తిగా తయారైతే భూస్వామ్య శక్తులు క్షణకాలం కూడా సహించవు. కుల విద్వేషాలు రెచ్చగొట్టి తమ సొంత అగ్రకులాల ప్రజల్ని ఉద్యమానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున కదిలిస్తారు. నిజమైన ప్రజా ఉద్యమాల్ని క్రూరంగా అణచివేసే క్రమంలో, దొంగల్ని, బందిపోట్లని, జులాయిల్ని అనేక రకాల నేరగాళ్ళని చేరదీసి సాయుధ సైన్యాలుగా కూడగడతారు. ఈ విధంగా భూస్వామ్య ప్రైవేటు సైన్యాలు, గూండా బలగాలు పుట్టి, ఆ తరువాత ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పాలకవర్గ పార్టీలకు, ప్రభుత్వ యంత్రాంగానికి మద్దతినిస్తాయి. ఈ విప్లవ ప్రతిఘాతుక శక్తి వర్గపోరాట ఫలితమే అనడంలో సందేహమేమీ లేదు. కానీ, దృఢమైన పునాదిపైన సరైన వర్గ పంథా ఆధారంగా వర్గ పోరాటాన్ని నిర్వహించినపుడే ఆ వర్గ పోరాటం వాళ్లను కూలదోసే శక్తిగా తయారవుతుంది.

అనేక భూస్వామ్య ప్రైవేటు సైన్యాలు లిబరేషన్ ప్రజాపునాది మధ్యనే పుట్టాయి. వాళ్ళ పార్లమెంటు రాజకీయాల వల్ల ఆ సైన్యాల్ని నాశనం చేయడానికి బదులు, అవి పెరిగి శక్తి పుంజుకోడానికి అవకాశమిచ్చారు. ప్రజాస్వామ్యం, భూమి, కూలిరేట్లు, భూస్వామ్య సామాజిక అణచివేత మొదలైన సమస్యలు నానాటికి పెరుగుతుంటే, భూస్వామ్య ప్రైవేటు సైన్యాలు తలెత్తే పరిస్థితుల్ని లిబరేషన్ కల్పించిందనటంలో సందేహం లేదు. ఈ సమస్యలపై గట్టి పోరాటాలు చేయటంమీద, ప్రజలు విజయం సాధించటంమీద వాళ్ళకు శ్రద్ధ లేదు. గ్రామాల్లో ప్రజల ప్రజాస్వామిక రాజ్యాధికారాన్ని స్థాపించడంలో, ప్రైవేటు సైన్యాల్ని తుడిచి వేయటంలోగానీ, అర్థవలస-అర్ధ భూస్వామ్య అధికారాన్ని కూలదోయటంలోగానీ వాళ్ళకు శ్రద్ధ లేదు. అనేక ప్రజాస్వామిక సమస్యలు లేవనెత్తి, ఓట్లు దండుకుని, వాళ్ళ నాయకుల్ని విధానసభ, లోక్‌సభలకు పంపే

క్రమంలో ప్రజల్ని పిచ్చోళ్ళను చేయడమే వాళ్ళ లక్ష్యం.

మేము కూడా భూస్వామ్య వ్యతిరేక ప్రజాస్వామిక సమస్యలు లేవనెత్తుతున్నాం. కానీ, ఖచ్చితంగా లిబరేషన్ లక్ష్యానికి వ్యతిరేకంగా, అంచెలంచెలుగా ప్రజల్ని రాజకీయ, సైనికశక్తిగా కూడగట్టి, భూస్వామ్య ప్రైవేటు సైన్యాల్ని తుడిచేయడమే గాక, ప్రభుత్వ క్రూర నిర్బంధాన్ని కూడా ఓడించి విప్లవ కమిటీలు ఏర్పరచి, అర్ధవలస-అర్ధభూస్వామ్య రాజ్యాధికారాన్ని కూలదోయటం ద్వారా ప్రజల మౌలిక ప్రజాస్వామిక రాజ్యాధికారాన్ని స్థాపించి, ఏరియాల వారీగా అధికారం చేజిక్కించుకుని గెరిల్లాజోన్లు ఏర్పాటు చేసి, విముక్తి ప్రాంతాలు ఏర్పాటు చేయటం, చివరగా, దీర్ఘకాలిక ప్రజాయుద్ధం ద్వారా గ్రామీణ ప్రాంతాలను విముక్తిచేసి, నగరాలను చుట్టుముట్టి అంతిమంగా ప్రజాస్వామిక భారతదేశాన్ని నిర్మించటం మా లక్ష్యం.

మరోవైపు బహిరంగ రాజకీయ పోరాటాలకు ప్రాధాన్యతనిచ్చే ప్రధాన లక్ష్యంతో లిబరేషన్ పార్లమెంటురాజకీయాలతో అంటకాగుతూ, భూస్వామ్య ముఠాలమీద సాయుధ పోరాటాన్ని ద్వితీయాంశంగా పరిగణిస్తూనే, కొన్నిసార్లు సాయుధ పోరాట నాటకం కూడా ఆడితే, అది మామూలు రైతులమీద పోరాటమేగానీ, భూస్వామ్య సాయుధ ముఠాల మీద పోరాటం ఎన్నటికీ కాదు. మరో అంశమేమిటంటే ఇతర రాజకీయ పార్టీల మాదిరిగా కావాలనే వర్గ పంథాను వదిలేసి, కులానికి కులం పోటీ అనే అవకాశవాద విధానాన్ని అమలు చేస్తున్నది. వాళ్ళు సమాజంలో కుల ఉద్రిక్తతలను పెంచి, ఒక సెక్షన్‌ను ఓట్ల కోసం కదిలించాలని చూస్తున్నారు. వాళ్ళు చేసేదేంటంటే విప్లవ ప్రజల మధ్య వర్గ ఐక్యతను నివారించటమో, నివారించ ప్రయత్నించటమో, లేదంటే వైషమ్య బీజాలు నాటి వర్గ ఐక్యతను వునికిలో లేకుండా నాశనం చేయటమే. దీనికి సాక్ష్యం కావాలంటే, 30 సం॥లుగా వాళ్ళ కోటలైన భోజ్‌పూర్, పున్‌పున్‌లలో వాళ్ళు చేస్తున్న పనే చూపిస్తుంది. అది సరే, మామూలు మధ్యతరగతి రైతుల్ని తమవైపు నిలబెట్టుకోలేకపోగా, కనీసం వాళ్ళను తటస్థంగా వుంచే మార్గదర్శకత్వం కూడా వాళ్ళకి కష్టంగానే వుంది.

**ప్రశ్న : ప్రత్యేకించి పున్‌పున్‌లో మీకు భూమిసేనతో సంబంధాలున్నాయని వాళ్ళు నిందిస్తున్న దానికి మీ ప్రతిస్పందన ఏమిటి?**

కా॥ శ్రావణ్ : ప్రస్తుతమూ, భవిష్యత్తులో కూడా ఇతర విప్లవ ప్రతీఘాతకుల మాదిరే ఈ రివిజనిస్టులు కూడా విప్లవకారులమీద తప్పుడు ప్రచార క్యాంపెయిన్‌ను ముఖ్యమైన ఆయుధంగా ఉపయోగిస్తూ, ఆ బలంతోనే ఉనికిలో వుంటున్నారు. వుంటారు కూడా. మాకు వ్యతిరేకంగా సాయుధ చర్యలతో క్యాంపెయిన్‌ను లిబరేషన్ క కొనసాగిస్తోందని మేమెప్పుడో ప్రకటించాం కదా.

1980లో భూమిసేన ఎలా పుట్టిందో, ప్రధానంగా మా దెబ్బకే 1984/85 నాటికి అది ఎలా అంతమైపోయిందీ ఇప్పటికే వివరించాము. అప్పటినుంచి 15 సం॥లు గడచిపోయాయి. ఈరోజు భూమిసేన పేరిట ఒక్కడు కూడా వునికిలో లేడు. కనుక, ఈరోజున ఎవడైనా ఫలానావాళ్ళను భూమిసేనతో సంబంధాలున్నాయని మాట్లాడితే, ప్రజలు వాడికి మతిచెడిందనే అనుకుంటారు.

మేం చెప్పడం కాదుగానీ, జెహనాబాద్-మసౌది రీజియన్‌లో లోరిక్‌సేనకు గతంలో వున్న మధ్యతరగతి, పేద రైతాంగ ప్రజాపునాదిని తటస్థంగా వుంచి, వాస్తవంగా అందులో పెద్ద సెక్షన్‌ను మావైపు తిప్పుకున్నట్లే జెహనాబాద్-పున్‌పున్ బెల్టులో భూమిసేనకు చెందిన మధ్యతరగతి ప్రజాపునాదిలో చాలా పెద్ద సెక్షన్‌ను తిప్పుకున్నది కూడా మేమే అనేది నూటికి నూరు పాళ్ళు నిజం. మాకు భూమిసేనతో సంబంధాలున్నాయనే లిబరేషన్ అర్థంలేని వాగుడంతా నీటిమీద ఆధారపడి మాట్లాడేదే. వాస్తవంగా, రైతుకూలీ, పేదరైతాంగం మీద ఆధారపడి, మధ్యతరగతి రైతాంగాన్ని కలుపుకుని, ధనికరైతు వర్గంలోని అభివృద్ధికర సెక్షన్‌ను మావైపు నిలబెట్టు కోవాలని చెబుతున్న మా రాజకీయ వర్గ పంథాలో ఈ ఐక్యత కూడా ఒక అంశం కాగా, దాన్ని మేము సాధించాము కూడా. లోరిక్సేన, భూమిసేనలకు చెందిన భూస్వామ్య శక్తుల కులపంథాని తిప్పకొట్టడం ద్వారా, ప్రజలమధ్య వర్గపంథాను విజయవంతంగా స్థాపించి, విప్లవోద్యమంమీద తప్పుడు ప్రచారాన్ని కూడా తిప్పకొట్టడం ద్వారా ఈ సేనలకు సంబంధించిన మధ్యతరగతి ప్రజాపునాదిని విజయవంతంగా మావైపు నిలబెట్టుకుని భూస్వామ్య సెక్షన్‌ను ఏకాకుల్ని చేశాం. మా రాజకీయ వర్గ పంథా సరైందని ఈ విజయం రుజువు చేస్తుంది. ఈరోజు, రణవీర్‌సేన చాలా దూకుడుమీద వున్నప్పటికీ, వాళ్ళ కులానికి చెందిన అభివృద్ధికర రైతాంగం మాతోనే వుంది.

చూడండి! నేను మీకొక ఆసక్తికరమైన సంఘటన చెప్తాను. ఖచ్చితంగా సంవత్సరం నాకు గుర్తులేదు కానీ, 1987/88 ప్రాంతాల్లో అనుకుంటా, వాళ్ళు ఇతర కులాలను తమ ప్రజాపునాదిలోకి తీసుకురావాలని చాలా ఆతృత చూపించారు. ఇందుకుగాను కుర్మి, యాదవ్, భూమిహార్ వగైరా కులాల ప్రజల పేరుతో కరపత్రాలు తీసి వాళ్ళకు పంచారు. ఇక ఎన్నికల పరుగుపందెంలో వాళ్ళు ఆ కులాల ఓట్లు కొన్ని సంపాయించవచ్చుకానీ, ప్రజలు ఈ కుట్ర అర్థం చేసుకుని ఈ విజ్ఞప్తుల్ని తిప్పికొట్టారు.

ఈరోజు, వివిధ కులాల నుంచి మధ్యతరగతి రైతాంగానికి చెందిన ఒక పెద్ద సెక్షన్ మా వర్గ పంథా ప్రభావంతో, మా పార్టీకి దగ్గరయ్యారు. మా వర్గ పంథా విజయాన్ని చూడలేక అక్కసుతో లిబరేషన్ కుతకుత ఉడుకుతున్నది. అందుకే మామీద అన్నిరకాల బురద జల్లుతున్నది. అదే కులాలకు కరపత్రాల ద్వారా విజ్ఞప్తులు చేసినప్పుడు, వాళ్ళకు భూమిసేన, లోరిక్‌సేన వగైరాలతో సంబంధాలున్నాయనేది గుర్తు రాలేదుగానీ, ఇప్పుడు ఆ కులాల్లోని మధ్యతరగతి రైతాంగాన్ని మేము కూడగడుతున్నందుకు భూమిసేనతో సంబంధాలున్నాయనే తప్పుడ కూతలు మొదలుపెట్టారు. ఇప్పుడు వాళ్ళమీద కూడా సాయుధ దాడులు ఎక్కుపెట్టారు.

**ప్రశ్న : వాళ్ళని ఖతం చేయడమే మీ ప్రధాన ఎజెండా అని, అందుకే వాళ్ళ ప్రజాపునాదిమీద దాడులు కొనసాగిస్తూ, మారణకాండలు జరుపుతున్నారని లిబరేషన్ నిందిస్తున్నది?**

కా॥ శ్రావణ్ : నిజమే. సూత్రరీత్యా కాదుగానీ లిబరేషన్‌ను మాత్రమేగాక సి.పి.ఐ., సి.పి.ఐ.(ఎం) లాంటి రివిజనిస్టు పార్టీలన్నింటిని పీకి పారేయటమనేది మా ఎజెండాలో ఒక తప్పనిసరైన అంశమే! మా పార్టీ ప్రధాన ఎజెండా ఏమిటంటే, విప్లవంలోని మొదటి దశలో సాయుధ వ్యవసాయ విప్లవం ద్వారా భూస్వామ్య, దళారీ

నిరంకుశ పెట్టుబడిదారీ విధానం, సామ్రాజ్యవాదాల నుండి, మన దేశాన్ని పూర్తిగా విముక్తి చేసి, సర్వ స్వతంత్ర, స్వయంసంపూర్ణ సంతోషమయ, నూతన ప్రజాస్వామిక భారతదేశాన్ని నిర్మించటమే. ఈ ప్రధాన ఎజెండాలో భాగంగా సి.పి.ఐ., సి.పి.ఐ.(ఎం)లను, లిబరేషన్ వంటి రివిజనిస్టులు అందర్నీ కూకటివేళ్ళతో సహా పెకిలించడం కూడా మా ఎజెండాలో వుంది. ఈరోజు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాజకీయంగా, సైద్ధాంతికంగా రివిజనిజం నుంచే విప్లవానికి పెద్ద ప్రమాదం వుంధి. అంతర్జాతీయ రివిజనిజంలోని విడి భాగాలే ఈరోజు భారతదేశంలోని సి.పి.ఐ., సి.పి.ఐ.(ఎం), లిబరేషన్‌లు. ఈ రివిజనిస్టుల్ని కూకటివేళ్ళతో పెకిలించకుండా, భారత విప్లవ విజయాన్ని సాధించడం అసాధ్యం.

కానీ, రివిజనిజాన్ని పెకిలించాలంటున్నామంటే రాజకీయంగా, సైద్ధాంతికంగా పెకలించాలనేగానీ, భౌతికంగా కాదు. రివిజనిస్టులందరిమీద పోరాటం చేసినట్లే, లిబరేషన్ మీద కూడా మార్క్సిస్టు-లెనినిస్టు-మావోయిస్టు పార్టీ రాజకీయ, సైద్ధాంతిక పోరాటాన్ని ప్రారంభంలో చేసింది. ఇప్పుడూ చేస్తున్నది, ఇక ముందు కూడా వాళ్ళు వునికిలో వున్నంతకాలం చేస్తుంది.

కానీ మేం మారణకాండకు దిగినట్లుగా చేస్తున్న ఆరోపణలను మాత్రం మతిమాలినవే.

వాళ్ళు మా ప్రజలమీద మారణకాండలు జరుపుతూ, పైగా మమ్మల్ని మారణకాండలు చేసేవాళ్ళంటున్నారు. ఇటీవల పేదవాళ్ళు, అమాయకులైన మా మద్దతుదారుల్ని (సేలాపూర్) నలుగుర్ని వాళ్ళు దారుణంగా చంపి, పైగా సిగ్గుకూడ లేకుండ తమ చర్యను సమర్థించుకుంటున్నారు. ఇది కూడ ముఖ్యమైన విప్లవ వ్యతిరేకి గౌరీశంకర్‌ను మేము శిక్షించినందుకు ప్రతీకారంగా చేసిందే. వీడు లిబరేషన్ అండతో మా ప్రజల్ని అనేకమందిని చంపి, అనేకమంది మా మద్దతుదారులమీద తప్పుడు కేసులు బనాయించి, వాళ్ళను నానా ఇబ్బందుల పాలజేసి భయపెట్టాడు.

దీనికి ముందుకూడా, అనేక సందర్భాల్లో వాళ్ళ సాయుధ గూండాలు మామీద చేసిన రెండు దాడులు విఫలమైతే, కదియా గ్రామంలో మా మద్దతుదారులమీద బడి నిర్దాక్షిణ్యంగా కొట్టారు. ఆ తరువాత కొద్దిరోజులకే 2000 సెప్టెంబర్ 12న అలాంటి సంఘటనే మరొకటి మసౌది ఏరియాలో జరిగింది. లిబరేషన్ వాళ్ళు మా దళం నాగ్ధన్ గ్రామంలో ఉన్న సమాచారం తెలుసుకుని, మా దళాన్ని ఆంబుష్ చేయాలని ఎరవేయడానికి కాల్పులు చేశారు. అదేమిటో తెలుసుకోవడానికి మా దళం పోతే విచ్చలవిడిగా కాల్పులు చేశారుగాని తప్పిపోయింది. మా దళం ప్రతిఘటించి, మరో దళంతో కలిసింది. మా రెండు దళాలు సాయుధ గూండాల్ని ఛాతా గ్రామందాకా తరిమారుగానీ, వాళ్ళు దొరకకుండ తప్పించుకున్నారు. కానీ, అనుకోకుండా ఛాతా గ్రామంలో వాళ్ళ మద్దతుదారుడికి మా తూటా తగిలింది. అతనికి చికిత్స చేయాలని ప్రయత్నించాంగానీ, చనిపోయాడు. మా ఉద్దేశం వాళ్ళ సాధారణ మద్దతుదారుల్ని చంపటం కాదు, మా ప్రజల్ని చంపిందానికి బాధ్యులైన గూండాల్ని ఖతం చేయటమే ఇక వాళ్ళు ఛాతా గ్రామానికి మారణకాండ చేయడానికే పీపుల్స్‌వార్ పోయిందని మామీద విస్తృత ప్రచారం చేశారు.

ఇప్పుడు సరిగ్గా నెలరోజులు గడవకముందే బద్యాపూర్ (పున్‌పున్ పి.ఎస్.) సంఘటన జరిగింది. ఇది పీపుల్స్‌వార్ మారణకాండగా పేర్కొంటూ ప్రసార మాధ్యమాలు లిబరేషన్ విస్తృతంగా ప్రచారం చేశాయి. వాస్తవం దీనికి పూర్తిగా వ్యతిరేకం. ఈ సంఘటనలో 9 మంది లిబరేషన్ గూండాలు చనిపోయినప్పటికీ భారీ ఎత్తున మారణకాండ జరపకుండ వీళ్ళని నివారించాము. వాళ్ళ గుండెకాయలాంటి ప్రాంతాల్లో మా పార్టీ వ్యాపించకుండా అడ్డుకోవడానికి తెల్ల బీభత్సం జరపడమే వాళ్ళ లక్ష్యం. 2000 అక్టోబర్ 1న జరిగిందేమిటి?

బద్వాపూర్ గ్రామస్థులు ముగ్గురు ఉల్లిగడ్డలు అమ్ముకోవడానికి పడవలో వేసుకుని పున్‌పున్ నదిలో వెళ్తుంటే, లిబరేషన్ గూండాలు దాడిచేసి ఉల్లిగడ్డలు దోచుకుపోయారు. బద్వాపూర్ గ్రామస్తులు ఆగ్రహంతో పక్కనున్న కరయా గ్రామానికి పోయి దోపిడీలో పాల్గొన్న వాళ్ళ దగ్గర్నుంచి ఉల్లిగడ్డలు తిరిగి తీసుకోవటం ప్రారంభించారు. కాని ఎరవేసి తమని అక్కడికి రప్పించి ఖతం చేయాలని ఉచ్చులు పన్నారనేది గ్రామస్థులకు అర్థమైంది. లిబరేషన్ గూండాలు పెద్ద సంఖ్యలో తమను సమీపించటం వారు త్వరగానే గమనించారు. అదృష్టవశాత్తు, తప్పించుకుని వాళ్ళ గ్రామానికి తిరిగొచ్చారు. గూండాలు వీళ్ళను వెంటాడి, బద్వాపూర్ గ్రామాన్ని చుట్టుముట్టి విచ్చలవిడిగా కాల్పులు చేయటం ప్రారంభించారు, ఈ శబ్దాలువిని, అక్కడికి దగ్గర్లోనే వున్న మా ఎల్.జి.ఎస్, గ్రామరక్షణ దళాలతో కలిసి, 30 మంది దాకా వున్న సాయుధ గూండాల మీద దాడి చేసింది. మూడు గంటలపాటు జరిగిన యుద్ధంలో వాళ్ళ గూండాలు 9 మంది చావగా మా ఎల్.జి.ఎస్ సభ్యుడు కా॥ సంజయ్‌కుమార్ అమరుడైనాడు. మా ప్రజలమీద మారణకాండ జరిపి భయోత్పాతం సృష్టించాలనే వారి కుట్ర ఇలా బెడిసి కొట్టడంతో, పీపుల్స్‌వారే అక్కడ మారణకాండ జరిపిందని విస్తృతంగా వాళ్ళు దుష్ప్రచారం చేశారు.

ఇది చేసింది మరెవరోగాదు, లిబరేషన్ జనరల్ సెక్రటరీ, ఇంకా ఇతర అగ్రనాయకులే పొరుగున వున్న సహరాజ్‌పూర్ గ్రామంలో అక్టోబర్ 15న బహిరంగ సభలో ఈ ప్రచారం చేశారు. పైగా పీపుల్స్‌వార్ మారణకాండ జరిపినప్పుడు, నిరాయుధులైన ప్రజలు బహిరంగ సభ నుంచి తిరిగొస్తున్నారనీ దీపంకర్‌బాబు మాట్లాడాడు. మమ్మల్ని రణవీర్‌సేనతో పోల్చుతూ, రక్తానికి రక్తం బదలు తీర్చుకొమ్మని ప్రజలకు పిలుపిచ్చాడు. పెద్ద ఎత్తున పోలీసు బలగాల రక్షణలో ఈ సభ జరిగితే, ఇదే అంశంమీద మక్దుంపూర్ (అక్టోబర్ 22)లో మా ప్రజాసంఘం నిర్వహించిన బహిరంగసభమీద పోలీసులు లాఠీచార్జీ చేశారు. అయితే పోలీసుల బెదిరింపులను, లాఠీలను ఎదుర్కొంటూనే మా సభ జరిగింది.

ఇప్పుడు లిబరేషన్ కొత్తపద్ధతి ఏమిటంటే, మా మద్దతుదారుల్ని చంపి, మారణకాండ జరిపారంటూ బాధితులపైనే నిందమోపటం తప్పుమీద ధోరిపూర్ (మసౌది)కు చెందిన మా మద్దతుదారుడు సభాష్‌సింగ్‌ని చంపి, అతడిమీద ఈ రకమైన నిందమోపారు. చిన్న ఆయుధం కూడాలేని ఒక మనిషి మారణకాండ జరపగలడా? ఇది కూడ వాళ్ళ చర్యల్ని కప్పిపుచ్చుకోవడానికేననేది స్పష్టమే. వాస్తవంగా వాళ్ళు ఊచకోత కోయడానికి నాలుగుసార్లు (కదియాలో రెండుసార్లు, ఛాతాలో ఒకసారి, బద్వాపూర్‌లో ఒకసారి) విఫలయత్నాలు చేసి, ఐదోసారి సేలాపూర్‌లో విజయవంతమయ్యారు. మామీద మారణకాండలకు పూనుకోవడం ఇప్పుడు వాళ్ళ సాయుధ

పనివిధానంలో భాగమే.

అయితే మా చర్యలన్ని నూటికి నూరుశాతం సరైనవేనని, మా విధానంలో భాగంగానే మా చర్యలు జరిగాయి తప్ప తప్పులు మానుండి జరిగలేదని మేం చెప్పటం లేదు, మేం కావాలని చేయకపోయినా, కొన్ని తీవ్రమైన తప్పులు జరిగాయి. వాస్తవంగా, వెనుకబడిన సమాజంలో పనిచేస్తున్నందువల్ల శాస్త్రీయ ఆలోచన విధానం కొరత ఎక్కువగా వున్నచోట్ల, ఇలాంటి తప్పులు జరగటానికి ఎక్కువ అవకాశం వుంది. కాని ఈ తప్పులు లిబరేషన్ మాదిరిగా పనివిధానంలో భాగంగా కావాలని చేసిన తప్పులు కాదు. అందువల్ల మా తప్పుల్ని బహిరంగంగానే బయటపెట్టి, స్వయంవిమర్శ చేసుకుని, తిరిగి మళ్ళీ ఇలాంటి తప్పులు జరగకుండ అన్ని విధాలుగా ప్రయత్నిస్తామని విజ్ఞప్తి చేస్తున్నాం.

బ్రహ్మర్ సంఘటనకు సంబంధించిన కేసు తీసుకుందాం. మా పార్టీకి సంబంధించి మగధ్ జోనల్ కమిటీ ముందుకొచ్చి ఈ సంఘటన పూర్వాపరాలు పరిశీలించిన తరువాత విడుదల చేసిన ప్రకటనలో సేలాపూర్ మారణకాండకు వ్యతిరేకంగా ప్రజల ఆగ్రహం ఫలితంగా ఈ చావులు సంభవించాయని చెప్పింది. అయినప్పటికీ అమాయకులైన సుబేధార్ పాశ్వాన్, సుధీర్ పాశ్వాన్‌లు ఇద్దరిని చంపడం సరైంది కాదని, ఈ దురదృష్టకర సంఘటనకు మా జోనల్ కమిటీ పూర్తి బాధ్యత వహించింది. ఈ చర్య చాలా విచారకరమైనదని, పూర్తి క్షమాపణ చెపుతూ, ఆ కుటుంబాలకు జరిగిన నష్టానికి తీవ్ర పశ్చాత్తాపాన్ని తెలియజేసింది. ఆ ఇద్దరూ లిబరేషన్ మద్దతుదారులైనప్పటికీ, మమ్మల్ని చంపే కార్యక్రమాల్లో వేటిలోనూ భాగస్తులు కాదని చెప్పింది. మా చర్య వల్లనే వీరిద్దరు చనిపోయారనే దాంట్లో అనుమానం లేదు. లిబరేషన్‌కు సంబంధించిన మామూలు మద్దతుదార్లనుకాక, వాళ్ళ హత్యా క్యాంపెయిన్‌లలో పాల్గొన్నవాళ్ళని మాత్రమే చంపాలనే మా విధానానికి ఇది వ్యతిరేకం. ఇలాంటి తప్పులు మళ్ళీ జరగకుండా ఖచ్చితమైన పద్ధతులు అవలంభిస్తామని హామీనిస్తూ, మా జోనల్ కమిటీ ప్రజలకు భరోసా ఇచ్చింది.

వాస్తవంగా, స్వతంత్ర ముఠాగా ఏర్పడి, 15 సం॥ల నుండి హత్యలు, లూటీలు, అత్యాచారాలు ఇతర నేరాలకు పాల్పడుతున్న, బ్రహ్మర్‌కు చెందిన మిథిలేష్ పాశ్వాన్ మహేంద్ర పాశ్వాన్‌లే మా ప్రధాన లక్ష్యాలని పత్రికా ప్రకటనలో తెలియజేశాం. వీళ్ళు లిబరేషన్ సాయుధ గూండాలుగా కూడా మారి, విప్లవకారులమీద లిబరేషన్ చేస్తున్న నీచమైన హత్యా క్యాంపెయిన్లలో చాలాకాలం నుండి పాల్గొంటున్న నమ్మకమైన సభ్యులు, కులానికి వీళ్ళు దళితులైె, దళితులకు చెడ్డపేరు తీసుకొస్తున్నారు.

**ప్రశ్న : ఈ ఘర్షణలన్నీ ఆగేదెప్పుడు? దీనివల్ల ప్రజలకే హాని జరుగుతున్నది గదా!**

**కా॥ శ్రావణ్ :** చాలా ముఖ్యమైన ప్రశ్న మీది. ఇది మీ ప్రశ్న మాత్రమే కాదు, ప్రజలందరిదీ, ఇంకా ప్రజాస్వామికంగా, అభివృద్ధికరంగా ఆలోచించే ప్రజలది కూడా.

చూడండి. ఆధిపత్యం కోసం కొట్లాడే రెండు ముఠాల మధ్య ఘర్షణలు కావివి. వేరు వేరు సిద్ధాంతాలు గల రెండు పార్టీల మధ్య ఘర్షణలివి. లిబరేషన్, పీపుల్స్‌వార్‌ల మధ్య పోరాటం, రివిజనిజానికి విప్లవానికి మధ్య పోరాటమే. ఒకటేమో ప్రజల్ని బహిరంగ, సంస్కరణవాదాల్లోకి గుంజుకొచ్చి, ఎన్నికల రొంపిలోకి ఈడ్చి, ఇక ఆ తరువాత వాళ్ళని పాలకవర్గాల ఏజెంట్లుగా తయారు చేయాలని చూసేది. మరొకటి సాయుధ విప్లవ మార్గంలో నూతన ప్రజాస్వామిక భారతదేశాన్ని నిర్మించాలని కోరుకునేది ఘర్షణల పునాది రాజకీయాలమీద ఆధారపడి వుంది గనుక, సమాధానం రాజకీయంగానే చూడాలి.

మేం ముందే చెప్పినట్లు, సి.పి.ఐ., సి.పి.యం., లిబరేషన్‌లు అంతర్జాతీయ రివిజనిజంలోని విడి భాగాలు మాత్రమే. వాళ్ళను కూలదోసే పోరాటం ప్రారంభంలో జరిగింది, ఇప్పుడూ జరుగుతున్నది, ఇక ముందు కూడ వాళ్ళు ఉనికిలో వున్నంతకాలం జరుగుతుంది. అందువల్ల ఈ రివిజనిస్టుల్ని కూకటివేళ్ళతో పెకిలించకుండా భారత విప్లవం తన లక్ష్యాన్ని సాధించటం అసాధ్యం. ఈరోజు, విప్లవానికి రాజకీయంగా, సైద్ధాంతికంగా రివిజనిజం నుంచి పెద్ద ప్రమాదం వుంది. కాని, రివిజనిజాన్ని పెకిలించాలని మా పార్టీ చెప్తున్నదేమంటే రాజకీయంగా సైద్ధాంతికంగానే గాని, భౌతికంగా కాదు.

ఒకప్పుడు పాట్నా, జెహనాబాద్, గయ జిల్లాలు సి.పి.ఐ.కి కంచుకోటలు. వాళ్ళపై రాజకీయంగా, సైద్ధాంతికంగా పోరాటం జరిగింది. గ్రామీణ ప్రాంతాల నుంచి వారిని తరిమేయటం జరిగింది. ఈరోజు ఈ రీజియన్లు పీపుల్స్‌వార్ కోటలుగా మారాయి. కాని, సి.పి.ఐ.ను ఎదుర్కొనేందుకు, ఒక్కసారి కూడ మేము తుపాకిని ఆశ్రయించలేదు ఎందుకు? మరోవైపు లిబరేషన్‌ను ఎదుర్కొనేందుకు వేసే ప్రతి అడుగులో మేం తప్పనిసరిగా తుపాకినెత్తాల్సిన అవసర మొచ్చింది. ఇది ఆలోచించాల్సిన ముఖ్యమైన ప్రశ్న. సమాధానం స్పష్టమే, కూలిపోతున్న తన ప్రజాపునాదిని నిలబెట్టుకోవడానికి, మామీద తుపాకులు ప్రయోగించే దమ్ములు సి.పి.ఐ.కి లేవు. కాని, లిబరేషన్‌తో మాకెదురైన పరిస్థితి వేరు. ఇటు మా విప్లవ రాజకీయాల ప్రభావం పెరుగుతుంటే అటు క్షీణిస్తున్న వాళ్ళ ప్రజాపునాదిని, చేజారిపోతున్న సాంప్రదాయిక కోటల్ని కాపాడుకోవడానికి లిబరేషన్ పోలీసుల్ని ఉపయోగించటమేగాక, తన సాయుధ గూండాలతో నీచమైన హత్యాకాండల క్యాంపెయిన్‌ను కూడా ఆశ్రయించింది. రణవీర్‌సేనను దెబ్బతీసే బదులు, మా యాక్టివిస్టుల్ని, మా మద్దతుదారుల్ని చంపారు. వాళ్ళు ప్రధానంగా రణవీర్‌సేనకు, ప్రభుత్వ నిర్బంధానికి వ్యతిరేకంగా రాజకీయ పోరాటమూ, విప్లవకారులమీద సాయుధ పోరాటమూ చేసే విధానాన్ని అవలంభిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో మా అభీష్టానికి వ్యతిరేకంగానే మేము రాజకీయ, సైద్ధాంతిక పోరాటం చేయటమేగాక, ప్రతీకార సాయుధ చర్యలను కూడా ఆశ్రయించక తప్పలేదు.

ఈరోజు మగధ్ ప్రాంతంలో ఏ రకమైన సాయుధ ఘర్షణలు జరిగి హత్యలు, హింసల కారణంగా ప్రజలకు మరింత హాని జరుగుతున్నప్పటికీ వీటికి పూర్తి బాధ్యత ఈ కృష్ణివ్/డెంగ్ రివిజనిస్టుల, వాళ్ళు ఇష్టానుసారం వ్యవహరించడానికి లైసెన్స్ ఇచ్చిన పోలీస్ యంత్రాంగానిదీ, ఆర్.జెడి. ప్రభుత్వానిదే అవుతుంది తప్ప మరెవరిదో కాదు.

ఘర్షణలు అంతమయ్యే మార్గాలు రెండున్నాయి:

మొదటిది : మామీద లిబరేషన్ తన సాయుధ చర్యల్ని నిలిపివేసి, బహిరంగంగా చిత్తశుద్ధితో తన అభిప్రాయాలు ప్రకటిస్తే, మా పార్టీ దీన్ని స్వాగతించి, మావైపు నుండి కూడా మేం సాయుధ చర్యలు చేయవలసిన అవసరం లేదని పార్టీ హామీ ఇస్తుంది. పోటీ తప్పనిసరైతే, అది రాజకీయ, సైద్ధాంతిక పోటీగా వుంటుంది. ఆర్.జె.డి. ప్రభుత్వం, పోలీసులు రెచ్చగొడితే వాళ్ళీచర్యల్ని చేశారు. రివిజనిజాన్ని కూలద్రోయడానికి ఈరోజుకూడా భౌతిక దాడులనుగాక, రాజకీయ, సైద్ధాంతిక పోరాటాలనే మా పార్టీ దృఢంగా నమ్ముతున్నది. అప్పుడు మాత్రమే ఘర్షణలు ఆగుతాయి. రీజియన్‌లో మళ్ళీ శాంతి నెలకొని, అనవసరపు, మితిమీరిన హాని నుంచి ప్రజలు బయటపడతారు.

తక్షణంగా సమస్యను పరిష్కరించే మార్గమిదే. కాని, ఇది దీర్ఘకాలిక క్రమం. శరవేగంతో ప్రజల్ని సమీకరించడానిక ఒకే ఒక ప్రత్యామ్నాయం వుంది. అదేమంటే రివిజనిస్టులను తన్ని తరిమేయటం లేదా విప్లవకారులకు వ్యతిరేకంగా వారు తుపాకులెత్తడానికి సాహసించలేని విధంగా వారి రాజకీయ, నిర్మాణపరమైన పట్టును బలహీనపర్చటం. అయితే ఈ క్రమంగా సుదీర్ఘకాలాన్నే తీసుకుంటుంది.

ప్రజాస్వామిక వుద్యమాల మీద నమ్మకం కల్గిన జర్నలిస్టులూ, ప్రజాస్వామిక, ప్రగతిశీల సంస్థలూ, వ్యక్తులూ అందరినీ తమకుతాముగా ఘర్షణలు జరుగుతున్న ప్రాంతాల్లోకి వచ్చి పరిశీలించి నిజాలు బయటపెట్టి ఘర్షణలు ఆగేందుకు ఆచరణాత్మక సలహాలివ్వమంటూ మాపార్టీ విజ్ఞప్తి చేస్తోంది. మీ ఈ ప్రయత్నాలను మా పార్టీ ఆహ్వానించి మీకవసరమైన సహాయాన్ని అందిస్తుంది. ❑

## అడ్డదారుల్లో జర్మనీకి ప్రయాణం చేస్తూ కుక్కచావు చచ్చిన కత్తుల సమ్మయ్య

కత్తుల సమ్మిగాడు కనుమరుగై పోయాడు. ఏప్రిల్ మధ్యలో జర్మనీలోని ఫ్రాంక్‌పర్ట్‌కి పోతూ శ్రీలంకలోని కొలంబో విమానాశ్రయం వద్ద జరిగిన విమాన ప్రమాదంలో కత్తుల సమ్మయ్య కుక్కచావు చచ్చాడు. ఆంధ్రప్రదేశ్ పోలీసుల రహస్య శిక్షణా చర్యలుగా అనుమానించబడుతున్న కార్యక్రమంలో పాల్గొనడానికి ఈ ధూర్తుడు ఇతరులతో కలిసి చెన్నై మీదుగా కొలంబోకి రహస్యంగా పయనమయ్యాడు. విమానం తన తదుపరి ప్రయాణం కోసం గాల్లో ఎగరబోతుండగా విమాన కేప్టెన్ అత్యవసర పరిస్థితిని –ఎమర్జెన్సీ ల్యాండింగ్–ప్రకటించాడు. విమానం నుండి ప్రయాణీకులు కిందికి దుమికే ప్రయత్నంలో భాగంగా కత్తుల సమ్మయ్య ప్రాణభీతితో అడ్డదిడ్డంగా కిందికి దుమకడంతో తలకు తీవ్రగాయమై తర్వాత కొలంబో ఆసుపత్రిలో చనిపోయాడు. అతనితోపాటు ప్రయాణిస్తున్న ఒక పోలీస్ ఇన్‌స్పెక్టర్ కొడుకు సైతం ఈ ప్రమాదంలో గాయపడినాడు. ''కత్తుల సమ్మయ్య ఇకలేరు'' అంటూ డి.జి.పి. దొర ఒక తొత్తు కుక్క చావుకు ఘనంగా నివాళులర్పించి వుండొచ్చు కానీ, సమ్మిగాడు కుక్కచావే చచ్చాడు. ఈ నమ్మకద్రోహిని విప్లవకారులు నేరుగా నిర్మూలించి వుండలేకపోవచ్చు, దేశం బయట విమాన ప్రమాదంలో ఇతగాడు చావటం నిజమే కావచ్చు కానీ, కొలంబో విమానం సీటులో సైతం నిద్రపట్టలేని స్థితిలో వాడిని చావు భయం చివరిదాకా వెంటాడిందనేదే పచ్చి నిజం...

ఆంధ్రప్రదేశ్ పోలీసులు నిర్వహించిన మొట్టమొదటి కోవర్ట్ ఆపరేషన్‌లో కత్తుల సమ్మడు పాలు పంచుకున్నాడు. దళంలో వుంటూ వీడు పోలీసులతో సంబంధం పెట్టుకుని, ఒకానొక రాత్రి పూట గాఢ నిద్రలో వున్న దళ కమాండర్‌ని, ఇద్దరు దళసభ్యులని దొంగచాటుగా కాల్చి చంపాడు. దాదాపు 8 సం॥ల క్రితం 1993లో కరీంనగర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. అప్పటినుండి వీడు తీవ్రవాద వ్యతిరేక పోలీసుల చర్యల్లో చురుగ్గా పాల్గొంటూ స్థానిక గ్రామీణ ప్రజలను భయపెడుతూ, వేధిస్తూ, దోపిడీ చేస్తూ వచ్చాడు. పీపుల్స్‌వార్ పార్టీకి చెందిన సాధారణ సభ్యులను, నాయకులనే కాక, పౌరహక్కుల నేతలను, సాంస్కృతిక కార్యకర్తలను, పార్టీకి సంబంధించిన ఇతర సానుభూతిపరులను చంపేందుకుగాను పోలీసులు వీడికి, లొంగిపోయిన ఇతర విద్రోహులకీ ఆయుధాలిచ్చి ముందుకురికించారు.

కాశ్మీర్‌లోని జాతి పోరాట వ్యతిరేక విద్రోహ ముఠాలు, అస్సాంలోని 'సల్ఫా' విద్రోహుల లాగా ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ ప్రోత్సాహ, ప్రమేయాలతోనే పుట్టుకొచ్చిన కౌంటర్ ఇన్‌సర్జెన్సీ ముఠాల్లో సమ్మయ్య అత్యంత కీలక వ్యక్తి అయినాడు. డి.ఐ.జి.లు, ఎస్పీల స్థాయి వున్నతాధికారులతో సన్నిహిత సంబంధంలో వుంటూ కింది స్థాయి అధికారులను లెక్క చేయకుండా ఇతగాడు ఆంధ్రప్రదేశ్ నలుమూలలా ప్రైవేట్ అడ్డాలు నడిపి, దొంగ పంచాయితీలు చేసి తానుమేసి, పోలీసు వున్నతాధికారులను కూడా మేపాడు. పోలీసు రక్షణలో వుంటూ పీపుల్స్‌వార్ పార్టీపై విషంకక్కి సవాలు చేస్తూ వచ్చిన ఇతగాడిని హైద్రాబాద్ నగరం నడిబొడ్డునే ఇంట్లో మందుపాతర పేల్చి ఖతం చేయడానికి గత సం॥రం పార్టీకి చెందిన ఒక యాక్షన్ టీం రంగంలోకి దిగింది. కానీ చివరి క్షణంలో జరిగిన సాంకేతిక లోపాల కారణంగా ఆ చర్య విఫలమయింది. ఇన్ఫార్మర్లకు లక్షలాది రూ॥లను పిక్స్‌డ్ డిపాజిట్ అందించి విప్లవకారుల పైకి వుసిగొల్పిన ప్రభుత్వ యంత్రాంగం విప్లవోద్యమం బారిన పడనున్న కీలకమైన ఇన్ఫార్మర్లను, కోవర్ట్‌గాళ్ళను విదేశాల్లో భద్రత కల్పించే పథకం పేరుతో వారికి సామ్రాజ్యవాదుల కౌంటర్ ఇన్‌సర్జెన్సీ ఆపరేషన్లలో శిక్షణ ఇప్పించడానికి కూడా సిద్ధమైంది. కత్తుల సమ్మయ్య ఉదంతం వెలుగులోకి రావడానికి మూడురోజుల క్రితం మాజీ నక్సలైట్లలో కొందరికి విదేశాల్లో భద్రత కల్పించడానికి కూడా పోలీస్ శాఖ ప్రయత్నిస్తున్నట్లు వార్తలొచ్చాయి.

కత్తుల సమ్మడి పాస్‌పోర్ట్, వీసాల మంజూరీ భాగోతం కూడా దీంట్లో భాగమే. గాలి మరల ద్వారా విద్యుత్‌ని తయారుచేసే ప్రాజెక్టుని సంపాదించడానికి అంటూ వ్యాపార మిషతో ఇతగాడికి పాస్‌పోర్ట్, వీసా మంజూరు చేయటంలో పోలీస్ యంత్రాంగం సకల చట్ట వ్యవస్థలనూ తోసి రాజంది. ఇతగాడికి వీసా మంజూరుకుగాను మండలాఫీస్ నుండి ఐ.జి. ఆఫీస్ వరకు చట్టపరంగా తొక్కిన అడ్డదారుల భండారం బయటపడి రాష్ట్ర ప్రజానీకాన్ని నివ్వెరపర్చింది. ఇదిలాగుంటే, ఇతగాడికి రాయలసీమ పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్ కొడుకుతో వ్యాపార సంబంధాలున్నాయని ఆరోపణలు వచ్చాయి. ఇంకా ఆంధ్రప్రదేశ్‌లో నడుస్తున్న తీవ్రవాద వ్యతిరేక చర్యలకూ, ఇతగాడి విదేశీ ప్రయాణానికి మధ్య సంబంధం వుందని కూడా అనుమానాలు వెల్లువెత్తాయి. చంద్రబాబునాయుడి ప్రభుత్వంతోనూ, కేంద్ర ప్రభుత్వంతోనూ ప్రత్యక్షంగా కుమ్మక్కై దేశంలో పీపుల్స్‌వార్ వ్యతిరేక కార్యక్రమాలను నిర్వహించటంలో, శిక్షణనివ్వటంలో, ఆయుధ సామగ్రిని అందివ్వటంలో సామ్రాజ్యవాదులు ప్రత్యక్ష పాత్ర వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో కత్తుల సమ్మడు వారి ప్రత్యేక నమ్మిన బంటు అయినాడు. ఇప్పుడితగాడు చచ్చే వుండొచ్చు అయితే సామ్రాజ్యవాదులు శిక్షణ నివ్వడానికి గోవిందరెడ్డి, నాగరాజు, నయీమొద్దీన్ వంటి ఇతర విద్రోహులు బతికే వున్నారు. కానీ ప్రజలూ, పీపుల్స్‌వార్ పార్టీ ఈ ధూర్త ద్రోహులు చేసిన పెను నేరాలకు వీరిని క్షమించి వదలటం ఎన్నటికీ జరగదు. వీళ్ళు సమ్మిగాడి లాగా చావకపోతే ప్రజల చేతుల్లోనే అంతిమంగా శిక్షకు గురవుతారు. ఈ కలుపు మొక్కలు తప్పనిసరిగా ఏరివేయబడతారు. ❑



ప్రజాగెరిల్లా సైనికుల సాంస్కృతిక ప్రదర్శన



కాంగ్రెస్ ముగింపు కార్యక్రమంలో సి.పి.ఐ. యం-యల్ [పీపుల్స్‌వార్] కార్యదర్శి ప్రసంగాన్ని వింటున్న పి.జి.ఎ. యోధులు



సి.పి.ఐ. యం-యల్ [పీపుల్స్‌వార్] మహాసభల్లో  పి.జి.ఏ. యోధులు




మహాసభల్లో సాంస్కృతిక ప్రదర్శన